మంగళవారం
11•2•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 227
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




## ఎస్సీ ఎస్టీ చట్టసవరణకు సుప్రీం ఓకే



రాజ్యాంగబద్ధమేనంటూ సమర్థన

- ఎఫ్ఐఆర్ నమోదుకు అనుమతి అక్కర్లేదన్న ధర్మాసనం
- ప్రత్యేక పరిస్థితుల్లో ముందస్తు బెయిల్
- ప్రాథమిక విచారణలో నేరం నిరూపణ కాకుంటే ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయవచ్చు

5

## ఆర్టీఐ కమిషనర్లుగా ఐదుగురు



కట్టా శేఖర్‌రెడ్డి | మైద నారాయణరెడ్డి | సయ్యద్ ఖలీలుల్లా | అమీర్ హుస్సేన్ | శంకర్ నాయక్

ఎంపికచేసిన సీఎం నేతృత్వంలోని సెర్చ్‌కమిటీ

గవర్నర్ ఆమోదం

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

3

## ఢిల్లీకి రాజెవరో తేలేది నేడే!




- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- 21 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు
- రెండు గంటల్లోనే ఫలితాల సరళి
- గెలుపుపై ఆప్, బీజేపీ ధీమా

2

# పాలనలో కొత్త పుంతలు

## సమర్థంగా సుపరిపాలన.. ప్రజలకు చేరువగా అధికార యంత్రాంగం

### సమస్యల సత్వర పరిష్కారం.. పక్కాగా ప్రభుత్వ పథకాల అమలు

### నేడు కలెక్టర్లతో సీఎం కేసీఆర్ కాన్ఫరెన్స్ • పాలనా సంస్కరణలు, కొత్త రెవెన్యూ చట్టంపై దిశానిర్దేశం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పరిపాలనను కొత్తపుంతలు తొక్కించేందుకు, యువ అధికారులలో జోష్ నింపేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఈ మేరకు పాలనాసంస్కరణల్లో వేగవంతమైన మార్పులు తీసుకొస్తున్నారు. ముఖ్యంగా ప్రజలవద్దకే అధికారులు వెళ్లేవిధంగా కార్యాచరణ రూపొందించి అమలుచేస్తున్నారు. ఇందులోభాగంగా తాజాగా జిల్లాకు ఇద్దరు అడిషనల్ కలెక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చారు. కొత్తగా రూపొందించిన పాలనా సంస్కరణలపై దిశానిర్దేశం చేసేందుకు హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం జిల్లాకలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కాన్ఫరెన్స్‌లో మంత్రులు, జిల్లా కలెక్టర్లతోపాటు, అడిషనల్ కలెక్టర్లు, అన్నిశాఖల కార్యదర్శులు పాల్గొంటారు. ప్రస్తుత పరిస్థితితోపాటు, ప్రభుత్వ ప్రాధాన్యాలను, ప్రజలకు పారదర్శకత పాలన అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కేసీఆర్ దిశానిర్దేశంచేసే అవకాశం ఉన్నదని అధికారవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పాలనలో వేగం, ప్రజలకు మరింత చేరువకావడం, ప్రజల వినతులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించడం, ప్రభుత్వసంక్షేమ, అభివృద్ధి పథకాలను మరింత ప్రభావవంతంగా అమలుచేయడం.. వంటి ప్రధానఅంశాలను చర్చించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ముఖ్యంగా పురపాలక, పంచాయతీరాజ్‌చట్టాల అమలుతోపాటు కొత్త రెవెన్యూచట్టం, భూవివాదాలకు ఫుల్‌స్టాప్ పెట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించనున్నట్టు సమాచారం.

**పాలనలో విప్లవాత్మకమార్పులు**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. 10 జిల్లాలను 33 జిల్లాలుగా విభజించడంతోపాటు, కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త మండలాలను ఏర్పాటుచేశారు. దీనివల్ల అధికారయంత్రాంగం ప్రజలకు మరింత అందుబాటులోకి వచ్చింది. కొత్త గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటుచేశారు. పంచాయతీరాజ్, పురపాలకచట్టాలను పర్యవేక్షించడానికి జిల్లాస్థాయిలో కొత్త వ్యవస్థను రూపొందించారు. ఇందులోభాగంగానే కలెక్టర్ల వ్యవస్థలో విప్లవాత్మకమార్పులను తీసుకువచ్చారు. జిల్లాల్లో జాయింట్ కలెక్టర్ల స్థానంలో ఇద్దరు అడిషనల్ కలెక్టర్ల వ్యవస్థను తీసుకువచ్చారు. తాజాగా జరిగిన బదిలీల్లో సుమారు 14 జిల్లాలకు ఇద్దరు చొప్పున అదనపు కలెక్టర్లను నియమించారు. ఒక అదనపు కలెక్టర్ రెవెన్యూ వ్యవహారాలు పరిశీలిస్తే మరో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలను పర్యవేక్షిస్తారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్లకు పారిశుద్ధ్యం, పచ్చదనం, తాగునీరు తదితర బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నది. ముఖ్యంగా పురపాలక, పంచాయతీరాజ్ చట్టాలను పకడ్బందీగా అమలుచేసే బాధ్యతను వీరికి అప్పగిస్తారన్న అభిప్రాయం అధికారవర్గాల్లో వ్యక్తమవుతున్నది. ఈ మేరకు సీఎం కేసీఆర్ కలెక్టర్ల సమావేశంలో

మిగతా 2వ పేజీలో

## ప్రతిష్ఠ ఆర్థికశక్తిగా

# తెలంగాణ



### పరిమితిలోనే అప్పులు

పార్లమెంట్ సాక్షిగా స్పష్టంచేసిన కేంద్రం

ప్రశ్న అడిగి కంగుతిన్న ఎంపీ కోమటిరెడ్డి

### కేంద్ర నిధుల వాటాలో రాష్ట్రానికి గండి

ఈసారి రూ.8 వేల -10 వేల కోట్ల లోటు

కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో వెల్లడి

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ**

తెలంగాణ అప్పుల ఊబిలో మునిగిపోతున్నదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని వీలుదొరికినప్పుడల్లా గొంతు చించుకుని అరుస్తున్న కాంగ్రెస్ పార్టీకి మరోసారి చేదు అనుభవం ఎదురైంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదనే ప్రశ్నేలేదని, తెలంగాణ రెవెన్యూలోటు లేకుండా ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధిస్తున్న బలమైన రాష్ట్రమని, అప్పులు కూడా పరిమితికి లోబడే ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన చెందుతున్నట్టుగా కేంద్రం నుంచి రావాల్సిన నిధుల వాటా తగ్గుతున్నదని నరేంద్రమోదీ సర్కార్ విడుదల చేసిన గణాంకాల్లో తేలిపోయింది. తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు కేంద్రం దృష్టికి వచ్చిందా? అప్పులు పరిమితికి పైబడి ఉన్నాయా? కేంద్రం నుంచి రాష్ట్రానికి అదనపు గ్రాంట్లు అందడం లేదన్నది నిజమా? కేంద్ర పథకాల నిధులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో యుటిలైజేషన్ సర్టిఫికెట్లను (యూసీలను) ఇస్తున్నదా? అంటూ కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమగ్ర వివరాలతో లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

**ఆర్థికంగా తెలంగాణ పరిపుష్టం**

తెలంగాణ ఆవిర్భవించిన నాటినుంచి ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్నదని, రాష్ట్ర సంపద ఏటేటా పెరుగుతూనే ఉన్నదని, లోటు బడ్జెట్ లేని రాష్ట్రాల్లో తెలంగాణ

మిగతా 2వ పేజీలో

# చెన్నూరుకు కాళేశ్వర గంగ

- ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో 1.35 లక్షల ఎకరాలకు జీవం
- మూడు బరాజ్‌ల పరిధిలో మూడు ఎత్తిపోతల పథకాలు
- సమగ్రసర్వే, డీపీఆర్ రూపకల్పనకు రూ.6.88 కోట్లు మంజూరు
- ప్రత్యేక చొరవ చూపించిన ప్రభుత్వవిప్ బాల్క సుమన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గం కాళేశ్వర గంగతో సస్యశ్యామలం కానున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడుబరాజ్‌ల బ్యాక్‌వాటర్‌ను బీడుభూములకు తరలించేందుకు మూడు లిఫ్టు పథకాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లిఫ్టుపథకాలపై సమగ్ర సర్వేతోపాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించేందుకు రూ.6.88 కోట్లు విడుదలచేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకాలతో చెన్నూరు నియోజకవర్గంలోని 1.35 లక్షల ఎకరాలకు శాశ్వత ప్రాతిపదికన సాగునీరు అందనున్నది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గోదావరిపై మూడు కీలకమైన బరాజ్‌ల నిర్మాణంతో కిలోమీటర్ల కొద్దీ గోదావరి సజీవంగా మారింది. ఈ బరాజ్‌ల బ్యాక్‌వాటర్‌ను బీడుభూములకు తరలించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు. ఈ క్రమంలో మూడుబరాజ్‌ల బ్యాక్‌వాటర్‌ను ఎత్తిపోసి చెన్నూరు నియోజకవర్గ పరిధిలో 55 వేల ఎకరాల స్థిరీకరణతోపాటు, 80 వేల ఎకరాల కొత్త ఆయకట్టు కలిపి మొత్తం 1.35 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని నిర్ణయించారు. చెన్నూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రత్యేక చొరవ చూపి.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. గతేడాది అక్టోబర్ 16న ఆయన జలసౌధలో నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, ఆదిలాబాద్ సీఈ జీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రాణహిత ప్రాజెక్టు ఎస్‌ఈ ఎం విష్ణుప్రసాద్, డీఈఈ జీ రామకృష్ణ, ఇతర అధికారులతో

మిగతా 6వ పేజీలో

## కరీంనగర్‌లో ఐటీ టవర్

# 18న ప్రారంభం

హాజరుకానున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్

పనులను పరిశీలించిన మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

3



ప్రారంభానికి సిద్ధమైన కరీంనగర్ ఐటీ టవర్

# తెలంగాణలో వైద్యసేవలు అద్భుతం



- ఇతర రాష్ట్రాలు అనుసరించాలి
- నీతిఆయోగ్ సభ్యుల ప్రశంసలు
- గజ్వేల్ ప్రభుత్వ దవాఖానను సందర్శించిన బృందం

2



For a test drive, SMS 'DUSTER' to 53030 or call on 1800 300 44444 (Open from Monday to Sunday, 7:00 am -11:00 pm). Select variants available in CSD. Special offers for Defence Personnel, Government, PSU and Corporate employees.

Terms and conditions apply. #Price mentioned is for DUSTER Petrol RXE for Ex-showroom Hyderabad and is exclusive of local taxes. *Benefits up to ₹200 000 include cash benefits of ₹200 000 on select DUSTER stock and version. ^Loyalty bonus at sole discretion of Renault India. Offers may vary across variants and cities. The above mentioned offers & benefits are valid till 29th February 2020 only and are through Renault dealership. For further details, please check T&C on Renault India website. For detailed offers, visit www.renault.co.in/offers. Renault India Pvt. Ltd. reserves the right to change or modify the mentioned schemes and conditions without prior notice. Renault India Pvt. Ltd. shall not be liable for any loss or damage arising from your failure to comply or understand the offer details. In the event of any dispute, all matters shall be governed by all applicable laws of India and Court at Gurugram shall have the exclusive jurisdiction. For detailed terms and conditions, please visit www.renault.co.in

SHOWROOMS: TELANGANA: KARIMNAGAR: RENAULT Karimnagar Mob: +91 9582305983. MANCHERIAL: RENAULT Mancherial Mob: +91 9582571953.

L&K | SAATCHI & SAATCHI

# గులాబీ గుబాళింపు

- సహకార ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ మద్దతుదారుల హవా
- ఏకగ్రీవాల్లో మెజార్టీ డైరెక్టర్లు, చైర్మన్ పదవులు కైవసం
- 15న జరిగే ఎన్నికల్లోనూ సత్తా చాటనున్న అభ్యర్థులు

7



కరీంనగర్‌లో ఘోరం

## ఇంటర్ విద్యార్థిని దారుణహత్య

7

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 65.00 | రిటైల్ లైవ్ | 87.00 |
| డ్రెస్డ్ | 126.00 | స్కిన్‌లెస్ | 144.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 350.00 | రంగారెడ్డి | 350.00 |
| మెదక్ | 350.00 | కరీంనగర్ | 353.00 |
| వరంగల్ | 353.00 | డజన్ ధర | 60.00 |

## త్వరలో పీఆర్సీ నివేదిక?

ప్రభుత్వానికి అందించేందుకు తుదిమెరుగులు

ఉద్యోగ విరమణ వయసుపెంపునకు సిఫారసు!

2



## స్పీకర్‌కు గవర్నర్ జన్మదిన శుభాకాంక్షలు

మంత్రి కేటీఆర్‌తోపాటు పలువురు ప్రముఖుల విషెస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం పలువురు ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సత్కరించారు. ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి, టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఫోన్‌లో పోచారానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో జీవించాలని, సంతోషంగా మరిన్నికాలాలు ప్రజాజీవితంలో ఉండాలని ఆకాంక్షించారు. శాసనసమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు బంజారాహిల్స్‌లోని పోచారం నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్‌కు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపినవారిలో మంత్రులు మహమూద్ అలీ, ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్ ఉన్నారు.

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

## త్వరలో పీఆర్సీ నివేదిక?

- ప్రభుత్వానికి అందించేందుకు తుదిమెరుగులు
- ఉద్యోగ విరమణ వయసుపెంపునకు సిఫారసు!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన తొలి పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) అతి త్వరలో నివేదిక సమర్పించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థల, కార్పొరేషన్ల ఉద్యోగులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న పీఆర్సీ నివేదికకు కమిషన్ తుదిమెరుగులు దిద్దుతున్నట్టు సమాచారం. ఉద్యోగ విరమణ వయస్సు పెంపునకు కమిషన్ సిఫారసుచేసే అవకాశం ఉండటంతో నివేదికపై సీనియర్ ఉద్యోగులు కోటి ఆశలు పెట్టుకున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సీఆర్ బిస్వాల్ చైర్మన్‌గా 2018 మే 24న ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర తొలి 'పే రివిజన్ కమిషన్' అన్నింటికి మార్గదర్శిగా ఉండేలా నివేదిక రూపొందించాలని నిర్ణయించింది. ఏర్పాటుకాగానే తన పనిని మొదలుపెట్టిన కమిషన్.. అన్ని ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు, శాఖలవారీగా అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. వివిధ కారణాల వల్ల పీఆర్సీ గడువును ప్రభుత్వం రెండుసార్లు పెంచింది. ప్రస్తుతం విధించిన గడువు ఈ నెల 24తో ముగియనున్నది. ఆలోగానే నివేదిక ఇవ్వడానికి కమిషన్ కసరత్తును వేగవంతంచేసినట్టు తెలిసింది. పీఆర్సీ కమిషన్ ఉద్యోగుల బిజినెస్ రూల్స్‌పై కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. జిల్లాలవారీగా, శాఖలవారీగా మంజూరైన పోస్టులు ఎన్ని? ఎంతమంది ఉద్యోగులున్నారు? ఖాళీలు ఎన్ని? కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎంతమంది? తదితర లెక్కలు తీసుకున్నట్టు తెలిసింది. వీటిని క్రోడీకరించి కొత్త జిల్లాలవారీగా ఉద్యోగుల క్యాటగిరీలను కూడా విభజిస్తూ నివేదికలో పొందుపరిచే అవకాశమున్నది.



# మహానేతకు మొక్క కానుక

- సీఎం కేసీఆర్ పుట్టినరోజున మొక్కలు నాటండి
- అధికారులకు, పార్టీ శ్రేణులకు మంత్రి కేటీఆర్ పిలుపు
- స్థానిక ప్రజాప్రతినిధులూ మొక్కలు నాటండి: మంత్రి ఎర్రబెల్లి
- 'ఈచ్‌వన్ ప్లాంట్‌వన్': ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపు




KTR @KTRTRS

On the 17th of February 2020, Hon'ble CM Sri KCR Garu will be turning 66

As we all know his passion for 'Haritha Haaram' request all @trspartyonline leaders & members to make sure you celebrate & mark our leader's birthday by planting at least one sapling each #EachonePlantOne

సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటాలని మంత్రి కేటీఆర్‌చేసిన ట్వీట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి, టీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా పెద్దఎత్తున మొక్కలు నాటాలని ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు పిలుపునిచ్చారు. ఈ నెల 17న సీఎం కేసీఆర్ 66వ సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నారని, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా గ్రీన్ కవర్‌ను పెంచేందుకు పెద్దఎత్తున మొక్కలునాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం మొక్కల పెంపకం పట్ల ఇష్టాన్ని చాటుకున్నారని కేటీఆర్ సోమవారం ట్విట్టర్ ద్వారా తెలిపారు. సీఎం కేసీఆర్ పుట్టినరోజున ప్రతి ఒక్కరూ ఒక మొక్కనాటి హరితహారంలో పాల్గొనాలని కోరారు. ఈ మేరకు తాను బాధ్యతలు నిర్వహిస్తున్న ఐటీ, పరిశ్రమలు, పురపాలకశాఖ అధికారులకు విజ్ఞప్తిచేశారు. జిల్లా కలెక్టర్లు కూడా మొక్కలునాటాలని ప్రత్యేకంగా కోరారు. టీఆర్‌ఎస్ శ్రేణులు కూడా పెద్దఎత్తున మొక్కలు నాటి అధ్యక్షుడు కేసీఆర్ జన్మదిన సంబురాలు నిర్వహించాలని సూచించారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 17న 'సెల్ఫీ విత్ సీఎం సర్ సాప్లింగ్' అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని మొక్కలు నాటుదామని రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంత్రి కేటీఆర్ పిలుపునందుకొని 'ఈచ్‌వన్ ప్లాంట్‌వన్' నినాదంతో ప్రతి ఒక్కరం మొక్కను నాటుదామన్నారు. భావితరాలకు హరిత బహుమతిని అందిద్దామని, గ్రీన్‌చాలెంజ్‌ను మరింత బలోపేతం చేద్దామని చెప్పారు. ఈనెల 17న మొక్కనాటి సెల్ఫీ దిగి 87909 09999 నంబర్‌కు వాట్సప్‌లో పంపించాలని సూచించారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనాటి సంరక్షించడం ద్వారా ఆయనకు అపురూపమైన కానుక ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజలను కోరారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ప్రజలతోపాటు వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, స్థానిక సంస్థల కో ఆప్షన్ సభ్యులు స్వయంగా మొక్కనాటి, వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, డీఎల్పీవోలు, డీపీవోలు, జెడ్పీ సీఈవోలు, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలోని అధికారులు, సిబ్బంది తలా ఒక మొక్కనాటాలని మంత్రి ఎర్రబెల్లి విజ్ఞప్తి చేశారు. ఐకేపీ మహిళా సంఘాలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.




సీఎం కేసీఆర్ పుట్టినరోజున మొక్కనాటి సెల్ఫీ దిగి పంపాలంటూ ఎంపీ సంతోష్‌కుమార్ ఇచ్చిన సందేశం

# వైద్యసేవల్లో నంబర్ 1

## తెలంగాణ గ్రామీణప్రాంతాల్లో వైద్యసేవలు అద్భుతం

- ఇతర రాష్ట్రాలు అనుసరించాలి
- నీతిఆయోగ్ సభ్యుల ప్రశంసలు
- గజ్వేల్ ప్రభుత్వ దవాఖానను సందర్శించిన బృందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ గజ్వేల్ రూరల్ / రాయపోల్:** ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నదని నీతిఆయోగ్ బృందం ప్రశంసించింది. గ్రామీణప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యసేవలు అద్భుతంగా ఉన్నాయని, ఇలాంటి కృషిని దేశంలో మరెక్కడా చూడలేదని కొనియాడింది. తెలంగాణలో అమలవుతున్న విధానాలను ఇతర రాష్ట్రాల్లోనూ అమలుచేయాలని పేర్కొంది. ఏడుగురు సభ్యులతో కూడిన నీతిఆయోగ్ బృందం రెండ్రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ప్రభుత్వ దవాఖానతోపాటు సమీపంలోని రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సందర్శించింది. గజ్వేల్ దవాఖానలోని పాలియేటివ్‌కేర్ సెంటర్ (ఉపశమన సంరక్షణ కేంద్రం)లో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి, ఇక్కడ అమలుచేస్తున్న విధానాలు, పద్ధతులపై ఆరా తీశారు. అనంతరం వైద్యులతోనూ మాట్లాడి వివరాలు తెలుసుకొన్నారు. క్యాన్సర్, పక్షవాతం బాధితులకు ఏవిధమైన చికిత్సలు అందిస్తున్నారు? వారు ఎలా కోలుకొంటున్నారు? తదితర విషయాలు తెలుసుకొని వైద్యులను అభినందించారు. గ్రామీణప్రాంత ప్రజలకు ఇలాంటి దవాఖానల ద్వారా నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, వైద్య, ఆరోగ్యశాఖ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా నీతిఆయోగ్ బృంద సభ్యుడు రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో రెండ్రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాలో, సోమవారం సిద్దిపేట జిల్లాలో పర్యటించినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలు అద్భుతంగా ఉన్నాయని, దేశం మొత్తం ఇక్కడి విధానాలను అనుసరించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లు, దవాఖానల్లో రోగులకు అందతున్న వైద్యసేవలు, తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ రాజేశ్‌సాగర్, డాక్టర్ అశోక్, సుధాకర్, జిల్లా మలేరియా అధికారి కాశీనాథ్, సూపరింటెండెంట్ మహేశ్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన వద్ద నీతిఆయోగ్ బృందంతో వైద్యులు

## రాగల రెండురోజులు పొడివాతావరణం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మహారాష్ట్ర, దాని పరిసర ప్రాంతాల్లో 3.1 కిలోమీటర్ల నుంచి 3.6 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండగా, దక్షిణ ఇంటీరియర్ ఒడిశా, దాని పరిసర ప్రాంతాల్లో 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనపడినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో మంగళవారం ఉదయంవరకు వాతావరణం చల్లగా ఉండడంతోపాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశమున్నట్టు వివరించారు. మరోపక్క సోమవారం రాత్రి నుంచి రాష్ట్రంలో ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నందున రాగల రెండు రోజుల్లో పొడివాతావరణం ఏర్పడి చల్లదనం తగ్గే అవకాశాలున్నట్టు చెప్పారు.

## లాభసాటి వ్యవసాయంపై సర్టిఫికెట్ కోర్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భూమి, నీటి యాజమాన్యంతో సుస్థిరమైన లాభసాటి వ్యవసాయంపై మూడు నెలల సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నట్టు వాలంతరి డైరెక్టర్ జనరల్ డాక్టర్ కృష్ణారావు వెల్లడించారు. ఈ నెల 25న ప్రారంభమయ్యే ఈ కోర్సుకు ఇంటర్/ఐటీఐ/డిప్లొమా చదివిన గ్రామీణ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అభ్యర్థులు 18 నుంచి 30 ఏండ్లలోపు వయసువారై ఉండాలని తెలిపారు. దరఖాస్తు ఫీజుగా రూ.500, కోర్సు ఫీజుగా రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుందని, అభ్యర్థులకు ఉచితంగా భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని చెప్పారు. పూర్తిచేసిన దరఖాస్తులను 15లోగా పంపాలి. వివరాలకు www.tswalamtari. cgg.gov.in వెబ్‌సైట్‌ను లేదా 77029 99856, 8978283737, 040-24006206 ఫోన్‌నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## ఏరియా దవాఖానలకు రూ.10 కోట్లు

ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైద్యసేవల విస్తరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం దుబ్బాక, గజ్వేల్ సీహెచ్‌సీలను ఏరియా దవాఖానలుగా అప్‌గ్రేడ్ చేసింది. ఆ దవాఖానల్లో తగిన సౌకర్యాల కల్పన కోసం రూ.10,02,81,000 నిధులు విడుదల చేస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్‌తివారీ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.46 గంటలకు

సూర్యాస్తమయం: 6.08 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం తదియ రాత్రి 2.54 వరకు, తదుపరి కృష్ణ చతుర్థి, నక్షత్రం: పుబ్బ మధ్యాహ్నం 2.24 వరకు, తదుపరి ఉత్తర, అమృత ఘడియలు: ఉదయం 8.43 నుంచి 10.08 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.18 నుంచి 4.42 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.02 నుంచి 9.48 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.20 నుంచి 3.07 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 2.45 నుంచి సాయంత్రం 4.11 వరకు.

# పటిష్ఠ ఆర్థికశక్తిగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

ఒకటని స్పష్టం చేశారు. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 వరకు తెలంగాణ రెవెన్యూ మిగులు రాష్ట్రంగా ఉన్నదని, ఇప్పటి వరకు తెలంగాణ తీసుకున్న రుణాలు కూడా 14వ ఆర్థిక సంఘం సిఫారసుచేసిన పరిమితులకు లోబడే ఉన్నాయని తెలిపారు. కేంద్ర నిబంధనలకు అనుగుణంగా తెలంగాణకు గ్రాంట్-ఇన్-ఎయిడ్ నిధులను మంజూరు చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం శాఖలవారీగా సకాలంలోనే యూసీలను ఇస్తున్నదని చెప్పారు. దీంతో టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇరుకునపడేయాలని చూసిన ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తానే ఇరకాటంలో పడ్డారు.

### కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధుల వివరాలు (రూ.కోట్లలో)

| అంశం | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 |
|---|---|---|---|---|---|
| కేంద్ర పన్నుల్లో వాటా | 12,350.72 | 14,876.61 | 16,420.07 | 18,560.88 | 13,009.40 (ఇప్పటి వరకు) |
| **గ్రాంట్స్ ఇన్ ఎయిడ్** | | | | | |
| ఎస్డీఆర్‌ఎఫ్ | 205.50 | 216.00 | 0.00 | 226.50 | 487.50 |
| స్థానిక సంస్థలు | 872.30 | 1,447.69 | 1,167.54 | 1,579.63 | 1,952.82 |
| ఎన్డీఆర్‌ఎఫ్ | 468.20 | 328.16 | 58.40 | 0.00 | 0.00 |
| ఇతర ఫైనాన్స్‌గ్రాంట్లు | - | - | - | - | - |
| ఇతర ప్లాన్ గ్రాంట్లు | - | - | - | - | - |
| స్పెషల్ అసిస్టెన్స్ గ్రాంట్ | 566.14 | 450.00 | 450.00 | 450.00 | 0.00 |
| ఇతర గ్రాంట్-ఇన్-ఎయిడ్ తోపాటు కేంద్ర పథకాలు | 7,266.91 | 7,279.33 | 6,382.86 | 25,785.75 | 5,737.43 |

**ప్రస్తుత** ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్లు, పన్నుల వాటా కలిపి రూ.30 వేల కోట్లకుపైగా రావచ్చని అంచనావేయగా.. ఇప్పటివరకు రూ.21,335 కోట్లు మాత్రమే వచ్చాయి. ప్రస్తుతమున్న సంక్లిష్ట పరిస్థితుల్లో దాదాపు రూ.10 వేల కోట్లు తక్కువగా రావడం అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నది. వచ్చే రెండు నెలల్లో గరిష్ఠంగా రూ.3 వేల కోట్ల నుంచి రూ.4 వేల కోట్ల వరకు వచ్చినా గతేడాది కంటే ఈసారి రూ.8 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల మేరకు గండి పడుతుందని అంచనా.

### తగ్గనున్న కేంద్ర నిధులు

రాష్ట్రప్రభుత్వం భావిస్తున్నట్టుగా ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రావల్సిన నిధుల్లో భారీగా కోతపడే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నది. అంచనా కంటే సుమారు రూ.8 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల మేరకు తగ్గే అవకాశమున్నదని కేంద్ర ఆర్థికశాఖ తాజాగా పార్లమెంట్‌కు సమర్పించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మోదీ ప్రభుత్వం ఓవైపు రాష్ట్రాల పన్నుల వాటాను ఒక శాతం తగ్గించడం, మరోవైపు కేంద్ర ప్రాయోజిత పథకాలు, గ్రాంట్-ఇన్-ఎయిడ్ నిధుల్లో కోత విధిస్తుండటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేటాయించాల్సిన రూ.450 కోట్ల స్పెషల్ అసిస్టెన్స్‌లో ఈసారి ఒక్కపైసా కూడా రాలేదు. వాస్తవానికి తెలంగాణలో వెనుకబడిన జిల్లాల్లో మౌలికవసతుల అభివృద్ధి, ఇతర అవసరాలకు ప్రత్యేక నిధులివ్వాలని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్నారు. ఈవిధంగా హైదరాబాద్ మినహా మిగిలిన తొమ్మిది ఉమ్మడి జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలుగా పరిగణించి ఏటా ప్రతి జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున మొత్తం రూ.450 కోట్ల గ్రాంటును ఇస్తున్నది. కానీ ఈ ప్రత్యేక సహాయం సకాలంలో అందకపోవడం వల్ల తెలంగాణకు పలు ఇబ్బందులు ఎదురవతున్నాయి. తొలి నాలుగు నెలల్లోనే ఈ నిధులివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా కేంద్రం స్పందించలేదు. ఈ ఏడాది ఇంతవరకు రూపాయి కూడా విదల్చలేదు. కేంద్రం తాజాగా విడుదలచేసిన గణాంకాల్లో ఈ విషయం స్పష్టమైంది.

### కేంద్ర పథకాలకు కోతలు

మంచినీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామంటూ జలశక్తి మంత్రిత్వశాఖను ఏర్పాటుచేసిన మోదీ సర్కార్.. తెలంగాణలో అమలవుతున్న 'మిషన్ భగీరథ'ను స్ఫూర్తిగా తీసుకొని 'హర్ ఘర్ జల్' అనే నినాదంతో ముందుకుసాగుతున్నది. తెలంగాణలో ఇప్పటికే ఇంటింటికీ మంచినీటిని అందిస్తున్న 'మిషన్ భగీరథ'కు ప్రత్యేక నిధులివ్వాలని 14వ ఆర్థిక సంఘం సిఫారసుచేసినా పైసా ఇవ్వని కేంద్ర ప్రభుత్వం.. సీఎస్‌ఎస్ (సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీం ) కింద ఉన్న మంచినీరు, పారిశుద్ధ్యానికి నిధుల కేటాయింపులో భారీ కోత విధిస్తున్నది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రూ.1,325 కోట్లు కేటాయించిన కేంద్రం 2018-19లో ఈ మొత్తాన్ని రూ.638 కోట్లకు తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరుతో ముగియనున్నా ఇప్పటివరకు కేవలం రూ.225 కోట్లు మాత్రమే కేటాయించింది. మరోవైపు గ్రామీణాభివృద్ధికి కేటాయించే నిధులు కూడా తగ్గుతున్నాయి. 2018-19లో రూ.1,598 కోట్లు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కేవలం రూ.879 కోట్లు కేటాయించింది. ఇలా చెప్పూపోతే కేంద్ర ప్రాయోజిత పథకాలకు 2015-16 నుంచి క్రమంగా తగ్గుతున్న నిధులు రూ.7,266 కోట్ల నుంచి రూ.5,737 కోట్లకు చేరాయి.

# విభజన హామీల అమలు ఎక్కడ?




- ఆర్థికమాంద్యం ఉపసంహరణకు చర్యలేవి?
- 15వ ఆర్థికసంఘం సిఫారసులతో తెలంగాణకు అన్యాయం
- లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి ఏపీ విభజనచట్టంలో పేర్కొన్న అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని.. తెలంగాణ ప్రతిపాదించిన పారిశ్రామికకారిడార్లను మంజూరు చేయాలని లోక్‌సభలో టీఆర్‌ఎస్‌పక్షనేత నామా నాగేశ్వర్‌రావు కేంద్రాన్ని కోరారు. ఆర్థిక మాంద్యం నుంచి బయటపడటానికి కేంద్రం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. కేంద్రబడ్జెట్‌పై చర్చ సందర్భంగా సోమవారం ఆయన లోక్‌సభలో మాట్లాడారు. హైదరాబాద్- వరంగల్, హైదరాబాద్- నాగ్‌పూర్, హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్లను మంజూరుచేయాలని, నిమ్జ్‌కు నిధులు ఇవ్వాలని కోరారు. కేంద్రం వద్ద అనేక రైల్వే, రోడ్ల ప్రాజెక్టుల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటన్నింటినీ మంజూరు చేయాలన్నారు. ఆర్థిక మాంద్యం సమయంలో బడ్జెట్ ప్రవేశపెట్టారని, 2020లో జీడీపీ ఐదుశాతం కంటే తక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారని, గత 12ఏండ్లలో ఇదే అతితక్కువ జీడీపీ అని తెలిపారు. ఆర్థిక మాంద్యంలో పెట్టుబడులు పెరుగడానికి చర్యలు తీసుకోవాలి, పెట్టుబడులు తగ్గడం ద్వారా ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఆర్థికమాంద్యం నుంచి బయటపడానికి ప్రతిపాదనలు తయారుచేయడంలో ప్రభుత్వం విఫలమయిందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.2.10 లక్షల కోట్లు పెట్టుబడుల ఉపసంహరణను లక్ష్యంగా పెట్టుకున్నట్టుగా ఆర్థికమంత్రి పేర్కొన్నారని.. ఒకే ఏడాది ఇంతపెద్ద మొత్తంలో పెట్టుబడుల ఉపసంహరణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గతేడాది పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చింది కేవలం రూ.18 వేల కోట్లు మాత్రమేనని తెలిపారు.

### తలసరి జీడీపీలో 145వ స్థానం

భారతదేశంలో తలసరి జీడీపీలో ప్రపంచంలో 185 దేశాల్లో 145వ స్థానంలో ఉన్నదని, మన పర్‌క్యాపిటా ఆదాయంలో ఎంత వెనుకబడి ఉన్నామో గుర్తించాలని నామా సూచించారు. 15వ ఆర్థికసంఘం పన్ను బదలాయింపును 42శాతం నుంచి 41శాతానికి తగ్గిస్తూ సిఫారసు చేసిందని.. రాష్ట్రాలకు ఇచ్చే పన్నుశాతం బదలాయింపును గతంలో ఎప్పుడు కూడా తగ్గించలేదని చెప్పారు. తగ్గించిన ఒకశాతాన్ని జమ్ము కాశ్మీర్‌కు ఇస్తున్నామని చెప్తున్నారని.. ఆ ఇచ్చే నిధులేవో కేంద్రం నిధుల్లోంచి ఇవ్వాలి కానీ, రాష్ట్రాలకు ఇచ్చేవి తగ్గించడమేమిటి? అని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణలాంటి ప్రగతిశీల రాష్ట్రాలకు 15వ ఆర్థికసంఘం సిఫారసులో నష్టం జరిగే అవకాశముందని అన్నారు. దీనిపై ప్రధాన మంత్రి జోక్యం చేసుకొని తెలంగాణకు న్యాయంచేయాలని విజ్ఞప్తి చేశారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా నల్లా నీళ్లు ఇస్తామని కేంద్రం ప్రకటించిందని.. తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే మిషన్ భగీరథను అమలుచేసి ప్రతిఇంటికీ నల్లా నీటిని అందిస్తున్నది, ఈ ప్రాజెక్టు దాదాపుగా పూర్తి కావచ్చిందన్నారు. మిషన్‌భగీరథ పథకంతోపాటు, మిషన్‌కాకతీయకూ నిధులు ఇవ్వాలంటూ నీతి ఆయోగ్ సిఫారసు చేసినా ఒక్కపైసా ఇవ్వలేదని తెలిపారు. 2011 జనాభా లెక్కలకోసం తీసుకున్న ప్రతిపాదనలపై నామా నాగేశ్వర్‌రావు అభ్యంతరం వ్యక్తంచేశారు. 1971 నాటి విధానాల ద్వారా జనాభా లెక్కలను సేకరించాలని కోరారు.

### ఏ బిల్లు అయినా తలుపులువేసే ఆమోదిస్తారు

పార్లమెంట్‌లో ఏ బిల్లు అయినా కారిడార్లు క్లియర్ చేసి, తలుపులు వేసేఆమోదిస్తారని.. ప్రత్యేక తెలంగాణ బిల్లును కూడా అలాగే ఆమోదించారని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్షనేత నామా నాగేశ్వర్‌రావు తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ బిల్లు ఆమోదంపై చేసిన వ్యాఖ్యలపై నామా పరోక్షంగా స్పందించారు. తెలంగాణ ఏర్పాటు పార్లమెంట్‌లో ఏకగ్రీవంగా జరిగిందని, అన్నిపార్టీలు మద్దతు తెలిపాయని గుర్తుచేశారు. కేసీఆర్ దీక్షకు మద్దతుగా 2009 డిసెంబర్ 9న పార్లమెంట్‌లో చర్చించాలని నాటి బీఏసీ సమావేశంలో బీజేపీ నేతలు అద్వానీ, సుష్మాస్వరాజ్ సహా 24 పార్టీల నేతలు కూడా అంగీకరించారని, కేసీఆర్ దీక్షకు మద్దతుగా అందరూ మాట్లాడారని తెలిపారు. బిల్లులోపై చర్చ సందర్భంగా బీజేపీ నేత సుష్మాస్వరాజ్ మాట్లాడుతూ సోనియాగాంధీ పెద్దమ్మ అయితే తాను చిన్నమ్మ అంటూ వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తుచేశారు. కాగా, లోక్‌సభలో నామా నాగేశ్వర్‌రావు ప్రసంగాన్ని బీజేపీ సీనియర్‌నేత, కేంద్ర మాజీమంత్రి రాజీవ్‌ప్రతాప్ రూఢీ ప్రశంసించారు. లోక్‌సభలో నామా ప్రసంగం తెలంగాణ ప్రజల ఆకాంక్షలు తెలిపేవిధంగా ఉన్నదని అభినందించారు.

### లోకం పోకడ



ప్లీజ్‌రా.. నువ్వు బాగా చదివి నా భవిష్యత్తు బాగుండేటట్టు చూడరా.. దండం పెడతా!

# పాలనలో కొత్త పుంతలు

మొదటిపేజీ తరువాయి...

నిర్దేశిస్తారని అంటున్నారు.

### రైతులకు ఇబ్బంది లేనివిధంగా..

ఉమ్మడిరాష్ట్రంలో అస్తవ్యస్తంగా ఉన్న భూరికార్డులను సీఎం కేసీఆర్ ప్రక్షాళనచేశారు. ఇందులోభాగంగా రెవెన్యూ అధికారులే నేరుగా గ్రామాలకు వెళ్లి, రైతులతో మాట్లాడి 90 శాతానికిపైగా రికార్డులు సరిచేశారు. రైతులకు అత్యంత భద్రతా ఫీచర్లున్న కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలను అందించారు. అయితే కొద్దిమంది రెవెన్యూ అధికారుల కారణంగా కొందరు రైతుల భూరికార్డులు తారుమారయ్యాయి. ఒకరి భూమి మరొరికి వెళ్లింది. ఒకరు కాస్తులో ఉంటే మరొకరిపేర్లు రికార్డుల్లో వచ్చాయి. కొంతమంది రెవెన్యూ అధికారులు లంచాల కోసం ఇలా చేశారన్న అపవాదు కూడా ఉన్నది. దీంతో రెవెన్యూశాఖలో అవినీతికి ఆస్కారంలేని కొత్త వ్యవస్థను తీసుకురావాలని సీఎం కేసీఆర్ తలచారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే కొత్త రెవెన్యూచట్టాన్ని తీసుకువస్తామని ప్రకటించారు. ముఖ్యంగా భూ లావాదేవీల్లో కోర్‌బ్యాంకింగ్ విధానం తీసుకువస్తామన్నారు. ఈ దిశగా చర్యలు వేగవంతంచేశారు. మరోవైపు ప్రతి యజమాని భూమికి టైటిల్ గ్యారంటీ ఇవ్వాలన్న యోచనలోనూ ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కొత్తగా తీసుకువచ్చే రెవెన్యూచట్టంపై లోతుగా చర్చించే అవకాశం ఉన్నది. కలెక్టర్ల నుంచి కూడా కొత్త రెవెన్యూచట్టం ఎలా ఉండాలన్న దానిపై సూచనలు తీసుకునే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే పాలనాసంస్కరణల్లో భాగంగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా జిల్లాకు ఒక అడిషనల్ కలెక్టర్‌ను నియమించారు. గతంలో జరిగిన జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లాకు ఒక రెవెన్యూ కోర్టు మాత్రమే ఉండాలని సీఎం చెప్పారు. ఇందులోభాగంగానే జిల్లాస్థాయిలో అడిషనల్ కలెక్టర్ నేతృత్వంలో రెవెన్యూకోర్టు నడిచే అవకాశం ఉంటుందని అధికారవర్గాలు అంటున్నాయి.

## ఢిల్లీకి రాజెవరో తేలేది నేడే!

ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠను కలుగజేసిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. 70 స్థానాలకు శనివారం జరిగిన ఈ ఎన్నికల కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్నది. ఓట్ల లెక్కింపు కోసం 21 కౌంటింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈసీ భద్రతా సిబ్బందిని మోహరించింది. కౌంటింగ్ ప్రారంభమైన రెండు గంటల్లో ఫలితాల సరళి, పార్టీల ఆధిక్యత తెలిసే అవకాశం ఉన్నది. కాగా శనివారం పోలింగ్ ముగిసిన వెంటనే విడుదలైన ఎగ్జిట్‌పోల్స్ సర్వేల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) తిరిగి అధికారంలోకి రానున్నట్టు వెల్లడైంది. అయితే, ఈ ఎన్నికల్లో తమ పార్టీకి 48 సీట్లు రావడం ఖాయమని బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు మనోజ్ తివారీ పేర్కొనడం ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఈ క్రమంలో మంగళవారం విడుదలయ్యే ఫలితాలపై ఆసక్తి నెలకొన్నది.

# మెడికల్ టూరిజంలో ముందడుగు

- రాష్ట్రానికి 15వ స్థానం తమిళనాడుకు ప్రథమస్థానం..
- పార్లమెంట్‌లో గణాంకాలు వెల్లడించిన కేంద్రం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైద్యరంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న పురోగతి మెడికల్ టూరిస్టులను సైతం విశేషంగా ఆకర్షిస్తున్నది. రాష్ట్రానికి వస్తున్న మెడికల్ టూరిస్టుల సంఖ్య ఏటేటా వృద్ధిచెందుతున్నట్టు కేంద్ర టూరిజం విభాగం గణాంకాలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లో వైద్యసేవలు పొందేందుకు 2016, 2017, 2018 సంవత్సరాల్లో వివిధ రాష్ట్రాలకు వచ్చిన విదేశీ మెడికల్ టూరిస్టుల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం సోమవారం పార్లమెంట్‌లో ప్రకటించింది. ఈ జాబితా ప్రకారం తెలంగాణకు వచ్చిన మెడికల్‌టూరిస్టుల సంఖ్య 2016లో 1,66,570లు ఉండగా 2017లో 2,51,846కు పెరిగింది. 2017లో మరింత వృద్ధిని సాధించిన ఈ సంఖ్య 3,18,154లకు ఎగబాకింది. రాష్ట్రంలో వైద్య రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలతోపాటు తరచూ వైద్యవిజ్ఞాన సదస్సులు, సమావేశాలు నిర్వహించడం, రాష్ట్రంలో ఉన్న ప్రత్యేక వైద్య సౌకర్యాలు, సదుపాయాలపై దేశ, విదేశాల్లో విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తుండటం తదితర కారణాల వల్ల మెడికల్ టూరిస్టుల సంఖ్య హైదరాబాద్‌కు ఏటేటా పెరుగుతున్నది.

**పెరుగుతున్న పర్యాటకుల సంఖ్య**

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం మెడికల్ టూరిజంలో తమిళనాడు ప్రథమస్థానంలో నిలిచింది. తెలంగాణ టాప్ 15లో స్థానం సంపాదించగా.. ఆంధ్రప్రదేశ్‌కు 16వ స్థానం లభించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి పర్యాటకరంగం ఏటా అభివృద్ధి సాధిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలకు వస్తున్నవారి సంఖ్య 60శాతానికి పైగా పెరిగింది. ప్రతి సంవత్సరం నగరాన్ని సందర్శించే వైద్య పర్యాటకుల సంఖ్య భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగాన్ని విస్తరింపజేసేందుకు కేంద్ర పర్యాటక విభాగం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నది. వైద్యరంగానికి సంబంధించి ప్రదర్శనలు, సదస్సులు నిర్వహించడంతోపాటు మార్కెట్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ (ఎండీఏ)కు ఆర్థికసహకారం,ప్రత్యేక పథకం ద్వారా ముందుగా ఆమోదించిన మెడికల్ టూరిజం సర్వీస్ ప్రొవైడర్లకు ఆర్థిక సహకారం అందించనున్నట్టు కేంద్రం పేర్కొన్నది.

## దేశవ్యాప్తంగా తెలంగాణకు గుర్తింపు

- దిశ, సమత కేసుల్లో సత్వర న్యాయం
- జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ప్రజ్ఞా పరాండే



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో అమలవుతున్న పథకాలకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉన్నదని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ప్రజ్ఞా పరాండే పేర్కొన్నారు. బాలల హక్కుల చట్టాలపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్త పర్యటనలో భాగంగా ఆమె రాష్ట్రానికి వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె సోమాజిగూడలోని దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన దిశ, సమత ఘటనల్లో బాధిత కుటుంబాలకు సత్వరన్యాయం జరిగిందన్నారు. ఈ కేసుల్లో తెలంగాణ పోలీసుల దర్యాప్తు అభినందనీయమని ప్రశంసించారు. బాలల పరిరక్షణ కోసం ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ వంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఎంతో కృషిచేస్తున్నారని కొనియాడారు.





కరీంనగర్ ఐటీ టవర్‌లో పనులను పరిశీలిస్తున్న ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్

## 18న కరీంనగర్‌లో ఐటీ టవర్ ప్రారంభం

హాజరుకానున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్

పనులను పరిశీలించిన మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

**కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఐటీటవర్‌ను ఈ నెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖల మంత్రి కే తారకరామారావు చేతులమీదుగా ప్రారంభించనున్నట్టు బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం వారు ఐటీటవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ జరుగాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఐటీటవర్ నిర్మాణానికి ఆమోదం తెలిపారన్నారు. 62వేల చదరపు అడుగుల స్థలంలో నిర్మించిన ఐటీటవర్.. కరీంనగర్‌కు ఒక మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఇక్కడ పనిచేసేందుకు 26 కంపెనీలు ప్రభుత్వాన్ని సంప్రదించగా.. ఇప్పటికే 15 కంపెనీలకు స్థలం కేటాయించినట్టు చెప్పారు. స్థలం కేటాయింపు పొందిన సంస్థల్లో 506 మంది ఉద్యోగులు పనిచేస్తారని చెప్పారు. మొత్తం మూడు షిఫ్టుల్లో కలిపి మూడు వేల మందికిపైగా ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. 80శాతం ఉద్యోగాలు స్థానికులకే లభించేలా చర్యలు తీసుకొంటున్నామని వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఐటీటవర్‌లో పనిచేసే సంస్థలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే వచ్చే ఏడాదిలో మరో టవర్‌కు డిమాండ్ వచ్చేలా ఉన్నదని, దీనికి కూడా స్థలం కేటాయిస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవి శంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావు, టీఆర్‌ఎస్ నాయకులు ఆరెపల్లి మోహన్, ఎడవల్లి విజయేందర్‌రెడ్డి, చల్లా హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ కమిషనర్లుగా ఐదుగురు

- ఎంపికచేసిన సీఎం నేతృత్వంలోని సెర్చ్‌కమిటీ
- గవర్నర్ ఆమోదం
- నియామక ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

సమాచారహక్కు చట్టం (ఆర్టీఐ) కమిషనర్లుగా రాష్ట్రప్రభుత్వం ఐదుగురిని నియమించింది. నమస్తే తెలంగాణ పత్రికా సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి, టీ న్యూస్ సీఈవో మైద నారాయణరెడ్డి, విద్యార్థి నాయకుడు గుగులోత్ శంకర్‌నాయక్, సోషల్ వర్కర్లు సయ్యద్ ఖలీలుల్లా, డాక్టర్ మహ్మద్ అమీర్ హుస్సేన్‌ను ఆర్టీఐ కమిషనర్లుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రతిపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ సభ్యులుగా ఏర్పాటైన సెర్చ్‌కమిటీ వీరిని ఎంపికచేసింది. అనంతరం సమాచారహక్కు కమిషనర్ల నియామకానికి ఐదుగురి పేర్లను ఆమోదిస్తూ గవర్నర్‌కు కమిటీ సిఫారసు చేసింది. వీరి పేర్లను పరిశీలించిన గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ సోమవారం సంబంధిత ఫైల్‌పై సంతకంచేశారు. రాజ్‌భవన్ నుంచి ఫైల్ రాగానే రాష్ట్రప్రభుత్వం ఐదుగురి నియామకానికి సంబంధించి ఉత్తర్వులు జారీచేసింది. వీరు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మూడేండ్లపాటు పదవిలో కొనసాగుతారని జీవోలో స్పష్టంచేశారు.

**విస్తృత విషయ పరిజ్ఞానం నారాయణరెడ్డి సొంతం**

మైద నారాయణరెడ్డి 1970లో ప్రస్తుత సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్‌లో వ్యవసాయకుటుంబంలో జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీజీ పట్టాపొందిన ఆయన 1995లో వార్త దినపత్రికలో ట్రైనీ సబ్‌ఎడిటర్‌గా జర్నలిస్టు ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. తర్వాత రిపోర్టర్‌గా మారి.. సీనియర్ రిపోర్టర్‌గా ఎదిగారు. 2003లో ఆంధ్రజ్యోతిలో సీనియర్ కరస్పాండెంట్, చీఫ్ రిపోర్టర్‌గా పనిచేశారు. రాజకీయ, శాసనసభ, నీటిపారుదల, విద్యా, శాంతిభద్రతలు రంగా ల్లో గొప్ప విషయపరిజ్ఞానం కలిగిన వ్యక్తి నారాయణరెడ్డి. 2007 నుంచి 2008 వరకు సాక్షి దినపత్రికలో చీఫ్‌రిపోర్టర్‌గా పనిచేశారు. 2008లో హెచ్‌ఎం టీవీలో చీఫ్‌రిపోర్టర్, బ్యూరో ఇంచార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2009 నుంచి టీన్యూస్ సీఈవో, ఎడిటర్‌గా సేవలందించారు. 2014 నుంచి 2019 వరకు తెలంగాణ ప్రెస్‌అకాడమీ సభ్యుడిగా జర్నలిస్టుల సంక్షేమంకోసం కృషిచేశారు. ట్రైనీ సబ్‌ఎడిటర్ నుంచి సీఈవో, ఎడిటర్ స్థాయికి ఎదిగిన నారాయణరెడ్డి దాదాపు అన్ని ప్రధాన పత్రికల్లో పనిచేశారు.

**గిరిజన విద్యార్థి నాయకుడు గుగులోతు**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బావోజీగూడెం గ్రామం భోజ్యతండాకు చెందిన గుగులోతు శంకర్‌నాయక్ 1986 జూలై 10న జన్మించారు. తల్లిదండ్రులు భాగ్యానాయక్, సాలమ్మది నిరుపేద గిరిజన కుటుంబం. శంకర్‌నాయక్ చిన్నతనం నుంచి కష్టపడి చదివి ఉన్నత విద్యనభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. విద్యార్థిసంఘ నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా వ్యవహరించారు. గిరిజన విద్యార్థి సంఘం స్థాపించి గిరిజన విద్యార్థుల హక్కుల కోసం పోరాడారు. ఓయూ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, సేవాలాల్ మహరాజ్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు.

**మైనార్టీ నాయకుడు అమీర్ హుస్సేన్**

హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ మహ్మద్ అమీర్ హుస్సేన్ 1969 డిసెంబర్ 21న జన్మించారు. ఎంబీఏ, ఎల్‌ఎల్‌బీ, పీహెచ్‌డీ చేశారు. కొన్నేండ్లుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. పేదవారినుంచి ఎలాంటి ఫీజు తీసుకోకుండా న్యాయసహాయం అందజేస్తూ సామాజిక సేవచేస్తున్నారు. ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాల్లో తలెత్తే సమస్యలను పరిష్కరిస్తున్నారు. వీటితోపాటుగా న్యాయపరమైన అంశాలపై ప్రజల్లో చైతన్యం, అవగాహన తీసుకురావడానికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. రక్తదాన, ఉచిత వైద్యశిబిరాలు, ఇతర సామాజికసేవా కార్యక్రమాలు చేస్తున్నారు. చిన్న పిల్లలు హక్కులు, బాలకార్మికుల విముక్తికి కృషిచేశారు.

**ఎల్‌ఎల్‌బీ పట్టభద్రుడు సయ్యద్ ఖలీలుల్లా**

హైదరాబాద్‌లోని ఆగాపురాకు చెందిన సయ్యద్ ఖలీలుల్లా 1961లో జన్మించారు. తండ్రి ఎస్సార్ రహీం. ఖలీలుల్లా 1989లో గుల్బర్గా యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బీ పట్టభద్రులయ్యారు. అనంతరం హైదరాబాద్ సిటీ క్రిమినల్ కోర్టులో జీవితకాల సభ్యత్వం పొందారు. ప్రస్తుతం ఓవర్సీస్ మ్యాన్‌పవర్ రిక్రూటింగ్ ఏజెంట్స్ అసోసియేషన్స్‌కు లీగల్ అడ్వయిజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

## జర్నలిస్టులకు కరదీపిక కట్టా శేఖర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కట్టా శేఖర్‌రెడ్డి స్వస్థలం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండల కేంద్రం పరిధిలోని మర్రిగూడెం. రైతు దంపతులైన కట్టా మల్లారెడ్డి, జానకమ్మ మూడోసంతానంగా 1961 డిసెంబర్ 5న జన్మించారు. మాడ్గులపల్లిలో పదోతరగతి పూర్తిచేసిన ఆయన నల్లగొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్, ఎన్జీ కాలేజీలో డిగ్రీ, నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ కాలేజీలో బీఈడీ చదివారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో తత్వశాస్త్రంలో ఎంఏ, లెనినిస్ట్ విద్యా తాత్వికతపై ఎంఫిల్ పూర్తిచేశారు. యూనివర్సిటీలో విద్యార్థి ఉద్యమనాయకుడిగానూ పలు బాధ్యతలు నిర్వహించారు. 1985లో శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ హ్యూమానిటీస్ కాలేజీ విద్యార్థిసంఘం అధ్యక్షుడిగా, సెనేట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. చదువు పూర్తయిన వెంటనే 1987లో ఉదయం దినపత్రికలో సబ్‌ఎడిటర్‌గా జర్నలిస్టు ప్రస్థానం మొదలుపెట్టారు. రెండేండ్ల తర్వాత పాత ఆంధ్రజ్యోతి పత్రికలో చేరి పదేండ్లకుపైగా వివిధ హోదాల్లో పనిచేశారు. ఆ తర్వాత రీడిఫ్.కామ్, వార్త పత్రికల్లోనూ కొద్దిరోజులు కొనసాగారు. పేదరిక నిర్మూలన కోసం రాష్ట్రప్రభుత్వం రూపొందించిన వెలుగు ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్‌గా 2002లో పనిచేశారు. ఆంధ్రజ్యోతి పత్రిక పునఃప్రారంభం నుంచి ఆరేండ్లపాటు ఏజే జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. వందలమంది పాత్రికేయులకు శిక్షణ ఇచ్చారు. తర్వాత రెండేండ్లు మహాటీవీలో ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2010లో నమస్తే తెలంగాణ దినపత్రిక ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన ఆయన వ్యవస్థాపక సీఈవోగా వ్యవహరించారు. 2014 నుంచి నమస్తే తెలంగాణ ఎడిటర్‌గా కొనసాగుతున్నారు. కట్టా సంపాదకత్వంలో వెలువడిన జర్నలిస్టు కరదీపిక పుస్తకం వర్ధమాన, యువ జర్నలిస్టులకు ఎంతగానో ఉపయోగపడుతున్నది.

**ఉద్యమంలో క్రియాశీలక పాత్ర**

ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ పత్రికల ద్వారా కట్టా శేఖర్‌రెడ్డి ఎన్నోవ్యాసాలు, సంపాదకీయాలు రాశారు. బొమ్మా-బొరుసు, బయోగ్రాఫ్ కాలమ్‌ల పేరుతో ప్రముఖులు, రాజకీయసందర్భాలను విశ్లేషించారు. కట్టా-మీఠా, మాటకుమాట శీర్షికల ద్వారా ఉద్యమ సమయంలో తెలంగాణ వ్యతిరేకశక్తులపై పదునైన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ నీటి వాటాలతోపాటు జల వనరుల ఆవశ్యకతపై 'నదుల కథ' పుస్తకాన్ని ప్రచురించారు. వార్తల సేకరణలో పలువురు జర్నలిస్టులు ఎదుర్కొన్న అనేక సంఘటనల అనుభవాల సంకలనంగా 'వార్తల వెనుక కథ' పుస్తకాన్ని సీనియర్ జర్నలిస్ట్ కే రామచంద్రమూర్తితో కలిసి రచించారు.

## ఉస్మానియాలో కరోనా వార్డు

ఇప్పటివరకు 75 మంది అనుమానితులకు పరీక్షలు

**హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/ బన్సీలాల్‌పేట్:** కరోనా ఎమర్జెన్సీ నేపథ్యంలో ఉస్మానియా దవాఖానలో ఐసోలేటెడ్ వార్డును ఏర్పాటుచేశారు. గతంలో ఏర్పాటుచేసిన స్వైన్‌ఫ్లూ వార్డును ముందుజాగ్రత్త చర్యగా కరోనా వార్డుగా మార్చినట్టు ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ తెలిపారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా ప్రత్యేక వైద్యబృందంతో కమిటీని ఏర్పాటుచేసినట్టు చెప్పారు. కమిటీలో మైక్రోబయాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ జ్యోతిలక్ష్మి, ఎస్పీఎం విభాగాధిపతి ప్రొఫెసర్ కిరణ్మయి, జనరల్ మెడిసిన్ ఇంచార్జి డాక్టర్ బీ శ్రీనివాస్, జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్, సీఏఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ రాజ్‌కుమార్ ఉన్నారు. గాంధీ, ఫీవర్, ఎర్రగడ్డ చెస్ట్ దవాఖానల్లో ఇప్పటికే ప్రత్యేక వార్డులను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే.

**గాంధీలో కరోనా పేయింగ్ వార్డు**

వీఐపీలు, వారి కుటుంబసభ్యుల కోసం గాంధీ దవాఖానలో ఐదు పడకలతో ప్రత్యేక పేయింగ్ వార్డును ఏర్పాటుచేస్తున్నామని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు. కొద్దిరోజులుగా పలువురు వీఐపీలు, వారి కుటుంబసభ్యులు వ్యాధి నిర్ధారణ కోసం గాంధీ దవాఖానకు వచ్చిన సందర్భాల్లో సాధారణ ఐసోలేషన్ వార్డుల్లో ఉండటానికి ఆసక్తిచూపలేదని, అం దుకే ఇలా ముందుకెళ్తున్నామని చెప్పారు.

**ఇప్పటివరకు ఒక్క కేసూ కాలేదు**

ప్రపంచంలోని 25 దేశాలను వణికిస్తున్న కరోనా వైరస్‌పై తెలంగాణలో వైద్యవిభాగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క కరోనా కేసు కూడా నమోదుకాలేదని వైద్యారోగ్యశాఖవర్గాలు వెల్లడించాయి. సోమవారం నాటికి మొత్తం 75 మందిని కరోనా వైరస్ అనుమానితులుగా గుర్తించి పరీక్షలు చేయగా.. అందులో 73 మందికి వ్యాధి లక్షణాల్లేవని తేలిందని, మరో ఇద్దరికి సంబంధించి వ్యాధి నిర్ధారణ పరీక్షల నివేదికలు రావాల్సి ఉన్నదని పేర్కొన్నాయి. కాగా, ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా కరోనా వైరస్ అనుమానితులకు గాంధీ దవాఖానలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం విశేషం.

# పది మెగావాట్లకు సింగరేణి సౌరవిద్యుత్

- జైపూర్‌లో మరో 5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం
- ఆగస్టునాటికి 220 మెగావాట్ల ఉత్పత్తి: సీఎండీ శ్రీధర్



మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సోలార్ పవర్‌ప్లాంట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి:** సింగరేణి సంస్థ నుంచి మరో ఐదు మెగావాట్ల సోలార్ పవర్ (సౌరవిద్యుత్) అందుబాటులోకి వచ్చింది. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో నిర్మించిన ఐదు మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్.. సోమవారం విద్యుత్ ఉత్పాదన ప్రారంభించింది. ఇక్కడ ఉత్పత్తయిన విద్యుత్‌ను శ్రీరాంపూర్ ఏరియా 33 కేవీలైనుకు అనుసంధానంచేశారు. గత నెల పదో తేదీన ఇదే కేంద్రం నుంచి తొలుత ఐదు మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తిచేసి, 33కేవీ లైను గ్రిడ్‌కు అనుసంధానం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ కేంద్రం నుంచి మొత్తం పది మెగావాట్ల సోలార్ పవర్ అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. మొదటి ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైన నెలరోజుల్లోనే రెండో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించడం విశేషం. డైరెక్టర్ ఎస్ శంకర్ పర్యవేక్షణలో వేగంగా నిర్మాణ పనులు పూర్తిచేసిన ఉద్యోగులు, సిబ్బందిని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ అభినందించారు. మణుగూరు, ఇల్లెందు, రామగుండం-3లో నిర్మాణంలో ఉన్న సోలార్ పవర్ ప్లాంట్ల నుంచి త్వరలోనే విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమవుతుందని చెప్పారు. ఆగస్టునాటికి 220 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పాదనకు పూర్తిస్థాయిలో కృషిచేయాలని ఉద్యోగులకు సూచించారు. సోలార్ పవర్‌ప్లాంట్ ప్రారంభ కార్యక్రమంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఇంచార్జి జీఎం మదన్‌మోహన్, తెలంగాణ విద్యుత్ సంస్థల నుంచి ట్రాన్స్‌కో ఎస్‌ఇ (మంచిర్యాల) సుధీర్, ఎస్‌ఇ రమేశ్‌బాబు, చీఫ్ కో ఆర్డినేటర్ మురళీధరన్, డీజీఎం (సోలార్‌ప్లాంట్) శ్రీనివాసరావు, నిర్మాణ సంస్థ బీహెచ్‌ఈఎల్ ఏజీఎం సుభాష్, పర్సనల్ మేనేజర్ అరవింద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 15 వరకు బీసీ ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకొనే వెనుకబడిన తరగతుల విద్యార్థులు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఆర్థిక సాయాన్ని పొందేందుకు ఈ నెల 15లోగా దరఖాస్తుచేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ సంయుక్త కార్యదర్శి సైదా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

Telangana State Co-operative Marketing Federation Ltd.,
CORRIGENDUM-II
In accordance to the tender notification published for disposal of Agricultural Commodities, (a) Red Gram -Schedule -I (b) Red Gram- Schedule-II (c) Bengal Gram (d) Jowar. It is hereby requested to note that the opening of tender is postponed for 10 days and opening of tenders for the above commodities is on 22.02.2020.
For further details please contact Ph: 7288879806, and 7288879829.
Date : 10.02.2020 Sd/- MANAGING DIRECTOR

# హాజీపూర్ కేసు దర్యాప్తు భేష్

దర్యాప్తు బృందాన్ని ఘనంగా సత్కరించిన డీజీపీ మహేందర్‌రెడ్డి



సోమవారం డీజీపీ కార్యాలయంలో రాచకొండ సీపీ మహేశ్‌భగవత్, అదనపు సీపీ సుధీర్‌బాబు, ఇతర పోలీసు అధికారులను సన్మానిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హాజీపూర్ వరుస హత్యలు, లైంగికదాడి కేసుల్లో సమర్థవంతంగా వ్యవహరించి, అతి తక్కువ సమయంలోనే కేసును ఛేదించారంటూ దర్యాప్తు బృందాన్ని డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రశంసించారు. నిందితునికి రెండు కేసుల్లో మరణశిక్ష, ఒక కేసులో యావజ్జీవ కారాగారశిక్ష విధించడంలో కీలకపాత్ర పోషించిన రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్, అడిషనల్ సీపీ సుధీర్‌బాబుతోపాటు సంబంధిత అధికారులను డీజీపీ ఘనంగా సత్కరించారు. సోమవారం డీజీపీ కార్యాలయంలో మహేశ్ భగవత్, సుధీర్‌బాబు, యాదాద్రి డీసీపీ నారాయణరెడ్డి, ఎస్‌వోటీ అడిషనల్ డీసీపీ ఎస్ సురేందర్‌రెడ్డి, భువనగిరి డీసీపీ భుజంగరావు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే చంద్రశేఖర్, భువనగిరి రూరల్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి, ఐటీసెల్ ఇన్‌స్పెక్టర్ ఎం శ్రీధర్‌రెడ్డి, బొమ్మలరామారం ఎస్‌ఐ ఎల్ మధుబాబు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ పీసీ చంద్రయ్య.. డీజీపీ మహేందర్‌రెడ్డిని కలిశారు. హాజీపూర్ ఘటన, విచారణ క్రమం, శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలు రూపొందించిన విధానం తదితర విషయాలను డీజీపీ అడిగి తెలుసుకున్నారు. 2015 నుంచి హాజీపూర్‌లో జరిగిన మిస్సింగ్‌కేసులతోపాటు ఇతర కేసులను ఆధారాలతో ఛేదించిన విధానాన్ని సీపీ మహేశ్‌భగవత్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హాజీపూర్ కేసు విషయంలో సమర్థ పనితీరు కనబర్చి, నిందితునికి శిక్ష పడటంలో కీలకంగా వ్యవహరించిన సీపీ మహేశ్‌భగవత్‌తోపాటు బృందాన్ని డీజీపీ అభినందించి, నగదు పురస్కారాన్ని అందజేశారు.

## ఇరిగేషన్ ఇంజినీర్లకు పదోన్నతి

పదిమంది ఎస్‌ఈలకు సీఈలుగా ప్రమోషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నీటిపారుదలశాఖలో సర్వీస్‌రూల్స్‌లోని 10 (హెచ్) నిబంధనకు మినహాయింపునిస్తూ ప్రభుత్వం పలువురు ఇంజినీర్లకు పదోన్నతి కల్పించింది. నిబంధనలను అనుసరించి కొందరికి పదోన్నతి కల్పిస్తూ ఇంచార్జీలుగా నియమించింది. ప్రభుత్వం సోమవారం బదిలీల ఉత్తర్వులు జారీచేస్తూ జాబితాను విడుదలచేసింది. పదోన్నతుల నిబంధనల సడలింపునకు సంబంధించి ఇటీవల సీఎం కేసీఆర్ ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలోని పదిమంది ఎస్‌ఈలకు సీఈలుగా పదోన్నతులు లభించాయి. వారిలో మంచిర్యాలలో ఉన్న వీఎం సోమశేఖర్‌ను హైదరాబాద్‌లో సంయుక్త కార్యదర్శి (సాంకేతిక విభాగం)గా ప్రభుత్వం నియమించింది. ఏ అనంతరాములును కాడాకు, జెడ్ శ్రీనివాసరావును వాలంతరి డైరెక్టర్ జనరల్‌గా, వీ అజయ్‌కుమార్‌ను నాణ్యత పర్యవేక్షణ విభాగానికి, కే వీరయ్య, అబ్దుల్ హమీద్ ఖాన్‌ను చిన్న నీటిపారుదలశాఖ సీఈలుగా, జీ శ్రీనివాస్‌రెడ్డిని ఆదిలాబాద్ సీఈ (ప్రాజెక్టులు)గా, ఎల్ అనంతరెడ్డిని మహబూబ్‌నగర్ సీఈగా (ప్రాజెక్టులు), వీ నరసింహను నాగార్జునసాగర్ సీఈగా, వీ రమేశ్‌ను పాలమూరు ఎత్తిపోతల సీఈగా నియమిస్తూ పోస్టింగ్ ఇచ్చింది. డిప్యూటీ ఎస్‌ఈలు, డిప్యూటీ సీఈలు, ఈఈలుగా పనిచేస్తున్న 25మందికి పర్యవేక్షక ఇంజినీర్లుగా (ఎస్‌ఈలు), ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లుగా (డీఈఈ) పనిచేస్తున్న 67 మందికి ఈఈలుగా పదోన్నతి కల్పించి బదిలీచేశారు. మరో 14 మంది ఈఈలను కూడా బదిలీచేశారు.




## పంటల బీమాను వినియోగించుకోండి

రైతు రుణ ఉపశమన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు



అధికారులతో సమావేశమైన రైతు రుణ ఉపశమన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలు వంటి కారణాల వల్ల పంటలు నష్టపోయి రూ.లక్షల్లో రైతులు అప్పుల పాలవుతున్నందున, వాటి బారినుం చి తప్పించుకొనేందుకు పంటల బీమా ఉపయోగపడుతుందని రైతు రుణ ఉపశమన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. రైతులందరూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను వినియోగించుకోవాలని విజ్ఞప్తిచేశారు. చాలా మంది రైతులు సకాలంలో ప్రీమియం చెల్లించినప్పటికీ బీమా డబ్బులు ఇవ్వడంలేదనే విషయం కమిషన్ దృ ష్టికి వచ్చినట్టు తెలిపారు. వ్యవసాయ, బీమా కంపెనీ అధికారులతో సోమవారం చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, సభ్యులు కొప్పి లక్ష్మారెడ్డి, పోకల శ్రీహరిరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల బీమా చెల్లింపు విషయంలో రైతులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రీమియం చెల్లించిన రైతులు ఎనిమిది లక్షల మంది మాత్రమే (15 శాతం) ఉన్నారని వివరించారు. పంట రుణా లిస్తున్న బ్యాంకులు బీమా ప్రీమియం మినహాయించుకొని సకాలంలో కంపెనీకి గానీ, రైతులకుగానీ వివరాలు ఇవ్వడం లేదని, దీంతో రైతులకు నష్టం జరుగుతున్నదని అధికారులు కమిషన్ దృష్టికి తెచ్చారు. విషయాన్ని ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్తామని నాగుర్ల తెలిపారు.



రిజర్వేషన్లు పదోన్నతుల్లో తప్పనిసరి కాదన్న సుప్రీంకోర్టు తీర్పు పట్ల కేంద్ర ప్రభుత్వం, బీజేపీ తమ వైఖరి స్పష్టం చేయాలి. దాన్నుంచి తప్పించుకోలేవు. ఒకవేళ సుప్రీంతీర్పును ఒప్పుకోకపోతే, నష్టనివారణగా ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలి.

**పి.చిదంబరం, కాంగ్రెస్ సీనియర్ నేత**

రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు తీర్పుతో కేంద్రానికి సంబంధం లేదు. మా అభిప్రాయాన్ని కూడా కోర్టు కోరలేదు. మేం తీర్పును అధ్యయనం చేస్తున్నాం. సరియైన నిర్ణయం తీసుకుంటాం.

**థావర్ చంద్ గెహ్లాట్, కేంద్రమంత్రి**



**చరిత్రలో నేడు**



1809

'స్టీమ్ బోట్'ను తయారుచేసిన రాబర్ట్ ఫుల్టన్.

1861

అమెరికా 16వ అధ్యక్షునిగా అబ్రహం లింకన్ ఎన్నిక.





1945

యాల్టా ఒప్పందం ద్వారా నాజీల నుంచి యూరప్ విముక్తి చెందిందని ప్రకటించిన ఇంగ్లండ్, అమెరికా,రష్యా దేశాధినేతలు.

కేంద్రం అనుసరిస్తున్న వ్యవసాయరంగ విధానాలతో వ్యవసాయ సంబంధిత ఏవర్గం సంతృప్తిగా లేదు. రైతులు, చిన్నవ్యాపారులు మొదలు అందరూ అసంతృప్తి వ్యక్తంచేస్తుండటం గమనార్హం. ఈ మధ్యకాలంలో దేశంలో ఉల్లి కొరత ఏర్పడటం వ్యవసాయరంగ విధానవైఫల్యానికి ప్రతీకగా చెప్పకోవచ్చు. అలాగే నిత్యావసరాల ధరలు కూడా కొంతకాలంగా గరిష్ఠస్థాయి నుంచి కిందికి దిగటం లేదు. ఇప్పటికైనా వ్యవసాయరంగంలోకి కార్పొరేట్ పెట్టుబడి ప్రవేశించి ఆధునీకరణ చోటుచేసుకోకపోతే తీరని సమస్యగా మిగిలిపోతుందనటంలో సందేహం లేదు.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

అసోంలో శాంతికోసం కేంద్రప్రభుత్వం కుదుర్చుకున్న మూడో ఒప్పందం ఆశించిన ఫలితాల దిశగా పయనిస్తున్నది. గతంలో 1993, 2003లో కుదుర్చుకున్న ఒప్పందాల్లో ప్రధాన పోరాటవర్గమైన నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్ (ఎన్‌డీఎఫ్‌బీ) భాగస్వామ్యం కాలేదు. అందుకే ఆశించన మేర ఫలితం లేక శాంతి నెలకొనలేదు. ఇప్పుడు ఎన్‌డీఎఫ్‌బీ కూడా ఒప్పందంలో భాగస్వామ్యం కావటం ఆహ్వానించదగిన పరిణామం. అయితే ఒప్పందంలోని అన్నిఅంశాలను అమలుచేయాల్సిన బాధ్యత కేంద్రానిది.

**ది హిందూ**



# పెచ్చరిల్లుతున్న ఉన్మాదం

ముంబయిలో క్యాబ్‌లో ప్రయాణిస్తున్న రాజస్థాన్‌కు చెందిన కవి బప్పాదిత్య సర్కార్‌ను ఆ వాహనం డ్రైవర్ పోలీసులకు అప్పగించిన ఘటన దేశంలో చోటుచేసుకుంటున్న భయానక పోకడలకు అద్దం పడుతున్నది. బప్పాదిత్య ఒక ఆర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొనడానికి జైపూర్ నుంచి ముంబయి చేరుకున్నారు. ఈయన నగరంలో క్యాబ్‌లో ప్రయాణిస్తూ ఒక మిత్రుడితో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సాగుతున్న నిరసనల గురించి చర్చించారు. ఈ వాహనాన్ని నడుపుతూ బప్పాదిత్య సర్కార్ సంభాషణను విన్న డ్రైవర్ ఆయనను నేరుగా సమీప పోలీసుస్టేషన్‌కు తీసుకుపోయాడు. ఈయన కమ్యూనిస్టు అనీ, దేశాన్ని తగులబెడుతాడని, వెంటనే అరెస్టు చేయాలని పోలీసులకు తెలిపాడు. కారులో ఆయన మాటల ద్వారా తనకు అర్థమైనదేమిటో పోలీసులకు వివరించాడు. పోలీసులు బప్పాదిత్యను స్టేషన్‌లోకి తీసుకుపోయి వివరాలు తెలుసుకొని విడిచి పెట్టారు. మెడకు ఎర్రని పంచె, చేతిలో డప్పు పట్టుకొని తిరుగవద్దని కాలం బాగా లేదని కూడా వారు సలహా ఇచ్చారు. పోలీసులు విజ్ఞతతో వ్యవహరించడం వల్ల బప్పాదిత్య క్షేమంగా బయట పడ్డాడు. కానీ ఇక్కడ ఆందోళనకరమైన విషయం– ఒక క్యాబ్ డ్రైవర్ కూడా నిరసనలపై చర్చించడమే దేశద్రోహంగా భావించే పరిస్థితి ఉండటం. ప్రజల్లో దేశానికి ఏదో జరగబోతున్నదనే భయాందోళనలు నెలకొల్పడం ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్నదనే అనుమానం కలుగుతున్నది.

**ప్రతిఒక్కరికి మిగతా వారంతా శత్రువులనుకునే ప్రవృత్తి అందరికి భద్రతారాహిత్యాన్ని సృష్టిస్తుంది. ప్రభుత్వం, నాగరికత, చట్టాలులేని కాలంలోకి మళ్ళా వెనుకకు ప్రయాణించడం ప్రమాదకరం. ఇటీవలివరకు కులాల ఘర్షణ, మత కలహాలు జరిగితే వాటిని ఖండించే మానవీయ సంస్కృతి ఉండేది. ప్రభుత్వం కన్నా సమాజంలోని ఈ మానవీయ కోణం విద్వేష హత్యాకాండను నిలువరించేది. కానీ సమాజంలోని ఈ మానవీయతను లేకుండా చేసే దుర్మార్గ పోకడలు కనిపిస్తున్నాయి. రాజకీయ భావజాలాలకు అతీతంగా ఈ వికృత పోకడలను అరికట్టడం అందరి బాధ్యత.**

బప్పాదిత్యకు ఎదురైన చేదు అనుభవానికి ముందు ఢిల్లీలో నిరసనల పట్ల కొందరు బెదిరింపులకు పాల్పడిన తీరు కూడా కలవరపరుస్తున్నది. ఇటీవల జామియా విశ్వవిద్యాలయం, షహీన్‌బాగ్‌ల దగ్గర నిరసనలు తెలుపుతున్న ప్రజలపైకి కొందరు పిస్తోలుతో కాల్పులు జరిపారు. నిరసన ప్రదర్శకులను దేశద్రోహులుగా భావించి ఒక టీనేజ్ పిల్లడు కాల్చిపారేస్తానంటూ పిస్తోలు పట్టుకొని రావడం ఎంత ఘోరం! ప్రజల్లో ఇటువంటి విషబీజాలు నాటుతున్నదెవరనేది ఆలోచించవలసిన విషయం. ఈ మధ్య కొందరు రాజకీయ నాయకులే ద్వేషపూరిత భాషను వాడుతున్నారు. 'గోలీ మారో.... ' అంటూ అసభ్య పదజాలంతో ఉన్మాద ప్రచారం సాగిస్తున్నారు. ఢిల్లీ రాష్ట్రముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను కూడా 'ఉగ్రవాది'గా పేర్కొనడం ఈ విష ప్రచారానికి పరాకాష్ఠ. సమాజంలో శాంతి సామరస్యాలను పెంచి పోషించవలసిన రాజకీయ నాయకులే ఉద్రిక్తతలను రెచ్చగొడితే ఆ ప్రభావం ప్రజలపై ఎంత తీవ్రంగా పడుతుం దో ఈ ఘటనలను బట్టి తెలుస్తున్నది. పిల్లలు తుపాకీలు తీసుకొని కాల్పులు జరుపడం వంటి దారుణ ఘటనలు అమెరికాలో జరిగితే ఆశ్చర్యంగా చూసేవారం. ఇప్పుడు ఆ భయానక ఘటనలు మన దేశంలో సాధారణంగా మారే ప్రమాదం పొంచి ఉన్నది. మన కుటుంబ సభ్యులు, మిత్రులు ఎవరైనా కావచ్చు– బయట అడుగుపెట్టిన తరువాత ఎవరికీ భద్రత కల్పించలేని పరిస్థితి ఏర్పడుతుంది.

సమాజంలో విభజన రేఖలు అంటూ గీయడం మొదలుపెడితే అవి ఒక దగ్గర ఆగిపోవు. మతం, కులం, తెగ, భాష, సంస్కృతి అంటూ అనేక రీతుల్లో వైషమ్యాలు పెచ్చరిల్లవచ్చు. ఒక నగరంలో లేదా ప్రాంతంలో ఉండే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విద్వేషాలు చెలరేగవచ్చు. దీనివల్ల మెజారిటీ, మైనారిటీ అనే తేడాలేకుండా అందరూ భద్రతా రాహిత్యానికి గురవుతున్నారు. ఏ వ్యక్తి అయినా బయట ప్రపంచంలో అందరితో కలిసి బతుకక తప్పదు. తమ కులం వారితో, తమ మతం వారితోనే ప్రయాణించడం, కలిసి పనిచేయడం ఎక్కడా సాధ్యం కాదు. సమాజమంతా భిన్న వర్గాలుగా విడిపోయి, పరస్పర విశ్వాసరాహిత్యంతో బతకవలసి వస్తే అంతకన్నా భయానక వ్యవస్థ మరొకటి ఉండదు. హాబ్స్ అనే ఇంగ్లిష్ తత్త్వవేత్త సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ ప్రజలను నియంత్రించే బలమైన పాలక వ్యవస్థ లేనప్పుడు సమాజం ఎంత భయానకంగా ఉండేది చిత్రీకరించాడు. ఆయన చెప్పిన నిరంకుశవాదం ఆమోదనీయం కాకపోయినా, చట్టబద్ధపాలన మృగ్యమైన సమాజం ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చు. ప్రతిఒక్కరికి మిగతా వారంతా శత్రువులనుకునే ప్రవృత్తి అందరికి భద్రతారాహిత్యాన్ని సృష్టిస్తుంది. ప్రభుత్వం, నాగరికత, చట్టాలులేని కాలంలోకి మళ్ళా వెనుకకు ప్రయాణించడం ప్రమాదకరం. ఇటీవలివరకు కులాల ఘర్షణ, మత కలహాలు జరిగితే వాటిని ఖండించే మానవీయ సంస్కృతి ఉండేది. ప్రభుత్వం కన్నా సమాజంలోని ఈ మానవీయ కోణం విద్వేష హత్యాకాండను నిలువరించేది. కానీ సమాజంలోని ఈ మానవీయతను లేకుండా చేసే దుర్మార్గ పోకడలు కనిపిస్తున్నాయి. రాజకీయ భావజాలాలకు అతీతంగా ఈ విక్రత పోకడలను అరికట్టడం అందరి బాధ్యత.

**జనగళం**

## ప్రాథమిక అంశాలపై పట్టేది?

ఇటీవల వెలువడిన వార్షిక పాఠశాల విద్యా నివేదిక (అసర్) ప్రకారం ఒకటో తరగతి విద్యార్థుల్లో సుమారు 60 శాతం చిన్నారులు రెండంకెల సంఖ్యలను గుర్తించలేకపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల నమోదు ఎక్కువగా ఉంటే, ప్రైవేట్ పాఠశాలల్లో బాలుర నిష్పత్తి ఎక్కువగా ఉన్నది. దేశంలో చాలా మంది పిల్లలు గణితం అంటే భయపడుతున్నట్లు నివేదికలు తెలియజేస్తున్నాయి. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే–2017 ప్రకారం మూడవ తరగతి విద్యార్థుల్లో మూడోవంతు మంది పాఠాన్ని చదవలేకపోతున్నారు. 8వ తరగతి చదువుతున్న వారిలో 56 శాతం మంది మూడంకెల సంఖ్యను ఒక అంకెతో భాగించలేకపోతున్నట్లు, మూడోవంతు పాఠ్యాంశాలను చదవలేకపోతున్నట్లు తెలుస్తున్నది. మూడవ తరగతిలో 70శాతం మంది విద్యార్థులు చిన్న చిన్న తీసివేతలు కూడా చేయలేకపోతున్నట్లు నివేదిక తెలుపుతున్నది. దేశవ్యాప్తంగా ఒకటవ తరగతిలో ప్రవేశాలు నూరుశాతం జరుగుతున్నప్పటికీ ఉన్నత విద్యకొచ్చేసరికి బడిమానేయటం పెరుగుతున్నది. పదవ తరగతిలో ఉత్తీర్ణత పెంచాలనే ఉద్దేశంతో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు 9 తరగతిలోనే 10వ తరగతి పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఈ చర్యల వల్ల ప్రైవేట్ పాఠశాలల్లో పది ఉత్తీర్ణతాశాతం బాగానే ఉన్నప్పటికీ 9వ తరగతిలోని కీలకాంశాలను విద్యార్థులు కోల్పోతున్నారు. ఫలితంగా పది తర్వాత ఆ విద్యార్థులు ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం 2019–20 నాటి బడ్జెట్‌లో విద్యారంగానికి 3.4 శాతం నిధులు కేటాయించింది. ఈ ఏడాది అవి 3.2 శాతానికి తగ్గాయి. విద్యకు కనీసం 6 శాతం నిధులు కేటాయించాలి. అలాగే నైపుణ్యాలకూ వారు ప్రాధాన్యం ఇవ్వాలి. రాబోయే నూతన విద్యా విధానంలోనైనా ఈ లోటు తీరుతుందని ఆశిద్దాం.

**– యం. రాంప్రదీప్**


**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118


**విశ్లేషణ**



**గటిక విజయ్ కుమార్**

# రిజర్వేషన్ల స్ఫూర్తికి తూట్లు

కేంద్రప్రభుత్వంలో కానీ, దేశంలోని ఏ రాష్ట్రంలో గానీ, న్యాయస్థానాల్లో అణగారినవర్గాల జీవన స్థితిగతులను ప్రభావితంచేసే ఏ అంశంపై కదలిక వచ్చినా ఆ వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతున్నది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలు రాష్ట్రాల అభీష్టమని, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం దేశంలో రాజకీయంగా బలహీనంగా ఉన్న పక్షాలు ఈ తీర్పును వ్యతిరేకించాయి. అధికార బీజేపీ, దాని మిత్రపక్షాల మౌనం అంగీకారానికి చిహ్నమా అనేది సహజ సందేహం.

సరిగ్గా ముప్పై సంవత్సరాల కిందట ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించే మండల్ కమిషన్ అనుకూల, వ్యతిరేక ఆందోళనలతో దేశం అట్టుడికింది. అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో రిజర్వేషన్లు అమలుచేయాలని గట్టి పట్టుదలతో ఉన్నది. దీంతోపాటు దేశంలో సామాజికన్యాయం సాధించడం అనేది ఓ లక్ష్యంగా భావించిన రాజకీయవ్యవస్థ ఉన్నది. దీనివల్ల మండల్ సిఫారసులు అమలుచేయడం సాధ్యమైంది. మండల్ కమిషన్ సిఫారసులను వ్యతిరేకించిన వారు నాడు రాజకీయ శక్తిసంపన్నులు కారు. రిజర్వేషన్లను అమలుచేయడానికి సూత్రప్రాయంగా, సిద్ధాంతరీత్యా అయిష్టంగా ఉండే ఆ శక్తులు నేడు అన్ని వ్యవస్థలను శాసించే స్థితిలో ఉన్నాయి. అందుకే నేడు రాజ్యాంగం చెట్టు నీడన తలదాచుకుంటున్న అణగారినవర్గాలు పిడుగు పడినంత భయంతో వణికిపోతున్నారు.

కేంద్రప్రభుత్వంలో కానీ, దేశంలోని ఏ రాష్ట్రంలో గానీ, న్యాయస్థానాల్లో అణగారినవర్గాల జీవన స్థితిగతులను ప్రభావితంచేసే ఏ అంశంపై కదలిక వచ్చినా ఆ వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతున్నది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలు రాష్ట్రాల అభీష్టమని, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం దేశంలో రాజకీయంగా బలహీనంగా ఉన్న పక్షాలు ఈ తీర్పును వ్యతిరేకించాయి. అధికార బీజేపీ, దాని మిత్రపక్షాల మౌనం అంగీకారానికి చిహ్నమా అనేది సహజ సందేహం. రెండేండ్ల కిందట ఎస్సీ, ఎస్టీ చట్టంలోని నిబంధనలను సడలిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఈ తీర్పు అసలు ఎస్సీ, ఎస్టీ చట్టానికి తిలోదకాలు ఇవ్వడానికి వేసిన మొదటి అడుగుగా దేశంలోని బలహీనవర్గాలు భావించాయి. ఆందోళన వ్యక్తం చేశాయి. ఇప్పుడు రిజర్వేషన్ల విషయంలో వచ్చిన తీర్పు కూడా అదే భయాన్ని కల్పిస్తున్నది. సుప్రీం తీర్పు మాత్రమే కాదు, దాని నేపథ్యం కూడా అసలు రిజర్వేషన్లకే ఎసరు వస్తుందనే ఆందోళనకు కారణమవుతున్నది.

ఉత్తరాఖండ్ బీజేపీ ప్రభుత్వం పీడబ్ల్యూడీలో ఏఈ పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించకపోవడాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు తప్పు పట్టింది. ఉత్తరాఖండ్ బీజేపీ ప్రభుత్వం హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంలో పిటిషన్ వేసింది. సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును రద్దు చేసి, రిజర్వేషన్లు ఇవ్వాలా? వద్దా? అన్నది ఆయారాష్ట్రాల ఇష్టానికే వదిలేయాలని తేల్చింది. ఉత్తరాఖండ్ బీజేపీ ప్రభుత్వం పట్టువదలని విక్రమార్కుడిలాగా వ్యవహరించి మరీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వాదించింది.

రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు తీర్పులకూ, సుప్రీంకోర్టు తీర్పులకూ అనేకసార్లు ఇలా తేడాలొచ్చాయి. సుప్రీంకోర్టు కూడా రిజర్వేషన్ల విషయంలో తాము జోక్యం చేసుకోలేమని ఒకసారి, జోక్యం చేసుకోకుండా ఎలా ఉంటామని ఒకసారి వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. సుప్రీంకోర్టు సమయానుగుణంగా రిజర్వేషన్లపై వైఖరి వెల్లడిస్తున్నప్పటికీ, అది ప్రతిసారి తమ ప్రయోజనాలకు, హక్కులకు ప్రతికూలంగానే ఉంటున్నదనే అసంతృప్తి అణగారినవర్గాల్లో పేరుకుపోతున్నది. రాజ్యాంగస్ఫూర్తి అనే మాట వాడే హైకోర్టులు ఆమోదించిన రిజర్వేషరన్లను సుప్రీంకోర్టు అదే కారణంతో విభేదించడంతో వారికి ఎటూ పాలుపోవడం లేదు. ఎన్టీఆర్ సినిమాలో డైలాగు లాగా 'కోర్టు కోర్టుకీ, తీర్పు తీర్పుకీ ఇంత మార్పుంటే మీ న్యాయస్థానంలో న్యాయం ఉన్నట్టా యువర్ హానర్' అని బలహీన గొంతుకలు గట్టిగా మొత్తుకోవాల్సి వస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం కానీ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కానీ కల్పించే రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలోఆదేశాలిచ్చింది. అప్పుడు అంత క్రియాశీలకంగా వ్యవహరించిన అత్యున్నత న్యాయస్థానం, అసలు రిజర్వేషన్లు ఉండాలా? వద్దా? అనే విషయం ఆయా ప్రభుత్వాల అభీష్టమని పేర్కొనడం విస్మయపరిచే సందర్భం.

ఇక రిజర్వేషన్లు పొందడం ప్రాథమికహక్కేమీ కాదనే సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యలు కూడా ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి. వివక్షకు, అణిచివేతకు గురైన వర్గాలను ప్రోత్సహించడానికి అవసరమైన చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి పరిమితులు లేవని రాజ్యాంగం (ఆర్టికల్ 46) స్పష్టం చేసింది. ఆర్టికల్ 16(4), ఆర్టికల్ 14(4ఎ) దేశంలోని ఎస్సీలు, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించే వెసులుబాటునిచ్చాయి. అంతేతప్ప రిజర్వేషన్లు 50 శాతం దాటవద్దని రాజ్యాంగంలో ఎక్కడా చెప్పలేదు. కానీ సుప్రీంకోర్టు తనంతట తానుగా స్పందించి, తన రాజ్యాంగ సమీక్ష అధికారాన్ని ఉపయోగించుకుని తీర్పులను వెలువరిస్తున్నది.

**ఇతరదేశాల రాజ్యాంగాల్లోని చాలా అంశాలను భారత రాజ్యాంగంలోకి తీసుకున్నప్పటికీ, రిజర్వేషన్ల అంశం మాత్రం కచ్చితంగా ఈ దేశ సామాజిక స్థితిగతులకు అనుగుణంగా పొందుపరిచినవే. సామాజిక అసమానతలు తొలిగే వరకు ఈ దేశంలో రిజర్వేషన్లు ఉండాలనేది రాజ్యాంగ స్ఫూర్తి. చట్టసభల్లో, రాజకీయ అవకాశాల్లో, ఉద్యోగ నియామకాల్లో, పదోన్నతుల్లో ఎక్కడా కూడా అణగారినవర్గాలకు తమ జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు రావడం లేదని ప్రభుత్వ లెక్కలే స్పష్టపరుస్తున్నా యి. పదోన్నతుల్లో కూడా రిజర్వేషన్ అవసరమా? అనే ప్రశ్న కూడా పదేపదే వస్తున్నది. పదోన్నతుల ద్వారా మాత్రమే నిండే ఉన్నత ఉద్యోగాల్లో, అత్యున్నత పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు తమ జనాభా నిష్పత్తి ప్రకారం ఉన్నారా? లేరా? అని చూసుకోవడమే సమాధానం. ఈ దేశంలో ఏ లక్ష్యంతో రిజర్వేషన్ విధానం ప్రవేశపెట్టారో బోధపడితేనే, ఆ లక్ష్యం చేరుకునే మార్గం అన్వేషించడం సాధ్యమవుతుంది.**

సుప్రీంకోర్టు చెప్పినట్టే, ప్రభుత్వ ఉద్యోగాలు, నియామకాల్లో రిజర్వేషన్లు ప్రభుత్వ అభీష్టమే అయితే ఈ దేశంలో సామాజిక న్యాయం ఓ ఎండమావిగానే మారుతుంది. ఇది ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర భారతం అనుభవం. కచ్చితమైన నిబంధన లేకుంటే సామాజిక న్యాయం ఎంత గొప్పగా అమలవుతుందో చెప్పడానికి ఈ దేశ చట్టసభలే నిలువెత్తు నిదర్శనం. పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభ ఉన్నాయి. లోక్‌సభలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఉన్నాయి. వారి జనాభా నిష్పత్తి ప్రకారం లోక్‌సభలో ఎస్సీ, ఎస్టీ ఎంపిలున్నారు. కానీ రిజర్వేషన్లు లేని బీసీలు దేశ జనాభాలో 50 శాతం దాటినా, లోక్‌సభలో బీసీల ప్రాతినిధ్యం 20 శాతమే. మహిళలకు రిజర్వేషన్ లేకపోవడం వల్ల లోక్‌సభలో వారు 14 శాతమే ఉన్నారు. ఇక ఎవరికీ రిజర్వేషన్ లేని రాజ్యసభలో పరిస్థితి మరీ దారుణం. రాష్ట్రాల శాసనసభలు, మండలిలో కూడా పరిస్థితి ఇలాగే ఉంటున్నది. పొద్దున లేస్తే బలహీనవర్గాల ఉద్ధరణ కోసమే పుట్టామని చెప్పుకునే పేరుగొప్ప రాజకీయపార్టీలు ఎంపిక చేసే చట్టసభల సభ్యుల విషయంలోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నది. అసలు రిజర్వేషన్లు అమలుచేయాలనే కచ్చితమైన నిబంధనే లేకుంటే వివిధ ప్రభుత్వ శాఖల్లో పరిస్థితి ఊహించడానికే భయంకరంగా ఉంటుంది.

ఇతరదేశాల రాజ్యాంగాల్లోని చాలా అంశాలను భారత రాజ్యాంగంలోకి తీసుకున్నప్పటికీ, రిజర్వేషన్ల అంశం మాత్రం కచ్చితంగా ఈ దేశ సామాజిక స్థితిగతులకు అనుగుణంగా పొందుపరిచినవే. సామాజిక అసమానతలు తొలిగే వరకు ఈ దేశంలో రిజర్వేషన్లు ఉండాలనేది రాజ్యాంగ స్ఫూర్తి. చట్టసభల్లో, రాజకీయ అవకాశాల్లో, ఉద్యోగ నియామకాల్లో, పదోన్నతుల్లో ఎక్కడా కూడా అణగారినవర్గాలకు తమ జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు రావడం లేదని ప్రభుత్వ లెక్కలే స్పష్టపరుస్తున్నాయి. పదోన్నతుల్లో కూడా రిజర్వేషన్ అవసరమా? అనే ప్రశ్న కూడా పదేపదే వస్తున్నది. పదోన్నతుల ద్వారా మాత్రమే నిండే ఉన్నత ఉద్యోగాల్లో, అత్యున్నత పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు తమ జనాభా నిష్పత్తి ప్రకారం ఉన్నారా? లేరా? అని చూసుకోవడమే సమాధానం. ఈ దేశంలో ఏ లక్ష్యంతో రిజర్వేషన్ విధానం ప్రవేశపెట్టారో బోధపడితేనే, ఆ లక్ష్యం చేరుకునే మార్గం అన్వేషించడం సాధ్యమవుతుంది. ప్రభుత్వానికి ప్రధాన అంగాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాల్లో వందకు వంద శాతం సామాజిక న్యాయం జరిగే వరకు రిజర్వేషన్లు అమలు కావాలనే కచ్చితమైన నిబంధన ఉండి తీరాలి. అది ప్రభుత్వాల బాధ్యత అని అవసరమైతే పార్లమెంటులో చట్టం చేయాలి.

# తెలంగాణ యువతలో 'జిజ్ఞాస'

**కళాశాల విద్య**



**డాక్టర్ ఎం.వి.రమణ**

ఇప్పుడు నడుస్తున్న వర్తమానం అనేకాంశాలలో విభిన్నమైనది. దశాబ్దాలుగా మరుగునపడిన అస్తిత్వ అంశాలు, సృజనాత్మక ప్రతిభలు, ప్రాంతీయ ప్రత్యేకతలు గడిచిన ఐదు సంవత్సరాలుగా స్పష్టమైన రూపాన్ని తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, యువతకు డిగ్రీస్థాయి విద్యార్థులకు అతి ముఖ్యమైనది. ఒక ప్రాంత అభివృద్ధిలో, సామాజిక, ఆర్థిక, విద్యా, సాంస్కృతిక, రాజకీయ అంశాలలో వస్తున్న మార్పులే కీలకపాత్ర పోషిస్తాయి. మౌలికంగా విశిష్టత కలిగిన సమాజం తన ఉనికిని నిరూపించుకోవడానికి విద్య ద్వారానే సాధన చేస్తుంది. దార్శనికత కలిగిన దీపదారులు పటిష్టమైన ప్రణాళికలు వేస్తారు. వాటిని అమలుపరిచి, ప్రతిఫలాలను అందించేందుకు నిరంతరం ఆలోచనలు చేస్తారు. అందుకు ముందడుగు వేస్తారు. వినూత్నంగా తమ ఆలోచనలను అమలుపరుస్తారు. ఒక తరానికి ప్రత్యేక కాలాన్ని బహూకరిస్తారు.

ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యలో కీలకమైన డిగ్రీ విద్యా వ్యవస్థలో శరవేగంగా పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. విద్య అంటే కేవలం మార్కుల కోసమో, భట్టీ పట్టడమో, స్టడీ మెటీరియల్ చదవడం కాదని తెలిసివస్తున్నది. యాంత్రికమైన అభ్యసన సంస్కృతిని ఇక ఎంత మాత్రం ఉపేక్షించకూడదని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఉన్నత విద్యాశాఖాధికారులు గుర్తించారు. తెలంగాణ కళాశాల విద్యా కమిషనరేట్ పరిధిలోఉన్న 132 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థి కేంద్రంగా విద్యాత్మక అంశాలు కొనసాగుతున్నాయి.

సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యాన్ని విస్తరిస్తున్నారు. కేవలం నిర్దేశిత పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా డిగ్రీ విద్యార్థుల్లో నిగూఢంగా దాగి ఉన్న ఆలోచనలను ఆవిష్కరించేందుకు గత ఐదేండ్ల నుంచి జమిలిగా విభిన్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది కళాశాల విద్య. దీనిలో మొదటిది 'జిజ్ఞాస' విద్యార్థి అధ్యయన నివేదకల సమర్పణ. రెండవది యువతరంగం వివిధ సాహిత్య సాంస్కృతిక క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడంగా చెప్పుకోవచ్చు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంత విద్యార్థినీ, విద్యార్థులకు ఆధునిక ప్రపంచంలోకి ఆహ్వానించడం దీని ఉద్దేశం. చదువంటే సెమిస్టర్ పరీక్షల్లో అడిగే ప్రశ్నావళిని అనుసరించి జవాబులు రాయడం మాత్రమే కాదని కళాశాల విద్యా కమిషనరేట్ గుర్తించింది. దానికి అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు అనేక సృజనాత్మక కార్యక్రమాలతో కార్యాచరణకు పూనుకున్నది.

భవిష్యత్తులో జ్ఞాన తెలంగాణబాటలో సాహిత్య సాంస్కృతిక క్రీడా తెలంగాణ కోసం విస్పష్టమైన 'విజన్'ను రూపొందించుకున్నది. తద్వారా మహత్తర ఆశయాలతో 2015 నుంచి 'విజన్ డాక్యుమెంట్'ను తయారు చేసుకున్నది. దాని అమలుకోసం తగిన చర్యలను చేపట్టింది. ఇప్పుడు ఏటా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో రాష్ట్రవాప్తంగా ఉన్న మారుమూల కళాశాలల స్థాయి నుంచి క్లస్టర్, రాష్ట్రస్థాయి పోటీలను 'జిజ్ఞాస' విద్యార్థి పరిశోధనా అధ్యయన నివేదికల రూపంలో ఉన్న అంశాలను సమర్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇందులో ఐదుగురు విద్యార్థినీ, విద్యార్థులు తాము ఎంచుకున్న అంశాన్ని నివేదిస్తారు. మరోవైపు యువతరంగం ద్వారా 28 అంశాలలో సాహిత్య సాంస్కృతిక, కళా, క్రీడాంశాలలో విద్యార్థులను భిన్న వేదికల ద్వారా ప్రోత్సహిస్తున్నది. ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న సమయంలోనే భవిష్యత్తులో తమకిష్టమైన సబ్జెక్టులలో పరిశోధనను కొనసాగించేందుకు తొలిమెట్టుగా 'జిజ్ఞాస' ద్వారా ముందుకొస్తున్నారు. పీజీ అనంతరం తెలుసుకునే పరిశోధనా మౌలిక పద్ధతులను డిగ్రీలోనే తెలుసుకుంటున్నారు. అనూహ్యమైన నూతన అంశాల మీద నివేదికలను సమర్పిస్తున్నారు. పలు అంశాలను నిర్భయంగా, భాషావాక్పటిమతో యూనివర్సిటీ ప్రొఫెసర్ల ముందు వెల్లడించడం ఒక ప్రత్యేక అంశం. కళాశాల విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్, అకడమిక్ గైడెన్స్ సెల్ అధికారులు కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు తగిన ప్రేరణను కల్పిస్తున్నారు. 2019–20 వార్షిక విద్యా సంవత్సరంలో వివిధ సబ్జెక్టులలో 150 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీటిని ఫిబ్రవరి మొదటివారంలో జరుగుతున్న 'జిజ్ఞాస' లో ప్రదర్శిస్తున్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గుణాత్మక మార్పు డిగ్రీ కళాశాల విద్యలో కనిపిస్తుండటం శుభపరిణామం. ఈ రెండు కార్యక్రమాల ద్వారా విద్యార్థుల ఆలోచనాసరళిలో తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. కొత్త ఊహ, ఆలోచనలు మొగ్గతొడిగి కొత్త ఆవిష్కరణలవైపు వారు కదిలేటట్లు చేస్తున్నది. విద్య అంటే మొదడుకు ఇచ్చే శిక్షణ మాత్రమే కాదని విద్యార్థులు తెలుసుకుంటున్నారు. తరగతి గదులకే పరిమితమైపోయిన సంప్రదాయ బోధనా వ్యూహాలను అభ్యసన పద్ధతులను వదిలిపెట్టి పర్యవేక్షిత, మార్గదర్శక అభ్యసనామార్గంలోకి విద్యార్థి లోకం కదులుతున్నది. వారిలో నూతన శక్తియుక్తులు బలోపేతమౌతున్నాయి.

ప్రాజెక్టు ఆధారిత అధ్యయనం అనేది విద్యార్థులు తామున్న సమాజ సంస్కృతులను అవగతం చేసుకోవడమే కాకుండా సమాజంలోని భిన్న పార్శ్వాలలో, విభిన్న అనుశాసనాల్లో సమస్యల మూలాలను తెలుసుకోవడమే కాకుండా సృజనాత్మక పరిష్కార మార్గాలనూ అన్వేషించగలుగుతున్నారు. కొన్ని ప్రాజెక్టు అధ్యయనాలలో వారు ఎంచుకొనే అంశాలు అధ్యయనం వలన పెరిగిన అవగాహన, ఆలోచనలు వారిని భవిష్యత్తులో విశిష్ట వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయనడంలో సందేహం లేదు. ఆవిష్కరణ అనేది సృజనాత్మకతకు ప్రారంభమని గుర్తించగలుగుతున్నారు. విద్యావ్యవస్థ పటిష్టంగా రూపొందాలంటే దార్శనికతగల వ్యక్తుల అవసరం ఎంతైనా ఉన్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సంవేదనలను కలిగి ఉండటం వల్ల ఆయా శాఖలను సమర్థవంతంగా నడుపుతున్న అధికారుల కృషి కూడా దీనికి సాక్షీభూతంగా నిలుస్తున్నది.

జ్ఞానపరంగా జిజ్ఞాస పరిశోధనా రంగంలోకి విద్యార్థులు ప్రవేశించేందుకు ద్వారాలు తెరుస్తుంటే, మరోవైపు యువతరంగం తమ సృజనాత్మక ప్రతిభా పాటవాలతో కళాశాలలను సాహిత్య సాంస్కృతిక వేదికలుగా మలుస్తున్నారు. ముఖ్యంగా కథలు, కవితలు, వ్యాస రచన, వక్తృత్వం, పరిశీలనా ప్రకటన, స్పీడ్‌రీడింగ్ లాంటి అంశాలు వారికి విద్యలో అభ్యసనంలో సృజనాత్మక శక్తియుక్తుల ప్రాధాన్యాన్ని నొక్కి చెబుతున్నాయి.

**తెలంగాణ సాహిత్య సాంస్కృతిక రంగాన్ని భవిష్యత్తులో భర్తీ చేయడానికి ఒక కాళోజీ, వట్టికోట ఆళ్వారుస్వామి లాంటి మహా రచయితల వారసత్వాన్ని కొనసాగించేందుకు సంసిద్ధులవుతున్నారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం ఉత్తమ మానవవనరులను అందించేందుకు కీలకమైన తెలంగాణ కళాశాల విద్య పటిష్ఠమైన త్రిముఖవ్యూహంతో పనిచేస్తున్నది. భావి పరిశోధకులను, కవులను, కథకులను, క్రీడాకారులను సాంకేతిక నిపుణులను అందించబోతున్నది. ఉన్నతవిద్యలో ఇదొక మంచి పరిణామం.**

తెలంగాణ సాహిత్య సాంస్కృతిక రంగాన్ని భవిష్యత్తులో భర్తీ చేయడానికి ఒక కాళోజీ, వట్టికోట ఆళ్వారుస్వామి లాంటి మహా రచయితల వారసత్వాన్ని కొనసాగించేందుకు సంసిద్ధులవుతున్నారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం ఉత్తమ మానవ వనరులను అందించేందుకు కీలకమైన తెలంగాణ కళాశాల విద్య పటిష్ఠమైన త్రిముఖ వ్యూహంతో పని చేస్తున్నది. భావి పరిశోధకులను, కవులను, కథకులను, క్రీడాకారులను సాంకేతిక నిపుణులను అందించబోతున్నది. ఉన్నత విద్యలో ఇదొక మంచి పరిణామం.

(వ్యాసకర్త: తెలుగు అధ్యాపకులు, ఎస్.ఆర్.బి.జి.ఎన్.ఆర్. కళాశాల, ఖమ్మం)


Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# మాజీ భార్య ఇంటి ముందు ఎస్పీ మౌన పోరాటం!



పిల్లలను కలుసుకోనివ్వడం లేదంటూ నిరసన.. కర్ణాటకలో ఘటన

**బెంగళూరు:** మాజీ భార్య ఇంటి ఎదుట ఓ పోలీస్ అధికారి మౌన పోరాటం చేశాడు. కర్ణాటకలోని బెంగళూరులో జరిగిన ఈ ఘటన స్థానికులు, మీడియా దృష్టిని ఆకట్టుకున్నది. కలుబురగిలో అంతర్గత భద్రతా విభాగంలో ఎస్పీగా పని చేస్తున్న అరుణ్ రంగరాజన్ ఆదివారం మాజీ భార్య ఇంటికి వచ్చాడు. తన పిల్లలను ఆమె కలవనీయడం లేదని ఆరోపిస్తూ ఇంటి ముందు బైఠాయించాడు. దీంతో స్థానికులు, మీడియా అక్కడికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఎస్ అధికారిణి, హోంగార్డ్స్ డిప్యూటీ కమాండెంట్ జనరల్ లాక్కియా కరుణగారన్, మాజీ భర్త ప్రవర్తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న స్థానిక పోలీసులకు సీనియర్ అధికారి రంగరాజన్‌తో ఎలా వ్యవహరించాలో అర్థం కాలేదు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆయనకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. దీంతో స్పందించిన రంగరాజన్ తమది ప్రేమ వివాహమని చెప్పారు. చివరకు తన ఇద్దరు పిల్లలను కలుసుకున్న రంగరాజన్ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

# మాంద్యం ఉంటే ధోతి కట్టేవారు

**ప్రజలు జాకెట్లు, ప్యాంట్లు కొంటున్నారు.. యూపీ బీజేపీ ఎంపీ వీరేంద్రసింగ్**



**బలియా:** దేశంలో మాంద్యం లేదు అనేందుకు ప్రజలు ధరిస్తున్న దుస్తులే నిదర్శనమని బీజేపీ ఎంపీ వీరేంద్రసింగ్ మస్త్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయమయ్యాయి. ఆర్థిక వ్యవస్థ అంత అధ్వానంగా ఉంటే ప్రజలు ధోతి, కుర్తాలు వేసుకొనేవారని పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని బలియాలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచం ఆర్థిక మాంద్యంలో పడింది కానీ, భారత్‌లో మాత్రం మాంద్యం ప్రభావంలేదని చెప్పారు. గ్రామీణ, వ్యవసాయ ఆర్థికవ్యవస్థ బలంగా ఉండటమే దీనికి కారణమని పేర్కొన్నారు. 'ఆర్థిక మాంద్యం ఉండిఉంటే.. మేం కోట్లు, జాకెట్లకు బదులుగా ధోతి, కుర్తాలను ధరించి ఇక్కడకు వచ్చేవాళ్లం. ఆర్థికమాంద్యం ఉంటే దుస్తులు, ప్యాంట్లు, పైజామాలు కొనలేం' అని మస్త్ అన్నారు.

# అది బీజేపీ-ఆరెస్సెస్ డీఎన్‌ఏలోనే ఉంది!



**న్యూఢిల్లీ:** రిజర్వేషన్ల రద్దుకు ప్రయత్నించడం బీజేపీ, ఆరెస్సెస్ డీఎన్‌ఏలోనే ఉన్నదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. అణగారిన వర్గాల హక్కులను లాక్కునేందుకు 'పెద్ద కుట్ర' జరుగుతున్నదని ఆరోపించారు. సోమవారం పార్లమెంట్ వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్ల రద్దు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ ఎంత కలగన్నప్పటికీ దాన్ని తాము సాకారం కానీయబోమని స్పష్టంచేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల పొందేందుకు ప్రాథమిక హక్కేమీ లేదని ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పేర్కొనడంపై ఆయన మండిపడ్డారు. రిజర్వేషన్ల రాజ్యాంగహక్కుకు వ్యతిరేకంగా బీజేపీ ప్రభు త్వం సుప్రీంకోర్టులో ప్రకటన చేసిందని విమర్శించారు. ఎన్నో పోరాటాలు, త్యాగాల తర్వాత ఈ హక్కులు లభించాయని, వీటిని లాక్కునేందుకు నేడు పెద్దకుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. ఇంతకంటే పెద్దద్రోహం ఏమైనా ఉన్నదా అని విలేకరులను ప్రశ్నించారు.





ప్రిన్సిపల్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థినులు

# ఢిల్లీలో దుశ్శాసన పర్వం

- గార్గి కళాశాల విద్యార్థినులను లైంగికంగా వేధించిన దుండగులు
- క్యాంపస్ గోడ దూకి, హస్త ప్రయోగం చేస్తూ.. తాకుతూ వికృత చేష్టలు
- పోలీసులు అక్కడే ఉన్నా పట్టించుకోలేదన్న విద్యార్థినులు

**న్యూఢిల్లీ:** దేశ రాజధానిలో దుశ్శాసన పర్వం చోటుచేసుకున్నది. చదువులకు ఆలయంగా భావించే కాలేజీ.. వంద మంది కౌరవుల ప్రవేశంతో కురు సభను తలపించింది. ఎంతో ఉల్లాసంగా జరుపుకోవాలనుకున్న కాలేజీ సాంస్కృతిక వేడుక ఆ విద్యార్థినులకు పీడకలను మిగిల్చింది. గోడదూకి కాలేజీలోకి చొరబడిన ఓ అల్లరి మూక తమ వికృత చేష్టలతో ఆ విద్యార్థినులను లైంగికంగా వేధించారు. దేశ రాజధాని ఢిల్లీలోని గార్గి కళాశాలలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం క్యాంపస్‌లో ఆ కాలేజీ విద్యార్థినులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ నెల 6న గార్గి కాలేజీ కల్చరల్ ఫెస్టివల్ సందర్భంగా కొందరు వ్యక్తులు క్యాంపస్‌లోకి చొరబడి విద్యార్థినులపై వికృత చేష్టలతో లైంగిక వేధింపులకు పాల్పడటం కలకలం రేపింది. బాధిత విద్యార్థినులు సోషల్ మీడియాలో ఈ విషయాన్ని వెల్లడించడంతో దారుణం వెలుగులోకి వచ్చింది. ఘటన జరిగినప్పుడు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఢిల్లీ పోలీస్ సిబ్బంది అక్కడే ఉన్నా చూసీ చూడనట్టు వదిలేశారని ఆరోపిస్తూ విద్యార్థినులు కాలేజీ గేటు ముందు సోమవారం ధర్నా చేపట్టారు. గురువారం జరిగిన ఘటనను ఓ విద్యార్థిని వివరిస్తూ.. 'సుమారు వందమంది వరకుగల ఓ గుంపు.. కాలేజీ గేటును తోసుకుంటూ, గోడలు దూకి క్యాంపస్‌లోకి ప్రవేశించింది. వాళ్లంతా మద్యం సేవించి విచక్షణ లేకుండా ప్రవర్తించారు. అసభ్యంగా తాకుతూ వికృత చేష్టలకు దిగారు. దీంతో అమ్మాయిలు భయపడి బాత్రూంల వైపు పరుగెత్తినప్పటికీ.. అక్కడికి కూడా వచ్చి బయట నుంచి గడియలు పెట్టారు' అంటూ వెల్లడించింది. కాలేజీలోకి ప్రవేశించిన దుండగులు మధ్య వయస్కులని, విద్యార్థినుల ముందే వాళ్లు హస్తప్రయోగం చేస్తూ.. వికృత చేష్టలకు పాల్పడుతూ భయపెట్టారని మరో విద్యార్థిని పేర్కొన్నారు.ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. మరోవైపు, సీఏఏకు అనుకూలంగా పనిచేస్తున్న వ్యక్తులే ఈ ఘటన వెనుక ఉన్నారని సీపీఎం అనుబంధ మహిళా విభాగం ఐద్వా ఆరోపించింది.

# రిజర్వేషన్లపై రగడ

## సుప్రీంకోర్టు తీర్పుపై దద్దరిల్లిన పార్లమెంట్

- రిజర్వేషన్లను కాపాడడంలో కేంద్రం విఫలమైందన్న విపక్షాలు.. వాకౌట్
- ఆరోపణల్ని తిప్పికొట్టిన ప్రభుత్వం
- కాంగ్రెస్ సర్కార్ నిర్ణయంపైనే తీర్పు వెలువడిందని విమర్శ
- రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ



పార్లమెంట్‌లో ప్రసంగిస్తున్న మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్.. కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వాలకు తప్పనిసరి కాదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సోమవారం పార్లమెంట్ దద్దరిల్లింది. కేంద్రంపై విపక్షాలు విరుచుకుపడ్డాయి. రిజర్వేషన్లను కాపాడటంలో కేంద్రం విఫలమైందని ధ్వజమెత్తాయి. దీనిపై కేంద్ర సామాజిక, సాధికారత శాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ లోక్‌సభలో ప్రకటన చేస్తూ.. సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన ఈ కేసులో కేంద్రం కక్షిదారు కాదన్నారు. 2012లో ఉత్తరాఖండ్‌లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపైనే తాజా తీర్పు వెలువడిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్ల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. కేసులో అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు కేంద్రాన్ని కోరలేదని, ఈ అంశంపై ప్రభుత్వంలో ఉన్నతస్థాయిలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉత్తరాఖండ్‌లో నాటి కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన ఆదేశాలపైనే కోర్టు తాజా తీర్పునిచ్చిందని మంత్రి అన్నప్పుడు విపక్షాల సభ్యులు 'సిగ్గు సిగ్గు' అని నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. నియామకాల్లో రిజర్వేషన్ల కల్పన రాష్ట్ర ప్రభుత్వాలకు తప్పనిసరి కాదని, పదోన్నతుల్లో రిజర్వేషన్లు ప్రాథమిక హక్కేమీ కాదని సుప్రీంకోర్టు ఆదివారం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే.

**తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి..**

ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం కాగానే, కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తారు. డీఎంకేతోపాటు ఇతర విపక్షాల సభ్యులు ఆయనకు జతకలిశారు. సున్నితమైన రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పుపై ప్రభుత్వం లోక్‌సభలో ప్రకటన చేస్తుందన్నారు. ప్రభుత్వంపై విపక్షాల వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలిగించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి కోరగా.. ఆ విషయాన్ని పరిశీలిస్తానని స్పీకర్ బదులిచ్చారు. కాంగ్రెస్ నేత అధిర్, తృణమూల్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై దాడి జరుగుతున్నదని మండిపడ్డారు. ఎన్డీఏ భాగస్వామ్యపక్షం ఎల్జేపీ నేత చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. దీనిపై ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని, రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, తద్వారా దీన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేయడానికి వీల్లేకుండా ఉంటుందన్నారు. కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ.. రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధమని, ప్రాథమిక హక్కని రాజ్యాంగం పేర్కొంటున్నదన్నారు. డీఎంకే సభ్యుడు ఏ రాజా మాట్లాడుతూ.. రిజర్వేషన్లకు కేంద్రం అనుకూలంగా లేదని చెప్పడానికి కారణాలు ఉన్నాయన్నారు. రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. బీఎస్పీ సభ్యుడు రితేశ్ పాండే మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, దళితులకు కేంద్రం వ్యతిరేకమన్నారు. అప్నాదళ్ సభ్యురాలు అనుప్రియా పటేల్ స్పందిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పు దురదృష్టకరమన్నారు. దీనిపై కేంద్రం ప్రేక్షకపాత్ర వహించరాదని ఐయూఎంఎల్ సభ్యుడు ఈటీ మొహమ్మద్ బషీర్ సూచించారు. కోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని సీపీఎం నేత ఏఎం ఆతిఫ్ కోరారు. ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సూలే మాట్లాడుతూ.. తమకు మాటలు అవసరం లేదని, చేతలు కావాలన్నారు.

**గెహ్లాట్‌పై హక్కుల నోటీసు ఇస్తాం**

రిజర్వేషన్ల అంశంపై కేంద్ర మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్ లోక్‌సభను తప్పుదోవ పట్టించారని, ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని కాంగ్రెస్ పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్ల రద్దుకు మోదీ సర్కారు కుట్రలు పన్నుతున్నదని, దీనిపై ఆందోళనలు చేపడుతామన్నది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. రిజర్వేషన్లను రద్దుచేయడమే బీజేపీ, ఆరెస్సెస్ అజెండా అని ఆరోపించారు.

## రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలి



రాం విలాస్ పాశ్వాన్

**రాజ్యసభలోనూ** రిజర్వేషన్లపై వాడీవేడి చర్చ జరిగింది. సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలుచేయాలని విపక్షాలు డిమాండ్‌చేశాయి. ప్రభుత్వం నుంచి సంతృప్తికర జవాబు రాకపోవడంతో వాకౌట్‌చేశాయి. పార్లమెంట్ ఉభయసభల్లోనూ మంత్రి గెహ్లాట్ ప్రకటన చేశారు. ఈ అంశంపై అత్యున్నత స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథావలే మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు నిర్ణయం అన్యాయమన్నారు. కేంద్ర మంత్రి రాం విలాస్ పాశ్వాన్ స్పందిస్తూ.. దీనిపై ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఎస్సీ,ఎస్టీల ప్రయోజనాలను కాపాడేందుకు మోదీ సర్కారు సాధ్యమైనదంతా చేస్తుందని చెప్పారు. న్యాయవ్యవస్థలోనూ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. మంత్రి ప్రకటన అనంతరం ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ.. ఈ అంశం చాలా తీవ్రమైనదని, దేశంలోని నాలుగో వంతు జనాభాపై ప్రభావం పడుతుందని చెప్పారు. తక్షణమే క్యాబినెట్ సమావేశాన్ని ఏర్పాటుచేసి, రివ్యూ పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్‌చేశారు. బీఎస్పీ సభ్యుడు సతీశ్ చంద్ర మిశ్రా మాట్లాడుతూ.. క్యాబినెట్ ముందుకు ఈ అంశం వచ్చినప్పుడు.. న్యాయవ్యవస్థలో పదోన్నతుల అంశాన్నీ చేర్చాలని కోరారు. కోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డీఎంకే, టీఆర్ఎస్, వామపక్ష పార్టీలు డిమాండ్‌చేశాయి. దీనిపై చర్చించి, తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొనడంతో.. సంతృప్తిచెందని విపక్షాలు (శివసేన మినహా) సభ నుంచి వాకౌట్ చేశాయి.

## ప్రతిపాదనలు అవాస్తవికం

### బడ్జెట్‌పై చర్చలో విపక్షాలు

**బడ్జెట్** ప్రతిపాదనలు అవాస్తవికమని, దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వం వాస్తవాలను అంగీకరించడం లేదని రాజ్యసభలో విపక్షాలు ఆరోపించాయి. కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పీ చిదంబరం బడ్జెట్‌పై చర్చను ప్రారంభిస్తూ.. దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడానికి దగ్గరల్లో ఉందని, 'అసమర్థ వైద్యు లు' దానికి చికిత్స అందిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మాట్లాడుతూ.. ఆర్థికవ్యవస్థ క్లిష్ట పరిస్థితులలో ఉన్నదన్నారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు మానస్ రంజన్ భూనియా మాట్లాడుతూ.. నార్త్ బ్లాక్ నుంచి ఆర్థిక కరోనా వైరస్ వ్యాప్తిచెందుతున్నదని, ఇది ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్నదని విమర్శించారు. మరోవైపు, వృద్ధి రేటు తగ్గడం, నిరుద్యోగం పెరుగడంపై లోక్‌సభలో విపక్షాలు ఆందోళన వ్యక్తంచేశాయి. మజ్లిస్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. మైనార్టీలకు నిధులు తగ్గించడాన్ని లేవనెత్తారు. ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు ప్రస్తావించలేదని విమర్శించారు.

# ఎస్సీ, ఎస్టీ చట్ట సవరణ రాజ్యాంగబద్ధమే

సమర్థించిన సుప్రీంకోర్టు.. ఎఫ్ఐఆర్ నమోదుకు అనుమతి అక్కర్లేదని వెల్లడి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టానికి కేంద్ర ప్రభుత్వం 2018లో చేసిన సవరణలను సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే ప్రత్యేక పరిస్థితుల్లో నిందితులకు కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయవచ్చని తెలిపింది. 'ఎస్సీ, ఎస్టీ సవరణ చట్టం-2018' చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సోమవారం జస్టిస్‌లు అరుణ్‌మిశ్రా, రవీంద్ర భట్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదుకు ప్రాథమిక విచారణ, ఉన్నతాధికారుల అనుమతి అవసరం లేదని స్పష్టంచేసింది. నిబంధనల ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి ముందస్తు బెయిల్ మంజూరు చేయరు. అయితే.. చట్టం ప్రాథమిక ఉద్దేశం నెరవేరడం లేదని కోర్టు భావిస్తే ముందస్తు బెయిల్ మంజూరు చేయవచ్చని ధర్మాసనం పేర్కొన్నది. ప్రతి పౌరుడు తమ తోటివారిని సమానంగా చూడాలని, సోదర భావం పెంపొందించుకోవాలని సూచించింది. ప్రాథమిక విచారణలో నేరం నిరూపణ కాకుంటే కోర్టులు ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయవచ్చని పేర్కొన్నది.

**ఇదీ నేపథ్యం**

ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని, చట్టాన్ని అడ్డుపెట్టుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ చట్టం కింద ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదని, ముందుగా ప్రాథమిక విచారణ జరుపాలని 2018 మార్చి 20న తీర్పునిచ్చింది. నిందితులకు ముందస్తు బెయిల్ మంజూరు చేయవచ్చని కూడా పేర్కొన్నది. దీంతో చట్టాన్ని నీరుగారుస్తున్నారంటూ దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ఈ నేపథ్యంలో పాత నిబంధనలు అమల్లోకి వచ్చేలా పార్లమెంట్ 2018 ఆగస్టు 9న ఎస్సీ, ఎస్టీ చట్టానికి సవరణలు చేస్తూ బిల్లును ఆమోదించింది. మరోవైపు మార్చి 20 నాటి తీర్పుపై కేంద్రం రివ్యూ పిటిషన్ దాఖలు చేయగా.. గత ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ అక్టోబర్ 1న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దీంతో కేంద్రం చేసిన సవరణ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ జరిపిన ధర్మాసనం.. చట్టాన్ని సమర్థిస్తూ తీర్పునిచ్చింది.

# మతస్వేచ్ఛకు పరిధి ఏమిటి?

**శబరిమల కేసులో ఏడు న్యాయ ప్రశ్నలు.. 17 నుంచి రోజువారీ విచారణ**

**న్యూఢిల్లీ:** శబరిమల వివాదంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకొన్నది. ప్రస్తుతం ఈ కేసుపై విచారణ జరుపుతున్న ఐదుగురు సభ్యుల ధర్మాసనం.. మతస్వేచ్ఛ, మత విశ్వాసాలకు సంబంధించిన ఏడు న్యాయపరమైన ప్రశ్నలను విస్తృత ధర్మాసనానికి నివేదించాలని అభిప్రాయపడినట్టు న్యాయస్థానం సోమవారం వెల్లడించింది. ఈ ఏడు ప్రశ్నలపై తొమ్మిది మంది సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతుందని చీఫ్ జస్టిస్ ఎస్ఏ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొన్నది. మతస్వేచ్ఛకు పరిధి ఏమిటి? ఆర్టికల్ 25, 26 ప్రకారం పౌరుల హక్కులు, మత హక్కులు రాజ్యాంగంలోని 3వ పీఠికలో భాగమా? మతస్వేచ్ఛకు, ప్రాథమిక హక్కులకు మధ్య సంబంధం ఉన్నదా? ఆర్టికల్ 25(2)(బీ) ప్రకారం హిందువులంటే ఎవరు? ఒక మతంతో సంబంధంలేని వ్యక్తికి ఆ మతాన్ని ప్రశ్నించే హక్కు ఉంటుందా? లేదా? అనే ప్రశ్నలపై తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ నెల 17 నుంచి రోజువారీ విచారణ జరుపుతుందని తెలిపింది. ఈ విస్తృత ధర్మాసనంలో చీఫ్ జస్టిస్ ఎస్ఏ బోబ్డేతోపాటు జస్టిస్‌లు ఆర్ భానుమతి, అశోక్ భూషణ్, ఎల్ నాగేశ్వర రావు, ఎంఎం శంతనగౌడర్, ఎస్ఏ నజీర్, ఆర్ సుభాష్‌రెడ్డి, బీఆర్ గవాయ్, సూర్యకాంత్ సభ్యులుగా ఉంటారు.

# మాజీ స్నేహితుడి దురాఘతానికి..

# అధ్యాపకురాలు బలి

కాలినగాయాలతో చికిత్సపొందుతూ మృతి.. మహారాష్ట్రలోని వార్ధాలో ఘటన

**నాగ్‌పూర్, ఫిబ్రవరి 10:** మహారాష్ట్రలోని వార్ధా జిల్లాలో మాజీ స్నేహితుడి దాడిలో గాయపడ్డ అధ్యాపకురాలు అంకిత పిసుడె చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందారు. ఈ నెల 3వ తేదీన కళాశాలకు వెళ్తున్న అంకితను ఆమె మాజీ స్నేహితుడు వికేశ్ నగ్రాలా సజీవదహనం చేసేందుకు యత్నించాడు. ఈ ఘటనలో 40 శాతంవరకు కాలిపోయిన ఆమె నాగ్‌పూర్‌కు చెందిన ఓ దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచినట్టు హింగన్‌ఘాట్ సీఐ సత్యవీర్ బండివర్ తెలిపారు. బాధితురాలి మృతి విషయం తెలుసుకున్న స్థానికులు ఆగ్రహంతో రహదారిపై రాళ్లువేశారు. అంకిత స్వగ్రామం దరోడాకు మృతదేహాన్ని తరలిస్తుండగా.. రాళ్లువేసి రోడ్డును నిర్బంధించారు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అంకిత మృతిపై ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారిస్తామని చెప్పారు. హింగన్‌ఘాట్ ప్రజలు సహనంతో ఉండాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేస్తున్న దిశ చట్టాన్ని తమ ప్రభుత్వం అధ్యయనం చేస్తుందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. 'నా బిడ్డ వారంపాటు పడ్డ నరకయాతనను నిందితుడు కూడా అనుభవించాలి. మాకు త్వరగా న్యాయం చేయండి. నిర్భయ కేసు మాదిరిగా ఆలస్యం చేయొద్దు' అని అంకిత తండ్రి మీడియా ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. అంకితను కాపాడేందుకు అన్నివిధాలా ప్రయత్నించామని, కానీ ఇన్‌ఫెక్షన్ ఎక్కువై ప్రాణాలు వదిలారని హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ తెలిపారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో కేసు విచారణ జరిపిస్తామని, బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొంతకాలంగా అంకితను వేధిస్తున్న నగ్రాలాను ఈ నెల 3వ తేదీన ఘటన జరిగిన తర్వాత కొన్ని గంటల్లోనే పోలీసులు అరెస్టుచేసినట్టు స్థానికులు చెప్పున్నారు. రెండేండ్ల కిందట వరకు నగ్రాలా, అంకిత స్నేహితులుగా ఉన్నారు. కానీ నగ్రాలా వ్యవహారశైలి నచ్చక అతన్ని ఆమె దూరంగా పెట్టినట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసును డీఎస్పీ తృప్తిజాదవ్ దర్యాప్తు చేయనున్నట్టు ఇప్పటికే ప్రకటించారు.



# కమ్యూనిటీ కిచెన్లపై రాష్ట్రాలకు వడ్డన

అఫిడవిట్ దాఖలుచేయని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు రూ.5 లక్షల జరిమానా

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా కమ్యూనిటీ కిచెన్లను (సామూహిక వంటశాలలు) ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై అఫిడవిట్ దాఖలుచేయని రాష్ట్రాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆయా రాష్ట్రాలపై రూ.5 లక్షల జరిమానా విధించింది. కేంద్ర ప్రభుత్వం, ఆయా రాష్ట్రాలు 24 గంటల్లోగా అఫిడవిట్ దాఖలు చేస్తే రూ.లక్ష మాత్రమే జరిమానా చెల్లించొచ్చని, లేని పక్షంలో రూ.5 లక్షలు కట్టాలని స్పష్టంచేసింది. జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. అఫిడవిట్ దాఖలుచేసిన పంజాబ్, నాగాలాండ్, కర్ణాటక, ఉత్తరాఖండ్, జార్ఖండ్, అండమాన్ నికోబార్ జరిమానా కట్టాల్సిన పనిలేదని తెలిపింది. ఆకలి, పౌష్టికాహార లోపంతో అనేక మంది చిన్నారులు మరణిస్తున్నారని, ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘనేనని పేర్కొంటూ సామాజిక కార్యకర్తలు అనున్ ధావన్, ఇషాన్ ధావన్, కుంజనా సింగ్ సుప్రీంకోర్టులో ఈ పిల్ దాఖలుచేశారు.

# రహదారి దిగ్బంధం తగదు

షాహీన్‌బాగ్‌లో సీఏఏ వ్యతిరేక నిరసనలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** ప్రజా రహదారిని దిగ్బంధించడం తగదని, అలాంటి చోట నిరవధిక ఆందోళనలతో ఇతరులకు అసౌకర్యం కలుగజేయవద్దని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కు వ్యతిరేకంగా ఢిల్లీలోని షాహీన్‌బాగ్‌లో గత ఏడాది డిసెంబర్ 15 నుంచి నిరసనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. నిరసనకారులు కాళింది కుంజ్-షాహీన్‌బాగ్ మార్గాన్ని దిగ్బంధించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగజేస్తున్నారని ఇటీవల కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ మేరకు సోమవారం కోర్టు విచారణ జరిపింది. ప్రజలకు నిరసన తెలిపే హక్కు ఉన్నదని, అయితే ఆందోళనలకు కేటాయించిన చోటనే ఇవి జరుగాలి కానీ ఇతరులకు అసౌకర్యం కలిగే ప్రజా రహదారుల్లో కాదని న్యాయమూర్తులు ఎస్‌కే కౌల్, కేఎం జోసఫ్‌లతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. మరోవైపు, షాహీన్‌బాగ్ నిరసనల్లో పాల్గొన్న నాలుగు నెలల బాబు మరణించిన ఉదంతంపై సుప్రీంకోర్టు దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. శిశువుతో నిరసనా? అని మండిపడింది. జనవరి 30న ఓ దంపతులు తమ నాలుగు నెలల బాబుతో కలిసి షాహీన్‌బాగ్ వద్ద నిరసనలో పాల్గొన్నారు. దీంతో అస్వస్థతకు గురై బాబు చనిపోయాడు. ఈ నేపథ్యంలో సాహస బాలల అవార్డు గ్రహీత జెన్ గుణవర్తన్ సదావర్తే ఇటీవల సీజేఐ కార్యాలయానికి లేఖ రాసింది. సోమవారం ఈ లేఖను పరిశీలించిన సుప్రీంకోర్టు దీనిని సుమోటోగా స్వీకరిస్తున్నట్లు చెబుతూ.. ఈ ఉదంతంపై కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

# బుర్ఖాను నిషేధించాలి.. యూపీ బీజేపీ నేత డిమాండ్

**అలీగఢ్ (యూపీ):** దేశంలో బుర్ఖాను నిషేధించాలంటూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ నేత రఘురాజ్ సింగ్ డిమాండ్ చేశారు. ఇప్పటికే చాలా దేశాల్లో నిషేధం అమల్లో ఉన్నదని చెప్పారు. బుర్ఖా వల్ల భద్రతా పరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశముందని, ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తులు బుర్ఖాను ధరించి దాడులకు పాల్పడటం, తప్పించుకొని పారిపోవడం జరుగొచ్చని తెలిపారు. రఘురాజ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన పార్టీ.. వివరణ ఇవ్వాలంటూ నోటీసు జారీ చేసింది.

# 'ఎస్సీ, ఎస్టీ' పదోన్నతులు చేపట్టలేకపోతున్నాం!

సుప్రీంకోర్టుకు పలు రాష్ట్రాల మొర

న్యూఢిల్లీ: పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ కోటా అంశం మరోసారి సుప్రీంకోర్టు ముందుకొచ్చింది. రిజర్వేషన్ కేటగిరిలో లేని ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ కేటగిరిల్లో పదోన్నతులు చేపట్టడం లేదని మహారాష్ట్ర తరఫు న్యాయవాది ఇందిరా జైసింగ్ కోర్టుకు తెలిపారు. జార్ఖండ్ తరఫున హాజరైన న్యాయవాది పీఎస్ పట్వాలియా కూడా ఇలాంటి వాదనే వినిపించారు. అటర్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వీటిని సమర్థించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ లక్ష పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ అంశంలో యథాతథ స్థితిని కొనసాగించాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించడంతో ఈ ప్రక్రియకు ఆటంకం కలుగుతున్నదని బీహార్, మధ్యప్రదేశ్, త్రిపుర ఇటీవల కోర్టు దృష్టికి తీసుకువచ్చాయి. రెండు వారాల తర్వాత పరిశీలిస్తామని చీఫ్ జస్టిస్ ఎస్ఏ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది.

# మోదీజీ.. రక్షించండి!

**జపాన్ నౌకలో చిక్కుకున్న భారతీయుల ఆవేదన.. 168 మంది ఉన్నట్టు అంచనా**

**చైనాలో 908కి చేరిన కరోనా మృతులు.. 40 వేలు దాటిన నిర్ధారణ కేసులు**



**టోక్యో:** భూ, వాయు మార్గాల ప్రయాణికులనే కాదు.. జలమార్గం గుండా ప్రయాణిస్తున్న వాళ్లను కూడా కరోనా మహమ్మారి వదల్లేదు. కరోనా పరీక్షల కోసం గతవారం జపాన్ తీరనగరం యొకొహామాలో నిలిపివేసిన జపాన్ నౌక 'డైమండ్ ప్రిన్సెస్'లో భారత్‌కు చెందిన ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారని అక్కడి భారత రాయబార కార్యాలయం సోమవారం తెలిపింది. అయితే, ఎంతమంది ఉన్నారన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. తమను వెనక్కి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వం, ప్రధాని మోదీ, ఐక్యరాజ్యసమితిని ఒడలో చిక్కుకుపోయిన భారతీయులు కోరుతున్నారు. గతనెల హాంకాంగ్‌లో దిగిన ప్రయాణికుడిలో కరోనా వైరస్ లక్షణాలు ఉండడంతో 3,711 మందితో ప్రయాణిస్తున్న డైమండ్ ప్రిన్సెస్ నౌకను యొకొహామాలో గతవారం నిలిపివేసి దిగ్బంధంలోకి తీసుకోవడం తెలిసిందే. నౌకలో ఉన్నవారికి పరీక్షలు నిర్వహించిన వైద్యుల బృందం సోమవారం మరో 65 మందికి కొత్తగా వైరస్ సోకినట్లు తేల్చింది. దీంతో నౌకలో ఈ వైరస్ బారిన పడిన వారి సంఖ్య 135కి చేరింది. జపాన్ తీరానికి చేరుకున్న నౌకలోని ప్రయాణికుల్లో ప్రాథమికంగా 300 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు.

## 1.97 లక్షల మందికి స్క్రీనింగ్

కరోనా వైరస్‌బారినపడి మరణించిన వారి సంఖ్య 908కి చేరింది. ఆదివారం ఒక్కరోజే 97 మంది చనిపోయినట్టు చైనా అధికారులు వెల్లడించారు. వైరస్ నిర్ధారిత కేసుల సంఖ్య 40,171కి చేరింది. కరోనా విషయంలో వైద్యపరంగా సహాయ సహకారాలు అందించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలోని అంతర్జాతీయ నిపుణుల బృందం సోమవారం రాత్రి చైనా చేరుకోనున్నట్టు అధికారులు వెల్లడించారు. కాగా ఇప్పటివరకూ 1,818 విమానాల్లో భారత్‌కు వచ్చిన 1,97,192 మంది ప్రయాణికులకు కరోనా నేపథ్యంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు కేంద్ర మంత్రి హర్షవర్ధన్ సోమవారం లోక్‌సభలో వెల్లడించారు.

**రక్షించండి**

యొకొహామలో నిలిపివేసిన జపాన్ నౌక 'డైమండ్ ప్రిన్సెస్'లో 160 మంది భారత సిబ్బంది, మరో ఎనిమిది మంది భారత ప్రయాణికులు ఉన్నారని సదరు నౌకలో పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన బినయ్ కుమార్ సర్కార్ అనే చెఫ్ తెలిపారు. ఈ వివరాల్ని ఓ జాతీయ మీడియా వెల్లడించింది. నౌకలో ఉన్న తమని రక్షించాలని కేంద్ర సర్కారుకు, మోదీకి, ఐరాసకు సర్కార్ ఓ వీడియోలో విజ్ఞప్తి చేశారు.

# కరోనాను జయించింది!

వైరస్ సోకిన తొలి భారతీయురాలికి తాజాగా 'కరోనా నెగెటివ్'

ప్రకటించిన కేరళ వైద్యాధికారులు

**తిరువనంతపురం, ఫిబ్రవరి 10:** ప్రపంచ దేశాలకు కునుకు లేకుండా చేస్తున్న కరోనా వైరస్ సోకి.. కేరళలోని త్రిచూర్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్న భారతదేశపు మొదటి కరోనా వైరస్ రోగి తాజా పరీక్షా ఫలితాలు ఆమె కోలుకుంటున్నట్టు సూచిస్తున్నాయి. జనవరి 30న చైనాలోని వుహాన్ నగరం నుంచి వచ్చిన భారత వైద్య విద్యార్థినికి పరీక్ష చేయగా కరోనా పాజిటివ్ వచ్చినట్టు కేరళ ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా ఆమె రక్త నమూనాలను కేరళలోని జాతీయ వైరాలజీ విభాగానికి (ఎన్ఐవీ) పంపగా.. కరోనా నెగెటివ్‌గా వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. అయినప్పటికీ పుణెలోని ఎన్ఐవీ నుంచి వచ్చే రిపోర్టు కోసం వేచిచూస్తున్నామని చెప్పారు. కాగా కరోనా వైరస్ సోకినట్లు అనుమానం ఉన్న 3,252 మందిని అబ్జర్వేషన్‌లో ఉంచినట్టు కేరళ ప్రభుత్వం ప్రకటించింది.

# సిరియాలో వైమానిక దాడులు.. 29 మంది మృతి

**అబిన్ సిమాన్ (సిరియా):** సిరియాలో రష్యా సంకీర్ణ దళాలు జరిపిన వైమానిక దాడుల్లో 29 మంది పౌరులు మరణించారు. అలెప్పో రాష్ట్రంలోని అబిన్ సిమాన్ గ్రామంపై సోమవారం జరిపిన వైమానిక దాడుల్లో 9 మంది మరణించగా వారిలో ఆరుగురు చిన్నారులు ఉన్నారు. ఇడ్లిబ్, అలెప్పో రాష్ట్రాల చుట్టుపక్కల జరిగిన మరో వైమానిక దాడిలో 20 మంది ప్రాణాలు కోల్పోయారు.

# రేపు కశ్మీర్‌లో దౌత్యవేత్తల బృందం పర్యటన

**శ్రీనగర్:** వివిధ దేశాలకు చెందిన పలువురు దౌత్యవేత్తల బృందం బుధవారం జమ్ముకశ్మీర్‌లో పర్యటించనుంది. ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి చాలా రోజులవుతున్న నేపథ్యంలో తాజాగా కశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులను తెలుసుకోవడానికి ఈ బృందం వస్తున్నది. ఈ బృందంలో ఎక్కువగా యురోపియన్ యూనియన్‌కు చెందిన దౌత్యవేత్తలు ఉండనున్నారు.

# ఐర్లాండ్ ఎన్నికల్లో వరాద్కర్‌కు ఎదురుదెబ్బ!

**లండన్:** ఐర్లాండ్ సాధారణ ఎన్నికల్లో ప్రధాని లియో వరాద్కర్‌కు ఎదురుదెబ్బ తగిలింది. భారత సంతతి వ్యక్తి అయిన వరాద్కర్ పార్టీ లిబరల్ కన్జర్వేటివ్ ఫైన్ గయెల్ మూడోస్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ప్రతిపక్షంగా ఉన్న సిన్ ఫిన్ పార్టీ ఆధిక్యంలో కొనసాగుతున్నది. ఆ పార్టీకి 24.5 శాతం ఓట్లు రాగా, వరాద్కర్ పార్టీకి 20.9 శాతం ఓట్లు వచ్చాయి. కన్జర్వేటివ్ ఫియాన్న ఫేల్ పార్టీ 22.2 శాతం ఓట్లతో రెండోస్థానంలో నిలిచింది. తిరిగి అధికారాన్ని చేపట్టడానికి వరాద్కర్ ప్రయత్నాలను ప్రారంభించారు. వరాద్కర్ తండ్రి ముంబైకి చెందగా, తల్లి ఐర్లాండ్‌కు చెందినవారు.

## ముంబై పేలుళ్ల కేసు.. హలారీ అరెస్ట్



**అహ్మదాబాద్:** ముంబైలో 1993లో జరిగిన వరుస పేలుళ్ల కేసులో ప్రధాన నిందితుడు మునాఫ్ హలారీని గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. అతడిని మాదకద్రవ్యాల కేసులో ఆదివారం అర్ధరాత్రి ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అదుపులోకి తీసుకున్నారు. ముంబై ఉగ్రదాడికి కుట్ర పన్నిన టైగర్ మెమన్‌కు హలారీ అత్యంత సన్నిహితుడు. 1993లో వరుస పేలుళ్ల కోసం హలారీ మూడు స్కూటర్లను కొనుగోలు చేసి వాటికి బాంబులు అమర్చాడు.

## ఆదిత్యుడి ధ్రువాలపై గురి!

**వ్యోమనౌకను ప్రయోగించిన ఈఎస్‌ఏ, నాసా**

**వాషింగ్టన్:** సూర్యుడి గురించి మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు, మొట్టమొదటిసారిగా ధ్రువాల ఫొటోలను తీసేందుకు సోమవారం సోలార్ ఆర్బిటార్ అనే వ్యోమనౌక బయలుదేరింది. యురోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్‌ఏ) చేపట్టిన ఈ ప్రాజెక్టుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) సహకారం అందిస్తున్నది. సోలార్ ఆర్బిటార్‌ను సోమవారం ఉదయం ఫ్లోరిడాలోని కేప్ కానవెరాల్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి నాసాకు చెందిన అట్లాస్-5 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపించారు. ఈ ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.10.7 వేల కోట్లు. జర్మనీలోని ఈఎస్‌ఏ కేంద్రం నుంచి దీనిని నియంత్రించనున్నారు. రోదసిలోకి చేరిన తర్వాత వ్యోమనౌక సౌరఫలకాలు విచ్చుకున్నాయని, ఈ మేరకు సిగ్నల్స్ అందాయని ఈఎస్‌ఏ అధికారులు తెలిపారు. మరో రెండు రోజుల్లో వ్యోమనౌకలోని పలు పరికరాలు పనిచేయడం ప్రారంభిస్తాయని, యాంటెన్నాలు భూమితో అనుసంధానం అవుతాయని చెప్పారు. వ్యోమనౌక సూర్యుడిని చేరేందుకు దాదాపు రెండేండ్లు పడుతుందన్నారు. ఈ క్రమంలో మొత్తం 22సార్లు తన కక్ష్యను మార్చుకుంటుందని



చెప్పారు. చివరగా సూర్యుడికి దాదాపు 42 లక్షల కి.మీ.ల దూరంలో ఉన్న బుధుడి కక్ష్యలోకి చేరుతుందన్నారు. అక్కడి నుంచి సూర్యుడిపై పరిశోధనలు చేస్తుందన్నారు. ఈ ఆర్బిటార్ సాయంతో సౌర తుఫాన్లకు గల కారణాలపై మరింత లోతుగా అధ్యయనం చేయాలని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## 'స్మార్ట్..సోషల్'తో సూసైడ్ ముప్పు

అధికంగా వాడితే మానసిక సమస్యలు ఖాయం.. కెనడా పరిశోధకుల హెచ్చరిక



**టొరంటో:** స్మార్ట్‌ఫోన్‌ను, సోషల్ మీడియాను లోకంగా భావించేవారికి హెచ్చరిక. అతిగా వాడితే మానసిక సమస్యలు తలెత్తడంతోపాటు కౌమారులు ఆత్మహత్య కు పాల్పడే అవకాశాలు ఉన్నాయని కెనడా శాస్త్రవేత్తలు సంచలన ప్రకటన చేశారు. స్మార్ట్‌ఫోన్లకు బానిసైన యువతలో మానసిక ఒత్తిడితోపాటు చదువులో వెనుకబడటం, నిద్రలేమి, వ్యక్తిగత అశ్రద్ధ వంటి సమస్యలు తలెత్తుతాయని, కుటుంబ సంబంధాలపైనా ఇది ప్రభావం చూపుతుందని చెప్పారు. ఈ దుష్ప్రభావాలను తగ్గించేందుకు కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాల్సి ఉంటుందని సూచించారు. యువత స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియాలో వెచ్చించే సమయాన్ని క్రమంగా తగ్గించాలని, ఒకేసారి నిషేధిస్తే వ్యతిరేక ఫలితాలు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. ఇది ఆత్మహత్యకు పురిగొల్పవచ్చని హెచ్చరించారు.





'డీ వార్మింగ్‌డే' సందర్భంగా సోమవారం రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి 'హ్యాండ్ వాషింగ్ క్యాంపెయిన్'లో పాల్గొన్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

## ఓడి విళయాడు పాపా..

- తమిళ బాల గేయంతో గవర్నర్‌కు విద్యార్థుల స్వాగతం
- సంభ్రమాశ్చర్యానికి గురైన తమిళిసైసౌందర్‌రాజన్
- ఆ పాటను స్వయంగా పాడి అర్థాన్ని వివరించిన గవర్నర్
- రాజ్‌భవన్ హైస్కూల్‌లో డీవార్మింగ్‌డే

**ఖైరతాబాద్:** తెలుగునాట బహు ప్రాచుర్యం పొందిన చిట్టీ చిలకమ్మ పాట మాదిరిగా.. తమిళనాడులో దశాబ్దాలుగా చిన్నారుల నోట పాటై విరాజిల్లుతున్న 'ఓడి విళయాడు పాపా.. నీ పోయిందరిక్కులో అగాదు పాపా.. కూడి విళయాడు పాపా.. ఒరు కొరుందయ్యాయ్ ఒయ్యాద్ పాపా' అనే గేయాన్ని రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థులు (స్వరూప, నిహారిక, వేణుమాధవ్, వైష్ణవి, బేబీ, కీర్తి, అరభి) తమిళనాడు వాస్తవ్యురాలైన రాష్ట్ర గవర్నర్ తమిళిసైసౌందర్‌రాజన్ ఎదుట పాడారు. ప్రముఖ విజిల్ ఆర్టిస్ట్ రమణ వద్ద ప్రత్యేక శిక్షణ పొందిన రాజభవన్ హైస్కూల్ విద్యార్థులు సోమవారం పాఠశాలలో నిర్వహించిన 'డీ వార్మింగ్‌డే' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ తమిళిసై ఎదుట ఆలపించి ఆమెను మైమరిపింపజేశారు. అనంతరం గవర్నర్ ఆ పాట పాడి అర్థాన్ని వివరించారు. ఓడి విళయాడు పాపా (ఒక చోట ఆగవద్దు వెళ్లి ఆడుకో), కూడి విళయాడు పాపా (ఒక్కదానివి కాకుండా పిల్లలందరితో కలిసి మెలిసి ఆడుకోవాలి), ఒరు కొరుందయ్యాయ్ ఒయ్యాద్ పాపా (తిట్టుకోకుండా, కొట్టుకోకుండా కలిసి కట్టుగా ఆడుకోవాలి), చిన్నంజిరు కురువి పోలే పాపా (చిన్నారులు పక్షిలా విహరిస్తూ సంతోషంగా గడపాలి) అంటూ పాట సారాంశాన్ని తెలిపి స్ఫూర్తి నింపారు. డీవార్మింగ్‌డేపై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి హ్యాండ్ వాషింగ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. హైస్కూల్‌లో పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధికి గవర్నర్ తన వంతుగా రూ.1.5 లక్షలు విరాళంగా అందచేశారు. కార్యక్రమంలో గవర్నర్ కార్యాలయం సహాయ కార్యదర్శులు భవానీ శంకర్, రఘుప్రసాద్, సహాయ కార్యదర్శి సీతారాములు, హైదరాబాద్ డీఈవో వెంకటనర్సమ్మ, డిప్యూటీ డీఈవో చిరంజీవి, యూనిసెఫ్ వాషింగ్ ఇన్‌స్టిట్యూషన్ కన్సల్టెంట్ డాక్టర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# జామియా మళ్లీ హింసాత్మకం

- పార్లమెంట్ వైపు ప్రదర్శనకు విద్యార్థుల యత్నం
- మహిళలు, విద్యార్థినులపై ఖాకీల దాష్టీకం.. 16 మందికి గాయాలు
- మధ్య ఢిల్లీ నుంచి జంతర్‌మంతర్ వరకు మరో ప్రదర్శన





జామియా వర్సిటీ వద్ద విద్యార్థినిని ఈడ్చివేస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) గాయపడిన ఓ విద్యార్థిని

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా దేశ రాజధాని హస్తినలోని జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ విద్యార్థులు చేపట్టిన ప్రదర్శన హింసాత్మకమైంది. వర్సిటీ నుంచి పార్లమెంట్‌కు బయలుదేరిన జామియా వర్సిటీ విద్యార్థులు, స్థానికులను యూనివర్సిటీ ఏడో గేట్ వద్దే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు, మహిళల పట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు. మర్మాంగాలను లక్ష్యంగా మహిళలను, విద్యార్థినులను నడుముకు దిగువన కొట్టి గాయపరిచారు. ఆందోళనకారులను తోసివేస్తూ మూలకు నెట్టివేశారు. తొక్కిసలాట పరిస్థితులతో విద్యార్థినులు ఊపిరి పీల్చుకోలేకపోయారు. ఈ ఘర్షణలో గాయపడిన 16 మంది అల్‌షిఫా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఛాతిలో, పొత్తి కడుపులో నొప్పి రావడంతోపాటు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో ఒకరిని ఐసీయూలో చేర్చారు. కొందరు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. అయితే, సమయం గడిచిన కొద్దీ ఆందోళనకారుల సంఖ్య పెరిగింది. బ్యారికేడ్లను దాటుకుంటూ ముందుకెళ్లిన విద్యార్థులను భారీగా మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. హల్లాబోల్ నినాదాల మధ్య త్రివర్ణ పతకాలు ప్రదర్శిస్తూ పురుషులు మానవ హారం నిర్మిస్తే, మహిళలు ముందుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులకు అనుమతి పత్రాలు చూపబోమన్నారు. 'బ్రిటిష్ పాలకులకే భయపడలేదు. ఇతరులకు ఎందుకు భయపడాలి?' అని స్పష్టం చేశారు. చివరకు విద్యార్థులు వర్సిటీ బయట ధర్నాకు దిగారు. భద్రతా కారణాల పేరుతో సుఖ్‌దేవ్ విహార్ స్టేషన్‌ను మూసివేసినట్లు ఢిల్లీ మెట్రో రైల్ తెలిపింది. సుఖ్‌దేవ్ విహార్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు 'మధ్య ఢిల్లీ'లో వందల మంది ఆందోళనకారులు కదం తొక్కారు. పదేండ్ల బాలలు, వృద్ధులు, యూనివర్సిటీ విద్యార్థులు, పౌర సమాజ సభ్యులు నిరసనలో పాల్గొన్నారు. మండీ హౌస్ నుంచి బారాఖంబా రోడ్డు, టాల్‌స్టాయ్ రోడ్ మీదుగా జంతర్‌మంతర్ వరకు సాగారు. ఈ నేపథ్యంలో పోలీసులు, పారా మిలిటరీ బలగాలను భారీగా మోహరించారు. ఒక పోలీస్ అధికారి మాట్లాడుతూ ఆందోళనకారులు అనుమతి తీసుకోకున్నా, వారి ప్రదర్శన శాంతియుతంగా సాగినందున తమకు ఏ సమస్యా లేదన్నారు. వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా (డబ్ల్యూపీఏ) ఆధ్వర్యంలో నిరసన జరిగింది. స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, చంద్రశేఖర్, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలె ఫొటోలు పట్టుకుని మరీ ఆందోళనలో పాల్గొన్నారు. నల్ల చట్టాన్ని వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత సెప్టెంబర్‌లో అవినీతి, నిర్లక్ష్యం కేసుల నుంచి నిర్దోషిగా బయటపడిన గోరఖ్‌పూర్ బీఆర్డీ దవాఖాన డాక్టర్ కఫీల్‌ఖాన్ భార్య, దేశద్రోహ నేరం కింద అరెస్టయిన షర్జీల్ ఇమామ్ సోదరుడు, తదితరులు పాల్గొన్నారు. షాహీన్‌బాగ్‌లో మాదిరిగా నిరసన తెలుపుతున్న సుందర్ నగ్రీ ప్రాంత వాసులు కూడా ఈ ప్రదర్శనలో పాలుపంచుకున్నారు.

## పార్లమెంట్ లోపలికి సైనికులు

అనుమతించిన ఎల్ సాల్వడార్ అధ్యక్షుడు

**శాన్‌స్లావడర్:** పార్లమెంట్‌లో నిధుల ఆమోదం కోసం ఎల్ సాల్వడార్ అధ్యక్షుడు నయీబ్ బుకెలే ఏకంగా సైనికులను రంగంలోకి దింపారు. పార్లమెంట్ లోపలికి వారిని అనుమతించారు. ఈ ఘటనను పలు దేశాలు, మానవ హక్కుల సంస్థలు తీవ్రంగా ఖండించాయి. దేశంలో ముఠా అరాచకాలను అదుపు చేయాలంటే సైనికులకు, పోలీసులకు అత్యాధునిక ఆయుధాలు, పరికరాలు అవసరమని భావించిన బుకెలే వీటి కొనుగోలు నిమిత్తం నిధుల కోసం పార్లమెంట్ అనుమతిని కోరారు. అయితే దీనిపై చర్చించడానికి సెలవు రోజైన ఆదివారం పార్లమెంట్‌కు హాజరుకావడానికి ప్రజాప్రతినిధులు నిరాకరించారు. దీంతో మంకుపట్టు వీడని అధ్యక్షుడు సైనికులను పార్లమెంట్‌లోపలికి అనుమతించారు. ఆయుధాలను ధరించి పార్లమెంట్ లోపలికి ప్రవేశించిన సైనికులు, పోలీసులు.. ప్రజా ప్రతినిధుల చుట్టూ నిలబడ్డారు. ఎల్ సాల్వడార్‌లో 1992లో ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన తర్వాత పార్లమెంట్‌లోకి సైనికులు ప్రవేశించడం ఇదే తొలిసారి. పార్లమెంట్ బయట బుకెలే మాట్లాడుతూ నిధుల కోసం ఇప్పుడు ఆమోదం లభించకపోతే వచ్చే ఆదివారం మళ్లీ సమావేశం నిర్వహిస్తానని చెప్పారు.

## సీఏఏ అకృత్యాలపై యూపీ సర్కార్‌కు ఎన్‌హెచ్చార్సీ నోటీసు

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వ్యతిరేక ఆందోళనకారులపై అకృత్యాలకు పాల్పడిన పోలీసులపై తీసుకున్న చర్యలేమిటో తెలుపాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్చార్సీ) నోటీసు జారీ చేసింది. ఆరు వారాల్లో సమాధానం ఇవ్వాలని యూపీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. గత నెల 27న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ తదితరులు ఎన్‌హెచ్చార్సీ చైర్‌పర్సన్, ఇతర సీనియర్ అధికారులను కలుసుకుని 31 పేజీలతో సవివరమైన వినతిపత్రాన్ని సమర్పించారు. ఆందోళనకారులపై దాడులకు సంబంధించిన వీడియోలు, ఫొటోగ్రాఫ్‌లను అందజేశారు. రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్న తీరును ఎన్‌హెచ్చార్సీ చైర్మన్‌కు వివరించారు. దీంతో ఎన్‌హెచ్చార్సీ యూపీ ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది.

## ప్లాస్టిక్ వ్యర్థాలకు స్నాక్స్, చాయ్

**గుజరాత్‌లో ప్లాస్టిక్ కేఫ్ ఏర్పాటు**

**వడోదర:** సాధారణంగా హోటళ్లలో వినియోగదారులు డబ్బులిస్తే చాయ్, స్నాక్స్ ఇస్తారు. కానీ, గుజరాత్‌లోని ఓ హోటల్‌లో మాత్రం ప్లాస్టిక్ వ్యర్థాలకు కూడా చాయ్, స్నాక్స్ ఇస్తున్నారు. రాష్ట్రంలోనే తొలిసారి దాహోద్ జిల్లాలోని తాసిల్ పంచాయతీ ముందున్న 'ప్లాస్టిక్ కేఫ్'లో ఈ వెసులుబాటున్నది. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు. 'గిరిజన ప్రాబల్యం కలిగిన దాహోద్ జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్లాస్టిక్ కేఫ్‌ను ఏర్పాటుచేశారు. కిలో ప్లాస్టిక్ తీసుకొచ్చినవారికి స్నాక్స్ లభిస్తాయి. అరకిలో తీసుకొచ్చేవారికి చాయ్ లభిస్తుంది' అని డిప్యూటీ జిల్లా అభివృద్ధి అధికారి పతన్‌వాడియా తెలిపారు. గుజరాత్ ప్రభుత్వ 'సఖి మండల్' పథకం కింద ఈ స్నాక్స్‌ను మహిళలు తయారుచేస్తున్నారని పేర్కొన్నారు. కేఫ్ ప్రారంభమైన నాటినుంచి గణనీయమైన మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నదని తెలిపారు. అలా సేకరించిన వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే జిల్లాలోని ఇతర తహసిళ్లకు విస్తరించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన వివరించారు.

## ఏపీలో పెరిగిన విద్యుత్ చార్జీలు

- 500 యూనిట్లు దాటినవారికే వర్తింపు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ చార్జీలు పెరిగాయి. యూనిట్‌కు 90 పైసల చొప్పున ప్రభుత్వం పెంచింది. 500 యూనిట్లు పైబడిన వినియోగదారులకు మాత్రమే ఈ పెంచిన చార్జీలు వర్తించనున్నాయి. ఈ పెంపుతో ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థలపై భారం పడనున్నది. కాగా 500 యూనిట్లు పైబడినవారికి టారిఫ్ రూ.9.05 నుంచి రూ.9.95కి పెంచారు. దీంతో 1.45 కోట్ల గృహ వినియోగదారుల్లో 1.30 లక్షల గృహ వినియోగదారులపై భారం పడనున్నది. 500 యూనిట్లులోపు గృహ వినియోగదారులకు టారిఫ్ రేట్లను పెంచలేదు. ప్రతి నెలకు ఆ నెలలోని విద్యుత్ వినియోగంపైనే ఈ వర్గీకరణ ఉండేందుకు ఏపీఆర్సీ ఆమోదం తెలిపింది. ఇక వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించేందుకు రూ.8,353.58 కోట్లను విద్యుత్ సంస్థలకు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. గత ఏడాదితో పోలిస్తే 18 శాతం ఎక్కువ సబ్సిడీ పెరిగింది. దీంతో అదనంగా 18 లక్షల మంది వ్యవసాయదారులకు లబ్ధి చేకూరనున్నది. 500 యూనిట్లలలోపు గృహ వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ సరఫరాకు రూ.1,707.07 కోట్లను సబ్సిడీ రూపంలో విద్యుత్ సంస్థలకు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది.

# చెన్నూరుకు కాళేశ్వర గంగ

మొదటిపేజీ తరువాయి...

సమీక్షించారు. అనంతరం నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపగా... వాటిని పరిశీలించిన ప్రభుత్వం లిఫ్టు పథకాలపై సమగ్ర సర్వే నిర్వహించి, డీపీఆర్ రూపకల్పనకు రూ.6.88 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అధికారులు టెండర్ల ద్వారా సర్వే ఏజెన్సీని ఎంపికచేయనున్నారు. అనంతరం లిఫ్టు పథకాలకుగాను చేపట్టాల్సిన పంపుహౌస్‌లు, పైపులైన్ నిర్మాణం, విద్యుత్తు సబ్‌స్టేషన్లు, ఇప్పటికే ఉన్న చెరువుల నీటినిల్వను పెంచడం, అందుబాటులో ఉన్న వ్యవస్థను మెరుగుపరచడంతోపాటు కొత్తగా నిర్మించాల్సిన కాల్వలు తదితర అంశాలు, అంచనావ్యయంతో కూడిన సమగ్ర నివేదికను రూపొందిస్తారు. మూడు లిఫ్టు పథకాల స్వరూపమిది...

**ప్రాణహితపై వెంచపల్లి లిఫ్టు:**
లక్ష్మీబరాజ్ ఫోర్‌షోర్ అంటే ప్రాణహితపై వేమన్‌పల్లి మండలంలోని వెంచపల్లి వద్ద లిఫ్టును ఏర్పాటుచేయనున్నారు. సముద్రమట్టానికి 98 మీటర్ల వద్ద ఏర్పాటుచేయనున్న లిఫ్టు ద్వారా 30మీటర్ల ఎత్తులో జలాలను వెంచపల్లి వద్ద నిర్మించే సిస్టర్న్‌లోకి ఎత్తిపోస్తారు. తద్వారా వేమన్‌పల్లి మండల పరిధిలోని భూములకు సాగునీరందిస్తారు. ఆ తర్వాత మరో 20 మీటర్ల మేర ఎత్తి.. పదికిలోమీటర్ల దూరంలోని కోటపల్లి ప్రాంతానికి తరలిస్తారు.

**సరస్వతి బరాజ్ ఫోర్‌షోర్ లిఫ్టు:**
సరస్వతి బరాజ్ ఫోర్‌షోర్ వద్ద లిఫ్టు ఏర్పాటుతో 60 వేల ఎకరాలకుపైగా భూములకు సాగునీరందించనున్నారు. బరాజ్ వద్ద 115 మీటర్ల స్థాయిలో లిఫ్టును ఏర్పాటు చేసి.. 50 మీటర్ల ఎత్తు, 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మద్దికల్ చెరువులోపోయడం వల్ల చెన్నూరు, కోటపల్లి మండలాల పరిధిలో భూములకు నీరందుతుంది.

**పార్వతి బరాజ్ ఫోర్‌షోర్ లిఫ్టు:**
పార్వతి బరాజ్ బ్యాక్‌వాటర్‌తో మూడు మండలాల పరిధిలో 50వేల ఎకరాలకు పైగా సాగునీరు అందనున్నది. బరాజ్ 127 మీటర్లస్థాయిలో నీటిని మళ్లించి.. 31 కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగాపూర్ చెరువులో పోయనున్నారు. ఇందుకుగాను 83 మీటర్ల మేర నీటిని ఎత్తిపోయనున్నారు. లింగాపూర్ చెరువు నుంచి గ్రావిటీ ద్వారా జైపూర్ మండల పరిధిలోని పొన్నారం చెరువు (180 మీటర్ల స్థాయి)కు కూడా నీరందించనున్నారు. దీంతో ఈ లిఫ్టు ద్వారా జైపూర్, భీమారం, మందమర్రి మండలాల పరిధిలోని భూములకు సాగునీరు అందించనున్నారు.

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్



చెన్నూరు నియోజకవర్గంలో 1.20 లక్షల ఎకరాలకుపైగా భూములను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తానని మందమర్రి ఎన్నికల ప్రచార సభలో ఇచ్చిన మాటను సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారు. అందులోభాగంగానే కాళేశ్వరం బరాజ్‌ల నుంచి మూడులిఫ్టు పథకాల సర్వేకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఐదుమండలాల్లోని 102 గ్రామాల పరిధిలో 1.35 లక్షల ఎకరాలకు సాగునీరందించడంతోపాటు 367 చెరువులు నింపడం సాధ్యమవుతుంది. ఈ లిఫ్టు పథకాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం నియోజకవర్గ రైతాంగంలో ఆనందాన్ని నింపింది. ఇందుకు సీఎం కేసీఆర్, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌కు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు. తాజా ఉత్తర్వులతో సీఎం కేసీఆర్‌తోపాటు టీఆర్‌ఎస్ పార్టీని రైతులు గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారు.

– ప్రభుత్వ విప్ బాల్క సుమన్

# సాగర్‌కు నీరు వదలండి

- 58 టీఎంసీలు విడుదలకు కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ
- ఇరు రాష్ట్రాలకు కావాల్సింది 135.51 టీఎంసీలు.. ఉన్నది 76.57

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**
నాగార్జునసాగర్ జలాశయంలో ఎండీడీఎల్ ఎగువన ఉన్న నీటి నిల్వ రెండు తెలుగు రాష్ట్రాల అవసరాలకు సరిపోయే అవకాశం లేకపోవడంతో వెంటనే శ్రీశైలం జలాశయం నుంచి 58 టీఎంసీల నీటిని దిగువకు విడుదలచేసేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ నీటిపారుదలశాఖ కృష్ణా నదీ యాజమాన్య బోర్డును కోరింది. ఈ మేరకు ఈఎన్సీ మురళీధర్‌రావు బోర్డు సభ్య కార్యదర్శికి లేఖ రాశారు. వాస్తవంగా రెండు రాష్ట్రాల యాసంగి సాగునీటి అవసరాలతోపాటు వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొన్నిరోజుల కిందట కృష్ణా బోర్డు శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో కనీస నీటి సేకరణ స్థాయి (ఎండీడీఎల్) ఎగువన ఉన్న కృష్ణా జలాలను పంపిణీచేసింది. ఈమేరకు నీటివిడుదల ఉత్తర్వులు కూడా ఇచ్చింది. దీంతో కలుపుకొని బోర్డు ఏపీకి 533.564 టీఎంసీలు, తెలంగాణకు 241.953 టీఎంసీల నీటి వినియోగానికి ఉత్తర్వులు జారీచేసినట్లయింది. ఈ నెల 4వ తేదీనాటికి ఏపీ 481.330 టీఎంసీలు వినియోగించుకోగా, తెలంగాణ 132.335 టీఎంసీలను వాడుకున్నది. ప్రధానంగా సాగర్ నుంచి ఇంకా రెండు రాష్ట్రాలు 135.51 టీఎంసీలు వాడుకోవాల్సి ఉండగా, సాగర్ ఎండీడీఎల్ ఎగువన (510 అడుగులు) కేవలం 77.571 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నది. ఇంకా దాదాపు 58 టీఎంసీల వరకు కావాలి. గత నెల 9న జరిగిన బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు శ్రీశైలం నుంచి సాగర్‌కు 63 టీఎంసీలను విడుదలచేయాల్సి ఉండగా, ఇప్పటివరకు విద్యుత్ కేంద్రాల ద్వారా కేవలం ఐదు టీఎంసీలు మాత్రమే విడుదలచేశారు. ఈ నేపథ్యంలో వెంటనే ఏపీ, టీఎస్ జెన్‌కోలు రెండు విద్యుత్ కేంద్రాల ద్వారా మిగిలిన 58 టీఎంసీల నీటిని విడుదలచేసేందుకు చర్యలు చేపట్టాలని ఈఎన్సీ తన లేఖలో కోరారు.

## ఉర్దూ భాషాభివృద్ధికి కృషి

- ఉర్దూ అకాడమీ చైర్మన్ రహీముద్దీన్ అన్సారీ
- వివిధ క్యాటగిరీల్లో అవార్డులకు దరఖాస్తులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధి, పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషిచేస్తున్నదని ఉర్దూ అకాడమీ చైర్మన్ రహీముద్దీన్ అన్సారీ చెప్పారు. సోమవారం నాంపల్లి హజ్‌హౌస్‌లోని ఉర్దూ అకాడమీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడ్డాక మౌలానా అబుల్‌కలాం ఆజాద్ నేషనల్ అవార్డు, మఖ్దూమ్ అవార్డు, లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు సహా పలు అవార్డులను ప్రదానం చేస్తున్నామన్నారు. 2018 సంవత్సరానికిగాను రచనల క్యాటగిరీకి రెండు, పరిశోధన, విమర్శకులు, ఎడ్యుకేషన్, జర్నలిజం విభాగాల్లో ఒక్కొక్కటి చొప్పున లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు.

## కేంద్రం రైతు వ్యతిరేకి

- బడ్జెట్‌ను నిరసిస్తూ 13న కార్యక్రమాలు
- రైతులకు ఏఐకేఎస్‌సీసీ పిలుపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామీణ ప్రజల ఆదాయం, కొనుగోలు శక్తిని పెంచడంలో కేంద్ర బడ్జెట్ విఫలమైందని అఖిల భారత రైతాంగ పోరాట సమన్వయ కమిటీ (ఏఐకేఎస్‌సీసీ) విమర్శించింది. బడ్జెట్‌లో గ్రామీణప్రాంతాల వాటా 9.83 శాతం నుంచి 9.30 శాతానికి తగ్గిందని, బడా కార్పొరేట్ కంపెనీల లాభాలను పెంచడానికే ఈ బడ్జెట్ తోడ్పడుతుందని ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించతలపెట్టిన నిరసన కార్యక్రమంలో రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చింది. సోమవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూంభవన్‌లో అఖిలభారత రైతాంగ పోరాట సమన్వయ కమిటీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలు చెల్లించకుండా బకాయిపడిన రూ.2 లక్షల కోట్ల రుణాలను కేంద్రం ఇటీవల మాఫీ చేసి, వారికి అదనంగా 1.45 లక్షల కోట్ల పన్ను రాయితీలను కల్పించిందని విమర్శించారు. మూడేండ్లలో రైతులు నష్టపోగా, ప్రైవేటు కంపెనీలు పంటబీమా నుంచి రూ.18,830 కోట్లు సంపాదించాయని అన్నారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తీగల సాగర్, పశ్య పద్మ, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అచ్యుత రామారావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

## గుంటూరులో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొట్టిన మినీలారీ.. ఆరుగురి మృతి

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటో మినీలారీ ఢీకొని ఆరుగురు మృత్యువాతపడగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక పసికందు ఉన్నారు. సోమవారం ఉదయం నరసరావుపేట నుంచి ఫిరంగిపురం వైపు వస్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన మినీలారీ రేపూడి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎడ్లపాడు మండలం కొత్తకోట గ్రామానికి చెందిన కాకాని రమాదేవి (40, కాకాని యశ్విని (11 నెలలు)తోపాటు మరో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కాకాని బాలమణికంఠ (5)సహా మరొకరు దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

# వేస్ట్ మేనేజ్‌మెంట్ అడ్వైజరీ బోర్డేదీ?

- జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు కేసులో హైకోర్టు ఆదేశాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో ఘనవ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు, పర్యవేక్షణకు రాష్ట్రస్థాయి సలహా మండలి (స్టేట్‌లెవల్ అడ్వైజరీ బోర్డు)ని ఏర్పాటుచేశారా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. 2016లో కేంద్రం తీసుకొచ్చిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల అమలుకు తీసుకొంటున్న చర్యలను వివరించాలని మున్సిపల్ శాఖ, జీహెచ్‌ఎంసీకి సోమవారం ఆదేశాలు జారీచేసింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు పూర్తి నిల్వ సామర్థ్యం దాటిపోయిందని, యార్డు వల్ల దుర్వాసన భరించలేకపోతున్నామని పేర్కొంటూ స్థానిక జేజేకాలనీకి చెందిన కల్నల్ సీతారామరాజు రాసిన లేఖను హైకోర్టు గతంలో సుమోటోగా స్వీకరించింది. గత విచారణ సందర్భంగా డంపింగ్‌యార్డు తరలింపుపై వివరాలు తెలియజేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ సోమవారం కౌంటర్ దాఖలుచేసింది. డంపింగ్ యార్డు తరలింపునకు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల, ప్యారానగర్, పటాన్‌చెరు మండలం లఖడారం, రంగారెడ్డి జిల్లా ఖానాపూర్ తదితర ప్రాంతాల్లో యార్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నామని జీహెచ్‌ఎంసీ తెలిపింది. అఫిడవిట్‌ను పరిశీలించిన చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం.. ఇందులో పూర్తి వివరాలు లేవని తెలిపింది.

**ఇతర రాష్ట్రాల్లో ఎలా ఉన్నదో పరిశీలించండి**

ఘనవ్యర్థాల నిర్వహణకు ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి వ్యూహాలను అమలుచేస్తున్నారో పరిశీలించాలని, ఉత్తమ విధానాలుంటే వాటిని ఇక్కడ అమలుచేయొచ్చని హైకోర్టు సూచించింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్‌ఐ) చేసిన సూచనలు, వాటి అమలుకు జీహెచ్‌ఎంసీ తీసుకున్న చర్యలేమిటో తెలుపాలని హైకోర్టు పేర్కొన్నది. ఘనవ్యర్థాల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి 8 మెగావాట్ల ప్లాంట్ ఎప్పుడు వినియోగంలోకి వస్తుందని ప్రశ్నించింది. తడి, పొడిచెత్తను విడివిడిగా సేకరించాలని ధర్మాసనం తెలిపింది. పూర్తివివరాలతో వచ్చేనెల 2 వరకు అదనపు కౌంటర్ అఫిడవిట్ దాఖలుచేయాలని ఆదేశిస్తూ.. విచారణను మార్చి 3కు వాయిదా వేసింది.

**ఇంచార్జి వీసీల నియామకంపై వివరణ ఇవ్వండి: హైకోర్టు**

రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలకు ఐఏఎస్‌లను ఇంచార్జి వీసీలుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మెమో జారీచేయడంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ప్రతివాదులకు సోమవారం నోటీసులు జారీచేసింది. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఐఏఎస్‌లను ఇంచార్జి వీసీలుగా నియమించారని ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కరుణాకర్‌రెడ్డి దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలుచేయాలని ఉన్నత విద్యాశాఖతోపాటు, వివిధ యూనివర్సిటీలకు హైకోర్టు నోటీసులు జారీచేసింది.

## దుప్పి మాంసం పట్టివేత

**పెనుబల్లి:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం తాళ్లపెంటలో సోమవారం దుప్పి మాంసాన్ని అటవీ అధికారులు పట్టుకున్నారు. తాళ్లపెంట అడవిలో నుంచి ఓ ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వస్తుండగా అధికారులు తనిఖీ చేసి దుప్పి మాంసాన్ని గుర్తించారు. ఈ మాంసాన్ని తరలిస్తున్న గ్రామానికి చెందిన కాకా అప్పారావును అదుపులోకి తీసుకోగా అతడి వెంట ఉన్న మరో ఇద్దరు పరారయ్యారు. నిందితుడితోపాటు దుంపి మాంసాన్ని తల్లాడ రేంజి కార్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎఫ్‌ఎస్‌వో రామారావు తెలిపారు.

## యాంకర్ అనసూయపై అసభ్యకర పోస్టులు

- ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు..
- వెంటనే స్పందించిన సైబర్‌క్రైం పోలీసులు



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** సోషల్‌మీడియాలో తనపై అనుచిత వ్యాఖ్యలుచేయడంతోపాటు అసభ్యకర ఫొటోలు పోస్టుచేశారంటూ ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్ ట్విట్టర్ ద్వారా హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై వెంటనే స్పందించిన సీసీఎస్ సైబర్‌క్రైం పోలీసులు .. ఆయా అసభ్యకర పోస్టులను తొలిగించి, అవి పెట్టినవారి వివరాలు ఇవ్వాలని సంబంధిత సంస్థకు నోటీసులు జారీచేశారు. దీంతో అనసూయతోపాటు చిత్ర పరిశ్రమకు చెందిన ఇతరులపై పెట్టిన అభ్యంతరకర పోస్టులను కూడా ట్విట్టర్ నుంచి తొలగించారు. ఈ వ్యవహారంపై బాధితురాలు లేదా ఆమె తరఫున ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేస్తే కేసు నమోదుచేసి, సమగ్ర దర్యాప్తుచేస్తామని సీసీఎస్ సైబర్‌క్రైమ్స్ ఏసీపీ కేవీఎం ప్రసాద్ తెలిపారు.

# రైల్వేలైన్‌తో మహర్దశ



సిరిసిల్ల నేత కార్మికుడు కుసుమ నర్సింహస్వామి జకార్డ్ మరమగ్గంపై తయారు చేసిన మిషన్ భగీరథ చిత్రంతో కూడిన పట్టుచీరను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

- దేశంలోని అన్ని రాష్ట్రాలతో 3 జిల్లాలకు అనుసంధానం
- జూలైలోగా గోదావరి జలాలతో ఎగువ మానేరును నింపాలి
- జిల్లా అధికారుల సమీక్షలో ఐటీశాఖ మంత్రి కేటీఆర్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** 'కొత్తపల్లి, మనోహరాబాద్ రైల్వేలైన్ పూర్తిచేయడం ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాలతో అనుసంధానం ఏర్పడుతుంది. తద్వారా వెనుకబడ్డ మెట్ట ప్రాంతాలైన సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలు అభివృద్ధిలోకి వస్తాయి. ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులు దేశంలో ఎక్కడైనా ఎగుమతి చేసుకోవచ్చు. ప్రజలు తక్కువ ఖర్చుతో దేశవ్యాప్తంగా పర్యటించవచ్చు' అని మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. 2022 నాటికి ఈ ప్రాంతవాసులకు రైలు కూత వినిపించాలని, అందుకు భూసేకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాలలోని ఎగువ మానేరు అతిథిగృహంలో సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై సోమవారం అన్నిశాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మల్కపేట రిజర్వాయర్ పనులు పూర్తిచేసి, జూలై నెలాఖరులోగా గోదావరి జలాలతో ఎగువ మానేరును నింపాలని సూచించారు. సిరిసిల్ల, ఎగువ మానేరు జలాశయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధిపరిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గోదావరి జలాలతో కనువిందు చేస్తున్న సిరిసిల్ల రామప్ప గుట్టలు, గంభీరావుపేట మండలం ఎగువ మానేరు జలాశయాలతోపాటు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాల ప్రాంతాలు పర్యాటక కేంద్రాలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. హైదరాబాద్ నుంచి గంటన్నరలో ఇక్కడికి చేరుకోవచ్చన్న మంత్రి.. జలాశయంలో బోటింగ్, జల క్రీడలు, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేయాలని సూచించారు. ఎగువ మానేరు అతిథిగృహాన్ని రూ.2 కోట్లతో ఆధునీకరించాలని చెప్పారు. నర్మాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, పర్యాటక అభివృద్ధి పనులకు త్వరలో శంకుస్థాపన చేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 9, 10, 11, 12వ పనుల పురోగతిపై ఇంజినీర్లతో సమీక్షించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టత అందరికీ తెలిసేలా విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీల్లో వాటర్ మ్యాపులను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ప్రదర్శించేలా చూడాలని ఆదేశించారు.

**17న ఆరు లక్షల మొక్కలు నాటాలి..**

ఈనెల 17న సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా జిల్లాలో ఆరు లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధంచేయాలని మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, పీహెచ్‌సీల ఆవరణలో అధికారులు ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. తెలంగాణకు హరితహారంపై విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ కృష్ణభాస్కర్, ప్రత్యేక అధికారి రాహుల్‌శర్మ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, డీఆర్వో ఖీమ్యానాయక్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**పట్టుచీరపై మిషన్ భగీరథ చిత్రం**

జకార్డ్ మరమగ్గంపై నేత కార్మికుడు కుసుమ నర్సింహస్వామి మిషన్ భగీరథ చిత్రాన్ని రూపొందించిన పట్టుచీరను నర్మాలలో అధికారుల సమావేశంలో మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. నేత కార్మికుడు ఆ చీరను కేటీఆర్‌కు బహూకరించారు. నర్మాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఎడబోయిన రాజు మంత్రిని కోరగా అందుకు స్పందించిన కేటీఆర్.. వెంటనే రూ.50 వేల చెక్కును అందజేశారు. టీఎన్జీవో నూతన సంవత్సర క్యాలెండర్‌ను కేటీఆర్ ఆవిష్కరించారు.

## నిరుపేద ఇంట్లో స్పీకర్ పుట్టినరోజు వేడుక

ఆనందంలో సాయవ్వ కుటుంబం

**బాన్సువాడ, నమస్తేతెలంగాణ:** స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తన పుట్టిన రోజు వేడుకలను సోమవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ లోని గూడెంగల్లీకి చెందిన నిరుపేద కుటుంబ సభ్యుల మధ్య జరుపుకొన్నారు. స్పీకర్ పోచారం కలెక్టర్ శరత్‌తో కలిసి గూడెం గల్లీలోని డబుల్ బెడ్రూం లబ్ధిదారు మంద సాయవ్వ ఇంటికి వెళ్లారు. అక్కడే కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తి తమ ఇంటికి వచ్చి వేడుకలు జరుపుకోవడంపై ఆ కుటుంబ సభ్యులు తబ్బిబ్బయ్యారు. ఈ సందర్భంగా వారు స్పీకర్‌తోపాటు కలెక్టర్‌కు శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా సాయమ్మ మాట్లాడుతూ గరీబోళ్ల గురించి ఎవరూ పట్టించుకోలేదని, శీనన్న మాత్రం అందరి బాధలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని కొనియాడారు. సర్కార్ డబుల్ బెడ్రూం ఇల్లు ఇచ్చుడుతోటే బిడ్డలు, అల్లుళ్లు అందరూ వచ్చి ఇంట్లో ఉండగలుగుతున్నారని తెలిపింది.



సాయమ్మ ఇంట్లో కలెక్టర్ శరత్ కుమార్‌తో కలిసి అల్పాహారం తింటున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

# గులాబీ గుబాళింపు

- సహకార ఎన్నికల్లో 136 సొసైటీలు, 3,224 డైరెక్టర్ పదవులు ఏకగ్రీవం
- టీఆర్‌ఎస్ మద్దతుదారుల హవా
- 13,925 మంది నామినేషన్ల ఉపసంహరణ
- 8,444 డైరెక్టర్ పదవులకు బరిలో 13,642 మంది



కరీంనగర్, దుర్శేడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లతో కలిసి విజయ సంకేతం చూపుతున్న మంత్రి గంగుల

**హైదరాబాద్,నమస్తేతెలంగాణ:** ఎన్నికలు ఏవైనా గెలుపు టీఆర్‌ఎస్ పార్టీదేననే పరంపర కొనసాగుతున్నది. ఈ విషయం అసెంబ్లీ, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో ఇప్పటికే రుజువు కాగా.. ఈనెల 15న జరగనున్న సహకార సంఘాల ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ మద్దతుదారుల హవా కొనసాగనున్నది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ తరువాత ఏకగ్రీవమైన నియోజకవర్గాల్లో మెజార్టీ స్థానాలను టీఆర్‌ఎస్ మద్దతుదారులు దక్కించుకోవడం గమనార్హం. రాష్ట్రంలోని 904 సహకార సంఘాల్లో 136 సొసైటీలు, 3,224 మంది డైరెక్టర్లు ఏకగ్రీమ య్యారు. తుది పోరులో 768 సొసైటీల పరిధి లోని 8,444 డైరెక్టర్ పదవులకు 13,642 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. సోమ వారం నామినేషన్ల ఉపసంహరణ సందర్భం గా 13,925మంది అభ్యర్థులు తమ నామి నేషన్లను ఉపసంహరించుకున్నారు. ఏకగ్రీవం కాగా.. మిగిలిన స్థానాలకు బరిలో ఉన్న అభ్యర్థులకు సహకార శాఖ ఎన్నికల అధికా రులు మొత్తం 14 గుర్తులను ఎంపిక చేసి అభ్యర్థులకు కేటాయించారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో బరిలో ఉన్న అభ్యర్థు లు మంగళవారం నుంచి ప్రచారాన్ని ప్రారం భించనున్నారు. ఈనెల 15న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగనున్నది. అదే రోజు సాయంత్రం లెక్కించి, ఫలితాలు ప్రకటించ నున్నారు.

| జిల్లా | పీఏసీఎస్‌లు | డైరెక్టర్ల స్థానాలు | నామినేషన్ల ఉపసంహరణ | ఏకగ్రీవ డైరెక్టర్లు | బరిలో అభ్యర్థులు | ఏకగ్రీవమైన సొసైటీలు | జిల్లా | పీఏసీఎస్‌లు | డైరెక్టర్ల స్థానాలు | నామినేషన్ల ఉపసంహరణ | ఏకగ్రీవ డైరెక్టర్లు | బరిలో అభ్యర్థులు | ఏకగ్రీవమైన సొసైటీలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 28 | 354 | 132 | 86 | 284 | 11 | సంగారెడ్డి | 53 | 680 | -- | 262 | -- | -- |
| మంచిర్యాల | 20 | 257 | 236 | 61 | 196 | 06 | సిద్దిపేట | 21 | 273 | 399 | 127 | 327 | 01 |
| నిర్మల్ | 17 | 221 | 258 | 86 | 278 | 01 | నల్లగొండ | 42 | 545 | 981 | 138 | 846 | 03 |
| ఆసిఫాబాద్ | 12 | 155 | 102 | 74 | 91 | 03 | సూర్యాపేట | 46 | 595 | 1120 | 175 | 632 | 10 |
| జగిత్యాల | 51 | 651 | 545 | 218 | 849 | 05 | యాదాద్రి | 21 | 273 | 476 | 79 | 495 | 00 |
| కరీంనగర్ | 30 | 385 | 614 | 156 | 589 | 01 | కామారెడ్డి | 55 | 713 | 601 | 207 | 834 | 08 |
| పెద్దపల్లి | 20 | 260 | 451 | 69 | 375 | 03 | నిజామాబాద్ | 89 | 1147 | 1015 | 401 | 996 | 23 |
| రాజన్న సిరిసిల్ల | 24 | 309 | 294 | 127 | 365 | 03 | మేడ్చల్ | 09 | 116 | 102 | 44 | 163 | 00 |
| ఖమ్మం | 76 | 977 | 1112 | 177 | 784 | 32 | రంగారెడ్డి | 37 | 475 | 501 | 86 | 835 | 01 |
| కొత్తగూడెం | 21 | 260 | 411 | 81 | 350 | 02 | వికారాబాద్ | 22 | 286 | 319 | 62 | 404 | 03 |
| గద్వాల | 11 | 143 | 172 | 39 | 261 | 00 | వరంగల్ అర్బన్ | 12 | 156 | 262 | 49 | 209 | 02 |
| మహబూబ్‌నగర్ | 17 | 221 | 365 | 80 | 261 | 02 | జనగామ | 14 | 182 | 276 | 40 | 329 | 02 |
| నాగర్‌కర్నూల్ | 23 | 299 | 561 | 53 | 541 | 01 | భూపాలపల్లి | 10 | 130 | 359 | 60 | 146 | 02 |
| వనపర్తి | 15 | 195 | 279 | 31 | 341 | 01 | మహబూబాబాద్ | 18 | 234 | 459 | 75 | 301 | 03 |
| నారాయణపేట | 10 | 130 | 234 | 30 | 191 | 01 | వరంగల్ రూరల్ | 31 | 402 | 645 | 103 | 629 | 02 |
| మెదక్ | 37 | 481 | 415 | 169 | 539 | 04 | ములుగు | 12 | 156 | 229 | 41 | 203 | 02 |

## 'కరోనా'పై అపోహలొద్దు

రాష్ట్రంలో వైరస్ జాడ లేదు

వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల

**హుజూరాబాద్, నమస్తేతెలంగాణ:** కరోనా వైరస్‌పై అపోహలు వద్దని, రాష్ట్రంలో అలాంటి వైరస్ జాడ లేదని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మవద్దని కోరారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సోమవారం మీడియాతో మంత్రి మాట్లాడారు. ఒకవేళ వచ్చినా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. గాంధీ దవాఖానలో ప్రత్యేక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆర్మీ సంయుక్తంగా హైదరాబాద్‌లో జనావాసాలకు దూరంగా యుద్ధప్రతిపాదికన మూడు వందల పడకల ప్రత్యేక దవాఖానను నిర్మిస్తున్నట్టు చెప్పారు.



హుజూరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు



నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి





## వైభవంగా రథోత్సవం

మహబూబ్‌నగర్ సమీపంలోని మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు నిర్వహించిన రథోత్సవం కన్నుల పండువగా సాగింది. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని కొండపై నుంచి దిగువకు పల్లకీలో తీసుకొచ్చారు. అనంతరం స్వామివారిని రథంలో ప్రతిష్ఠించి వేడుకను కొనసాగించారు. ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్వామివారికి ప్రత్యేక పూజలుచేసి, భక్తులతో కలిసి రథాన్ని లాగారు. లక్షన్నరమంది భక్తులు హాజరైనట్టు అంచనా. - మహబూబ్‌నగర్ రూరల్



ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వార్డు నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం రాత్రి వనపర్తి జిల్లా కేంద్రంలోని ఏడో వార్డు పీర్లగుట్ట ప్రాంతంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులతో కలిసి పర్యటించారు. వార్డులో ఇంటింటికీ వెళ్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో లీకేజీ అవుతున్న వాటర్‌లైన్‌ను పరిశీలించి రెండ్రోజుల్లో పనులను పూర్తి చేయాలన్నారు. ఆ వార్డులో రాత్రి బస చేశారు. - వనపర్తి, నమస్తేతెలంగాణ

## సీఎంపై నమ్మకంతోనే టీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం

రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**నల్లగొండ, నమస్తేతెలంగాణ:** రాష్ట్రంలో ఇటీవల 130 మున్సిపల్, కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగగా 122 స్థానాలను టీఆర్‌ఎస్ కైవసం చేసుకున్నదని, అది ప్రజలకు సీఎం కేసీఆర్‌పై ఉన్న నమ్మకంతోనే సాధ్యమైందని రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక సందర్భంగా సోమవారం ఆయన స్థానిక మున్సిపాలిటీలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ఏ పార్టీకి రానటువంటి గౌరవాన్ని రాష్ట్ర ప్రజలు టీఆర్‌ఎస్‌కు ఓట్ల ద్వారా ఇచ్చారన్నారు. కాంగ్రెస్-బీజేపీలు అనైతిక పొత్తుపెట్టుకొన్నా ప్రజలు మాత్రం టీఆర్‌ఎస్‌కే బ్రహ్మరథం పట్టారని చెప్పారు. ఆయన వెంట ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, కౌన్సిలర్లు ఉన్నారు.



పసుపు బోర్డును నెలకొల్పి కనీస మద్దతు ధరను ప్రకటించి రైతులను ఆదుకోవాలనే డిమాండ్‌తో జగిత్యాల జిల్లా రైతుల ఐక్య వేదిక నాయకులు సోమవారం మెట్‌పల్లి సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. - మెట్‌పల్లి, నమస్తే తెలంగాణ

## ఇంటర్ విద్యార్థిని దారుణహత్య



రాధిక (ఫైల్)

**కరీంనగర్ క్రైం:** కరీంనగర్‌లో ఇంటర్ విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగుడు ఈ ఘటనకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన కొమురయ్య హమాలీగా, ఆయన భార్య కూలిగా పనిచేస్తారు. వారికి కూతురు, కొడుకు ఉన్నారు. కూతురు రాధిక స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. సోమవారం సాయంత్రం పనులకు వెళ్లి వచ్చిన కుటుంబసభ్యులకు రాధిక ఇంట్లో రక్తపు మడుగులో కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరుకున్న కరీంనగర్ టూటౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రాధిక కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. వారి ఇంట్లో అద్దెకు ఉండే ఓ కుటుంబం రోజు తాగి వచ్చి ఇంట్లో గొడవ చేస్తుండటంతో మూడు రోజుల క్రితమే వారిని ఖాళీ చేయించారు. ఆ గొడవల కారణంగానే సదరు కుటుంబసభ్యులు తన కూతురిని బలి తీసుకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కొమురయ్య పేర్కొన్నారు. ఘటనాస్థలంలో హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

## అల్బెండజోల్ మాత్ర వికటించి బాలిక మృతి?



సహస్ర (ఫైల్)

**ధర్మపురి,నమస్తే తెలంగాణ:** జగిత్యాల జిల్లా ధర్మపురిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న సహస్ర(8) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. సోమవారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లి భోజనం చేసి స్కూల్‌కు వచ్చాక వాంతులు చేసుకుంటూ కుప్పకూలింది. వైద్యం కోసం సహస్ర దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. నులిపురుగుల నివారణకు వేసిన అల్బెండజోల్ మాత్ర వికటించడం వల్లే తమ బిడ్డ చనిపోయిందని బాలిక తల్లిదండ్రులు ఆరోపించారు.

## హాజీపూర్ దోషిని ఉరితీయాలి

- అప్పుడే మా బిడ్డల ఆత్మకు శాంతి
- ఏ న్యాయవాదీ అతడి కేసును వాదించొద్దు
- హాజీపూర్ బాధిత బాలికల తల్లిదండ్రుల విజ్ఞప్తి

**ఖైరతాబాద్:** 'ఉన్నత న్యాయస్థానాలకు వెళ్లి నిర్భయ దోషుల్లా ఉరిశిక్షను కాలయాపన చేసేందుకు యత్నిస్తున్న సైకో శ్రీనివాస్‌రెడ్డికి ఏ న్యాయవాదీ సహకరించొద్దు. అతడి కేసును ఎవరూ వాదించొద్దు. వాడిని ఉరితీస్తేనే మా బిడ్డల ఆత్మకు శాంతి కలుగుతుంది' అని హాజీపూర్ ఘటనల బాధిత తల్లిదండ్రులు వాపోయారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మృతిచెందిన బాలికల తల్లిదండ్రులు భాగ్యమ్మ, నాగలక్ష్మి, నర్సింహ, మల్లేశం మాట్లాడుతూ.. అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ బిడ్డలను శ్రీనివాస్‌రెడ్డి పొట్టన పెట్టుకున్నాడని వాపోయారు. పైకోర్టుకు వెళ్లి శిక్షను తగ్గించుకొనే ప్రయత్నం చేస్తున్నాడని, ఆ మృగాడికి వెంటనే శిక్ష పడే విధంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. కాగా, యాదాద్రి భువనగిరి జిల్లా హాజీపూర్‌గ్రామానికి చెందిన ముగ్గురు బాలికలపై లైంగికదాడి, హత్య కేసులో దోషి శ్రీనివాస్‌రెడ్డికి కోర్టు ఉరి శిక్ష విధించిన విషయం తెలిసిందే.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఓ మావోయిస్ట్ హతం.. ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లు మృతి

డిప్యూటీ కమాండెంట్‌సహా ఆరుగురు కానిస్టేబుళ్లకు గాయాలు

**కొత్తగూడెం క్రైం/చర్ల రూరల్ /రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడ్ పోలీస్ స్టేషన్ ఇరాపల్లి పరిధిలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు, ఇద్దరు జవాన్లు మరణించారు. సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్‌తోపాటు ఆరుగురు జవాన్లు గాయపడ్డారని ఐజీ సుందర్‌రాజ్ పీ తెలిపారు. సుక్మ, బీజాపూర్ జిల్లాల్లోని మావోయిస్టుల కీలక ప్రాంతాల్లో సుమారు 800 మంది జవాన్లు గాలింపు చేపట్టారు. జవాన్లను ఇరాపల్లికి సమీపాన చెరపల్లి అడవిలోని మావోయిస్టులు గమనించి కాల్పులు జరిపారు. పోలీసులు ఆత్మరక్షణార్థం ఎదురు కాల్పులు జరిపారు. ఇరుపక్షాల మధ్య 90 నిమిషాల సేపు ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో కోబ్రా బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ సహా ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. కాసేపటికి జవాన్ల దాటికి తాళలేక మావోయిస్టులు దట్టమైన అడవిలోకి పారిపోయారు. కాల్పులు నిలిచిపోయాక ఆ ప్రాంతాన్ని సీఆర్పీఎఫ్ జవాన్లు తమ ఆధీనంలోకి తీసుకుని గాలించి, ఓ మావోయిస్టు మృతదేహంతోపాటు భారీగా మందుగుండు సామగ్రిని స్వాధీనపర్చుకున్నారు. గాయపడిన జవాన్లను చికిత్స కోసం దవాఖానకు తరలించారు. కాగా సుక్మ జిల్లాలో సీఆర్పీఎఫ్ 150వ బెటాలియన్ జవాన్లు గాలింపు జరుపగా మినప ఇలాకలోని చింతల్‌నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టులు రోడ్డు వద్ద పాతిన ఐదు కిలోల ఐఈడీ బాంబును వెలికి తీసి నిర్వీర్యం చేసినట్టు సుక్మ ఎస్పీ శలభ్ సిన్హా తెలిపారు.

## గ్యాంగ్‌రేప్ నిందితులు తొమ్మిది మంది

- ముగ్గురు మేజర్లు.. ఆరుగురు మైనర్లు
- ఎనిమిది మంది అరెస్టు.. పరారీలో ఒకడు
- కేసు వివరాలను వెల్లడించిన మహబూబాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

**మహబూబాబాద్ రూరల్:** మహబూబాబాద్ జిల్లా అమనగల్ శివారు బలరాంతండా మామిడితోటలో ఈ నెల ఏడున అర్ధరాత్రి ఓ యువతిపై తొమ్మిది మంది సామూహిక లైంగికదాడికి పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలింది. నిందితుల్లో ముగ్గురు మేజర్లు కాగా ఆరుగురు మైనర్లు ఉన్నారు. వీరిలో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. సోమవారం మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను జిల్లా ఎస్పీ కోటిరెడ్డి మీడియాకు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 24 ఏండ్ల బాధితురాలు అక్షర (మారు పేరు) ఇల్లెందుకు రైలులో బయలుదేరింది. మహబూబాబాద్‌కు చేరిన యువతి వద్ద చార్జీలకు డబ్బులేక తనకు పరిచయస్తుడైన మహబూబాబాద్ మండలం అమనగల్‌కు చెందిన (16) మైనర్‌కు ఫోన్‌చేసి ఆర్థికసాయం అడిగింది. అతడు యువతిని అమనగల్‌కు రమ్మనిచెప్పగా అక్కడకు వెళ్లింది. అతడు పథకం ప్రకారం.. తన స్నేహితులైన బలరాంతండాకు చెందిన ఇద్దరు, మహబూబాబాద్ పరిధి సిగ్నల్‌కాలనీకి చెందిన ఇద్దరు, తొర్రూరుకు చెందిన ఒకరు (వీరంతా మైనర్లు), మహబూబాబాద్ పట్టణ పరిధి భవానీనగర్ తండాకు చెందిన గుగులోత్ హుస్సేన్ (20), బలరాంతండాకు చెందిన ఇస్లావత్ రఘు (25), ఇస్లావత్ కిషన్ (21)ను రప్పించాడు. ఈలోగా అక్కడకు చేరుకున్న యువతికి మాయమాటలు చెప్పి ఆమనగల్ నుంచి మహబూబాబాద్‌కు వెళ్లే రోడ్డుమార్గంలో మామిడి తోటలోకి లాక్కెళ్లి రాత్రి 9.30 గంటల నుంచి 11 గంటల వరకు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు.

**యువతిని రక్షించిన సర్పంచ్**

అదే సమయంలో అమనగల్ నుంచి మహబూబాబాద్‌కు వెళ్తున్న బలరాంతండా గ్రామ సర్పంచ్ హరిలాల్ అరుపులు విని ఘటనాస్థలానికి చేరుకున్నాడు. బైక్‌లైట్ సాయంతో పరిశీలించగా గ్యాంగ్‌రేప్ విషయం తెలిసింది. గమనించిన నిందితులంతా పరారయ్యారు. జరిగిన విషయాన్ని యువతి ద్వారా తెలుసుకున్న సర్పంచ్ వెంటనే ఆమె తండ్రికి ఫోన్‌లో సమాచారమిచ్చారు. అమనగల్‌కు చేరుకున్న తండ్రి కూతురుతో కలిసి మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సామూహిక లైంగికదాడికి పాల్పడిన తొమ్మిది మంది నిందితుల్లో ఎనిమిది మందిని అరెస్టు చేశామని, ఇస్లావత్ కిషన్ పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, రెండు మోటర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు. నిందితులను 48 గంటల్లోనే అరెస్టుచేసిన రూరల్ సీఐ వెంకటరత్నంతోపాటు పోలీస్ బృందాన్ని ఎస్పీ అభినందించారు.

## ఇంట్లోకి చొరబడి.. గొంతుకోసి

భర్తను హత్యచేసిన దుండగులు

అడ్డుకోబోయిన భార్యకు గాయాలు



కారం రామకృష్ణ (ఫైల్)

**దుమ్ముగూడెం:** ఓ ఇంట్లోకి చొరబడిన దుండగులు.. నిద్రిస్తున్న వ్యక్తి గొంతుకోసి హత్య చేశారు. అడ్డుకోబోయిన అతడి భార్యపైనా దాడిచేశారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం లచ్చిగూడెంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. మృతుడి భార్య తులసి, పోలీసుల వివరాల ప్రకారం.. లచ్చిగూడెంకు చెందిన కారం రామకృష్ణ(35) దుమ్ముగూడెం విద్యాశాఖలో సీఆర్పీ(క్లస్టర్ రిసోర్స్ పర్సన్)గా పనిచేస్తూ తనకున్న కొద్దిపాటి భూమిని సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో రామకృష్ణ, తులసి దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు చొరబడ్డారు. ఇద్దరు రామకృష్ణ కాళ్లు, చేతులను పట్టుకోగా, మరో వ్యక్తి గొంతు కోశాడు. ఈ స మయంలో తులసీకి మెలకువ రావడంతో భర్త ను కాపాడే ప్రయత్నంలో చేతికి గాయమైంది. తులసి అరుపులకు చుట్టుపక్కల వారు వచ్చే సరికి దుండగులు పరారయ్యారు. రామకృష్ణను చికిత్స కోసం భద్రాచలం తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయారు.

**భూవివాదమే కారణమా..?**

రామకృష్ణ హత్యకు భూవివాదమే కారణమని బాధిత కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు. రెండేండ్లుగా అదే గ్రామానికి చెందిన సోందే ముద్దరాజు కుటుంబంతో వీరికి భూవివాదం కొనసాగుతున్నది. 8 నెలల క్రితం దుమ్ముగూడెం తాసిల్దార్ సదరు భూమి ముద్దరాజుకు చెందినదని చెప్పడంతో రామకృష్ణ కుటుంబ సభ్యులు అప్పటినుంచి ఆ భూమి జోలికి వెళ్లడం లేదు. కానీ ముద్దరాజు, అతడి కుమారుడు రవి మాత్రం.. ఎక్కడ కనిపించినా 'భూమి కావాలా.. మీ అంతు చూస్తాం.. ఎప్పటికైనా మిమ్ములను చంపుతాం' అని రామకృష్ణను బెదిరించేవాడని అతడి భార్య తులసి తెలిపింది.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 40,980 | 12,031 |
| ↘162 | ↘67 |

ముడి చమురు (బ్రెంట్) ↘ 53.45 డాలర్లు

## కోలుకున్న రూపాయి

**కరోనా** వైరస్ దెబ్బకు స్టాక్ మార్కెట్లు కుదేలవగా..ఇదే సమయంలో దేశీయ కరెన్సీ విలువ మరింత బలపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పది పైసలు పెరిగి 71.30 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, అమెరికా కరెన్సీ బలహీనపడటంతో రూపాయి బలోపేతం అయింది. 71.36 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు ఒక దశలో 71.28 గరిష్ఠ స్థాయిని తాకింది.

# 'ఆటో'కు కరోనా భయాలు

### చైనా విడిభాగాల దిగుమతులపై ఆందోళన

### వైరస్ నేపథ్యంలో సరఫరా ప్రభావితం కావచ్చంటున్న సియామ్

**గ్రేటర్ నోయిడా, ఫిబ్రవరి 10:**

కరోనా వైరస్‌పై దేశీయ ఆటో పరిశ్రమ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. రోజురోజుకూ విస్తరిస్తున్న ఈ ప్రాణాంతక మహమ్మారి.. చైనా నుంచి భారత్‌కు వచ్చే ఆటో విడిభాగాల దిగుమతులను ప్రభావితం చేస్తుందేమోనన్న భయాన్ని భారతీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) వ్యక్తం చేస్తున్నది. కరోనా తీవ్రతకు చైనా వణికిపోతున్న విషయం తెలిసిందే. ఈ వైరస్ ధాటికి వందలాది మంది చనిపోగా, వేలాది మంది మృత్యువుతో పోరాడుతున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు చైనా.. కరోనా అదుపుపైనే దృష్టిపెట్టగా, ఉత్పత్తి ఒక్కసారిగా పడిపోయింది. కరోనా వ్యాప్తిని అడ్డుకోవడంలో భాగంగా చైనాలోని పారిశ్రామిక సంస్థలు తయారీ కేంద్రాలను మూసేస్తున్నాయి. ఐటీ తదితర సంస్థలు ఉద్యోగులచే ఇంటి నుంచే పని చేయిస్తుండగా, ఉత్పాదక సంస్థలు మాత్రం సెలవులను ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే అక్కడి ఆటో సంస్థలు ప్లాంట్లను మూసివేసిన సంగతీ విదితమే. ఆటో విడిభాగాల తయారీ సంస్థల సంగతీ ఇంతే. దీంతో తమ సభ్యుల నుంచి ప్రస్తుత స్థితిగతుల వివరాలను సేకరిస్తున్నట్లు



సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ సోమవారం ఇక్కడ విలేకరులకు తెలిపారు.

#### బీఎస్-6కు దెబ్బ

బీఎస్-4 నుంచి బీఎస్-6కు మారుతున్న భారతీయ వాహన రంగాన్ని కరోనా వైరస్ దెబ్బతీస్తున్నది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి బీఎస్-6 వాహన అమ్మకాలు మాత్రమే దేశీయ మార్కెట్‌లో జరుగాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు నిర్ణయం తీసుకున్నది తెలిసిందే. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడంలో భాగంగా బీఎస్-4 నుంచి బీఎస్-6కు ఆటో పరిశ్రమ పరివర్తనం చెందుతున్నది. ఇందుకు కావాల్సిన విడిభాగాలు చైనా నుంచే పెద్ద మొత్తంలో భారత్‌కు వస్తున్నాయి. దీంతో వైరస్ కారణంగా మూతబడే అక్కడి పరిశ్రమ.. ఇక్కడి విడిభాగాల అవసరాల కొరతకు దారితీస్తుందన్న అనుమానాలు ఇప్పుడు ఆటో ఇండస్ట్రీని వెంటాడుతున్నాయి.

#### గడువు పొడిగిస్తారా?..

చైనాలో కరోనా వైరస్ వ్యాప్తి, అక్కడి ఉత్పాదక రంగంపై దాని ప్రభావం మధ్య ఏప్రిల్ 1 నుంచి బీఎస్-6 వాహన అమ్మకాల నిబంధన గడువును పొడిగిస్తారా? అన్నదానికి ఇప్పుడే చెప్పలేమని సియామ్ అంటున్నది. మరో రెండు, మూడు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని మీనన్ తెలిపారు. ప్రస్తుతం దీనిపై ఏమీ చెప్పలేమని, వైరస్ ప్రభావం చైనా విడిభాగాల సరఫరాపై ఏ స్థాయిలో ఉంటుందో అంచనా వేయలేమని మారుతీ సుజుకీ ఎండీ, సీఈవో కెనిచి అయుకవా పీటీఐతో అన్నారు.

#### మళ్లీ తగ్గిన అమ్మకాలు

దేశీయ మార్కెట్‌లో ప్యాసింజర్ వాహన విక్రయాలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. గత నెలలో 6.2 శాతం క్షీణించాయి. జీడీపీ మందగమనం, పెరిగిన ధరలు కొనుగోళ్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సియామ్ తెలిపిన తాజా వివరాల ప్రకారం జనవరిలో 2,62,714 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. గతేడాది జనవరిలో ఇవి 2,80,091 యూనిట్లుగా ఉన్నాయి. కార్ల విక్రయాలు 8.1 శాతం తగ్గి గతంతో పోల్చితే 1,79,324 యూనిట్ల నుంచి 1,64,793 యూనిట్లకు పడిపోయాయి. 'బీఎస్-4 నుంచి బీఎస్-6కు వాహనాలను ఆధునికీకరిస్తుండటంతో ధరలు పెరుగుతున్నాయి. ఇది కొనుగోళ్లను దెబ్బతీస్తున్నది' అని సియామ్ అధ్యక్షుడు రాజన్ వధేరా అన్నారు. ద్విచక్ర వాహన విక్రయాలూ జనవరిలో 16.06 శాతం క్షీణించాయన్నారు.

# జీఎమ్మార్ చేతికి గ్రీస్ ఎయిర్‌పోర్టు

### టెర్నాతో కలిసి 35 ఏండ్లపాటు నిర్వహణ

### ఐరోపా ప్రాజెక్టును చేజిక్కించుకున్న తొలి భారతీయ ఆపరేటర్‌గా రికార్డు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:**

జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ మరో ఘనత సాధించింది. ఐరోపా దేశాల్లోని విమానాశ్రయ ప్రాజెక్టు అభివృద్ధి అవకాశాన్ని దక్కించుకున్న తొలి భారతీయ ఎయిర్‌పోర్టు ఆపరేటర్‌గా నిలిచింది. గ్రీస్‌లోని క్రెటే వద్దగల హెరాక్లియాన్‌లో ఏర్పాటయ్యే కొత్త ఎయిర్‌పోర్టు నిర్మాణం, రూపకల్పన, ఫైనాన్సింగ్, కార్యకలాపాలు, నిర్వహణకు సంబంధించి కన్సేషన్ కమెన్స్‌మెంట్ డేట్ (సీసీడీ)ను జీఎమ్మార్ అందుకున్నది. ఈ మేరకు సోమవారం జీఎమ్మార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అనుబంధ సంస్థగా కొనసాగుతున్న జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ ప్రకటించింది. ప్రాజెక్టు ఆరంభ సూచికగా గ్రీస్ ప్రధాన మంత్రి మిట్సోటకిస్ పునాదిరాయి వేశారు. జీఎమ్మార్ తమ భాగస్వామి టెర్నాతో కలిసి ఈ ప్రాజెక్టు నిర్వహణను 35 ఏండ్లపాటు చూసుకోనున్నది. ఈ ఎయిర్‌పోర్టు డిజైన్, నిర్మాణం, ఫైనాన్సింగ్, ఆపరేషన్, నిర్వహణల కోసం గతేడాది ఫిబ్రవరిలో కన్సేషన్ అగ్రిమెంట్‌పై జీఎమ్మార్, జెక్ టెర్నా సంతకాలు చేసిన విషయం తెలిసిందే. గ్రీస్ ప్రభుత్వం.. ఈ ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున నిధులను సమకూర్చనుండటంతో ఇది రుణరహిత ప్రాజెక్టుగా నిలువనున్నది. ఐదేండ్లపాటు తొలి దశ నిర్మాణం జరుగనుండగా, జీఎమ్మార్, టెర్నాలు ఈ ప్రాజెక్టుపై 500 మిలియన్ యూరోలకుపైగా



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెట్టుబడులు పెట్టనున్నాయి. దేశీయంగా న్యూఢిల్లీ, హైదరాబాద్ ఎయిర్‌పోర్టులను నిర్వహిస్తున్న జీఎమ్మార్.. ఫిలిప్పీన్స్‌లో మరో ఎయిర్‌పోర్టును ఇంకో సంస్థతో కలిసి నడిపిస్తున్నది. గోవాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును అభివృద్ధిపరుస్తున్నది.

# 'మైహోమ్' భలే గిరాకీ

### లగ్జరీ ఫ్లాట్ల అమ్మకాల్లో సరికొత్త రికార్డు

### కోకాపేట్‌లో 'మై హోమ్ తర్క్ష్య' ప్రాజెక్టు ఆరంభం

### మొదటి రోజే 325 యూనిట్ల అమ్మకం

### భూమిపూజ చేసిన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి



**సోమవారం కోకాపేటలో భూమి పూజ చేసిన అనంతరం 'మై హోమ్ తర్క్ష్య' ప్రాజెక్టు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చిన జీయర్ స్వామి, మై హోమ్స్ అధినేత జూపల్లి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ నిర్మాణ రంగంలో పేరెన్నికగల నిర్మాణ సంస్థ మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్.. హైఎండ్ లగ్జరీ ఫ్లాట్ల అమ్మకాల్లో సరికొత్త రికార్డును సృష్టించింది. మొదటి రోజే రికార్డు స్థాయిలో దాదాపు 325 అత్యాధునిక ఫ్లాట్లను విక్రయించి తమ ప్రత్యేకతను మరోసారి చాటుకున్నది. సోమవారం ఉదయం కోకాపేట్‌లో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి 'మై హోమ్ తర్క్ష్య' ప్రాజెక్టుకు భూమి పూజ చేసిన అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పశ్చిమ హైదరాబాద్‌లో విశేషంగా అభివృద్ధి చెందుతున్న కోకాపేట్‌లో సుమారు 5.82 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో.. 'మై హోమ్ తర్క్ష్య'లో వచ్చే 660 ఫ్లాట్లన్నీ ఆధునిక లగ్జరీ గృహాలే కావడం గమనార్హం. ఇక నిర్మాణ స్థలం కేవలం 22 శాతమే. మిగతా 78 శాతాన్ని ఓపెన్ స్పేస్‌గా కేటాయించారు. జీ+ 32 అంతస్తుల ఎత్తులో కడుతున్న నాలుగు బ్లాకుల్లో వచ్చేవన్నీ ట్రిపుల్ బెడ్‌రూం ఫ్లాట్లే. కేవలం రెండు సైజుల్లో, 1,957, 2,235 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫ్లాట్లకు రూపకల్పన చేశారు. మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్ కొత్తగా ప్రాజెక్టును ప్రారంభిస్తే.. సకాలంలో కొనుగోలుదారులకు అందజేస్తుందనే ఖ్యాతినార్జించింది. వైవిధ్యమైన డిజైన్లు, ఆకట్టుకునే ఎలివేషన్లు, ఆధునిక సదుపాయాలు, మెరుగైన మౌలిక వసతులు వంటివి ఏర్పాటు చేయడంలో ముందు నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నది. నాణ్యతలో రాజీ పడకుండా హామీ ఇచ్చిన దానికంటే మెరుగైన రీతిలో నిర్మాణం చేపడుతుందనే నమ్మకం కొనుగోలుదారుల్లో నెలకొన్నది. అందుకే 'మై హోమ్' ఆరంభించే కొత్త ప్రాజెక్టుల్లో ఫ్లాట్లను తీసుకోవడానికి బయ్యర్లు పోటీ పడుతుంటారు. గతేడాది కొండాపూర్‌లో సంస్థ ఆరంభించిన 'మై హోమ్ మంగళ'లో కొనడాన్ని ఆలస్యం చేసినవారిలో కొందరు కొనుగోలుదారులు.. 'మై హోమ్ తర్క్ష్య'లో మొదటి రోజే తీసుకున్నారని సమాచారం.

#### ఆధునిక సదుపాయాలకు పెద్దపీట

మై హోమ్ సంస్థ ఆరంభించే ప్రతి ప్రాజెక్టులో ఆధునిక సదుపాయాలకు ప్రాధాన్యతనిస్తుందని తెలిసిందే. ఇప్పటికే పూర్తి చేసిన నవద్వీప, జ్యువెల్, విహంగా వంటి ప్రాజెక్టులను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. అదే క్రమంలో, తాజాగా 'మై హోమ్ తర్క్ష్య'లో ఆధునికతకు పెద్దపీట వేస్తున్నది. జీ+ 4 అంతస్తుల ఎత్తులో 34 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక క్లబ్‌హౌజ్‌ను అభివృద్ధి చేస్తున్నది. స్విమ్మింగ్ పూల్, స్పా, పుల్లీ ఎక్విప్డ్ ఏసీ జిమ్, సూపర్ మార్కెట్, ఏసీ గెస్ట్ రూములు, క్రెష్, బ్యాడ్మింటన్, టెన్నిస్ కోర్టులు, ఔట్‌డోర్ ప్లే కోర్టులు, చిల్డ్రన్ ప్లే ఏరియా, ఫుడ్ కోర్టులు వంటివి ఏర్పాటు చేస్తారు. ఈ కార్యక్రమంలో మై హోమ్ గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఐవోబీ నష్టం రూ.6,075 కోట్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** ప్రభుత్వ రంగ ఆర్థిక సేవల సంస్థయైన ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) ఆర్థిక ఫలితాలకు మొండి బకాయిల సెగ గట్టిగానే తగిలింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.6,075.49 కోట్ల నష్టం వచ్చినట్లు ప్రకటించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి అధికంగా నిధులు వెచ్చించడం వల్లనే లాభాల్లో భారీ గండిపడిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోనూ బ్యాంక్ రూ.346.02 కోట్ల నష్టాన్ని చవిచూసింది. సమీక్ష కాలంలో బ్యాంక్ ఆదాయం రూ.5,688.59 కోట్లనుంచి రూ.5,197.94 కోట్లకు పడిపోయినట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. గత త్రైమాసికంలో మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ ఏకంగా రూ.6,663.94 కోట్ల నిధులు వెచ్చించింది. 2018-19 ఏడాది ఇదే త్రైమాసికంలో కేటాయించిన రూ.2,075.28 కోట్లతో పోలిస్తే మూడు రెట్లు అధికమయ్యా యి. ఏడాది క్రితం 23.76 శాతంగా ఉన్న బ్యాంక్ స్థూ ల నిరర్థక ఆస్తుల విలువ గత త్రైమాసికం నాటికి 17.12 శాతానికి తగ్గినట్లు వెల్లడించిన బ్యాంక్..నికర ఎన్‌పీఏ కూడా 13.56 శాతం నుంచి 5.81 శాతానికి దిగొచ్చాయి. విలువ పరంగా చూస్తే గ్రాస్ ఎన్‌పీఏ రూ.35,786.57 కోట్ల నుంచి రూ.23,733.86 కోట్లకు తగ్గగా, నికర ఎన్‌పీఏ రూ.17,987.92 కోట్ల నుంచి రూ.7,087.09 కోట్లకు తగ్గాయి. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు ధర 1.95 శాతం పెరిగి రూ.9.92 వద్ద నిలిచింది.

# కుప్పకూలుతున్నది

- ప్రమాదంలో దేశ ఆర్థిక వ్యవస్థ
- మోదీ సర్కారు అసమర్థతే కారణం
- కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం ధ్వజం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి పీ చిదంబరం అన్నారు. అయినప్పటికీ అసమర్థుల కారణంగా ఆర్థిక వ్యవస్థ కోలుకోలేకపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశ ఆర్థిక పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయాయన్న ఆయన ఇప్పుడు దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, పడిపోతున్న వినియోగ సామర్థ్యం.. ఈ రెండే ప్రధాన సమస్యలన్నారు. సోమవారం బడ్జెట్‌పై రాజ్యసభలో చర్చ జరిగింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2020-21)గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ఈ నెల 1న బడ్జెట్ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కాగా, దేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణాత్మక సమస్యల్ని ఎదుర్కొంటున్నదని చిదంబరం ఈ సందర్భంగా అన్నారు. ప్రజల చేతికి మరింత నగదు అందాల్సిన అవసరం ఉందని, అప్పుడే కొనుగోళ్లు పెరిగి వినియోగ సామర్థ్యం బలపడుతుందని చెప్పారు. ఇదే సమయంలో పన్ను అధికారులను కట్టడి చేయాలని, పన్ను చెల్లింపుదారులపై వేధింపులు తగవని సూచించారు. ప్రధాని మోదీ పాలనలో నాలుగేండ్లు ప్రధాన ఆర్థిక సలహాదారుగా పనిచేసిన అర్వింద్ సుబ్రమణియన్.. దేశ ఆర్థిక వ్యవస్థ ఐసీయూలో ఉందని వ్యాఖ్యానించినట్లు గుర్తుచేశారు. కానీ పరిస్థితి ఐసీయూను దాటిపోయే ప్రమాదంలో పడిందని, పేషెంట్ (ఆర్థిక వ్యవస్థ)ను అసమర్థులైన డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచారని పరోక్షంగా మోదీని, ఆయన మంత్రులను దుయ్యబట్టారు. మోదీ సర్కారు తమ తప్పుల్ని తాము గుర్తించే పరిస్థితిలో లేదన్న చిదంబరం.. పాత పెద్ద నోట్ల రద్దు నిర్ణయం, అసంపూర్ణ వస్తు,



సేవల పన్ను (జీఎస్టీ) విధానం అమలే ఆర్థిక వ్యవస్థను కుదేలు చేశాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 5 శాతానికి పతనమైన జీడీపీ.. 11 ఏండ్ల కనిష్ఠాన్ని తాకుతూ రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో 4.5 శాతానికి క్షీణించిన విషయం తెలిసిందే.

## బ్యాంకుల మొండి బకాయిలు తగ్గాయి

### లోక్‌సభలో టీఆర్‌ఎస్ ఎంపీల ప్రశ్నకు నిర్మలా సీతారామన్ సమాధానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్ల జాతీయ బ్యాంకులు, కమర్షియల్ బ్యాంకుల పరిస్థితి చాలా మెరుగైందని ఆమె వెల్లడించారు. దేశంలో బ్యాంకుల పరిస్థితి ఏ విధంగా ఉంది...మొండి బకాయలు...నిరర్థక ఆస్తుల పరిస్థితి ఏమిటి...ఆర్‌బీఐ నివేదికలో బ్యాంకుల ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తేలిందా అని టీఆర్‌ఎస్ ఎంపీలు పసునూరి దయాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి వేసిన



ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ఆర్‌బీఐ సమర్పించిన నివేదికలో బ్యాంకుల ఫైనాన్షియల్ స్టెబిలిటీ కమర్షియల్ బ్యాంకుల ఆర్థిక పరిస్థితి 14.3 నుంచి 15.1శాతానికి పెరిగిందని, అదే సమయంలో ప్రభుత్వ బ్యాంకుల పరిస్థితి 60.5 నుంచి 61.5శాతానికి పెరిగిందని వివరించారు. పీఎస్బీల మొండి బకాయిలు రూ. 8.96 లక్షల కోట్ల నుంచి రూ.7.27 కోట్ల వరకు తగ్గిందని విశ్లేషించారు.

# గెయిల్ లాభాల్లో క్షీణత

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** ప్రభుత్వరంగ గ్యాస్ ఉత్పత్తి సంస్థ గెయిల్ ఇండియా నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సహజ వాయువు, వంటగ్యాస్, హైడ్రోకార్బన్లపై మార్జిన్లు తగ్గుముఖం పట్టడంతో గత త్రైమాసికానికిగాను లాభాల్లో 25 శాతం క్షీణత నమోదైంది. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.1,250.65 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.2.77 నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.1,681.23 కోట్లు లేదా ప్రతి షేరుకు రూ.3.73 ఆర్జించిన దాంతో పోలిస్తే 25.6 శాతం పడిపోయింది. సహజ వాయువును విక్రయించడం ద్వారా సమకూర ఆదాయంలో 9.5 శాతం తగ్గి రూ.14,662.67 కోట్లకు పరిమితమవగా, ఈ విభాగం నుంచి నికర లాభం 31 శాతం తగ్గి రూ.466.52 కోట్లుగా ఉన్నది. అలాగే పెట్రోకెమికల్ బిజినెస్ రూ.8.51 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. మొత్తంగా కంపెనీ ఆదాయం రూ.19,788.98 కోట్ల నుంచి రూ.17,768.82 కోట్లకు పడిపోయింది. అలాగే, ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలానికి గాను రూ.54,021 కోట్ల విక్రయాలపై రూ.3,602 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. పెట్రోకెమికల్ ధరలు భారీగా పడిపోవడం వల్లనే మూడో త్రైమాసికంలో లాభాల్లో వృద్ధిని నమోదు చేసుకోలేకపోయామని గెయిల్ సీఎండీ అశుతోష్ కర్నాటక్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను పది రూపాయల ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు 64 శాతం లేదా రూ.6.40 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

| కంపెనీ | లాభం (కోట్లలో) | వృద్ధి (శాతంలో) | ఆదాయం (కోట్లలో) | వృద్ధి (శాతంలో) |
|---|---|---|---|---|
| గ్రాసిమ్ ఇండస్ట్రీస్ | 1,039.91 | -9.39 | 19,447.57 | -1.17 |
| ఎంఆర్‌ఎఫ్ లిమిటెడ్ | 241.32 | -17.02 | 4,149.76 | - |
| బజాజ్ హిందుస్థాన్ | (46.35) | - | 1,726.53 | 2.24 |
| ఐఎంఎఫ్‌ఏ | 4.84 | - 85.4 | 405.88 | 1.23 |
| పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ | (255.49) | - | 2,077.01 | -10 |
| బాంబే డైయింగ్ | 162.40 | (195.12) | 389.61 | -10 |
| బజాజ్ కన్జ్యూమర్ | 48.74 | -17.8 | 206.56 | -8.20 |
| ఇండియా బుల్స్ | 49.27 | -75.69 | 1,317.70 | 2.33 |
| నాల్కో | (33.90) | - | 2,136.57 | - 45 |
| పెట్రోనెట్ | 675 | 17 | - | - |

## యూబీఐ లాభం రూ.575 కోట్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** ఆర్థిక ఫలితాల్లో ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) దూకుడు ప్రదర్శించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.574.58 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.153.21 కోట్లతో పోలిస్తే నాలుగింతలు వృద్ధి నమోదైంది. 2018-19 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.9,572.58 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం..గత త్రైమాసికానికిగాను రూ.10,741.21 కోట్లకు పెరిగినట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. సమీక్షకాలంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 14.86 శాతానికి(రూ.49,923.58 కోట్లు) తగ్గాయి. అంతక్రితం ఏడాది ఇవి 15.66 శాతం లేదా రూ.49,713.34 కోట్లుగా ఉన్నాయి. అలాగే నికర ఎన్‌పీఏ 8.27 శాతం(రూ.24,141.64 కోట్లు) నుంచి 6.99 శాతానికి(రూ.21,510.28 కోట్లు) తగ్గాయి. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి నిధుల కేటాయింపు కూడా రూ.2,139.13 కోట్ల నుంచి రూ.1,569.90 కోట్లకు తగ్గాయి. సమీక్షకాలంలో రూ.10,985.23 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.554.36 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది బ్యాంక్. రూ.1,012.39 కోట్ల విలువైన 41 వేల ఎంఎస్‌ఎంఈ ఖాతాలను పునర్‌వ్యవస్థీకరించినట్లు పేర్కొంది. త్వరలో యూనియన్ బ్యాంక్‌లో ఆంధ్రాబ్యాంక్, కార్పొరేషన్ బ్యాంకులు విలీనంకాబోతున్నాయి. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో బ్యాంక్ షేరు ధర అమాంతం 4.19 శాతం ఎగిసి రూ.50.95 వద్ద ముగిసింది.

# బీవోబీ వడ్డీరేట్ల కోత

### 10 బేసిస్ పాయింట్లు దించిన బ్యాంక్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేట్ల(ఎంసీఎల్‌ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. తగ్గిన రేట్లు బుధవారం నుంచి అమలులోకి రానున్నట్లు బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో నూతనంగా గృహ, వాహన, ఇతర రుణాలు తీసుకోనున్న వారికి ఆర్థిక ప్రయోజనాలు కలుగనున్నాయి. ఏడాది కాలపరిమితి కలిగిన ఎంసీఎల్‌ఆర్ రేటు 8.25 శాతం నుంచి 8.15 శాతానికి తగ్గనున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ రిజర్వు బ్యాంక్ తీసుకున్న మూడు రోజుల్లోనే బీవోబీ వడ్డీరేట్లను తగ్గించడం విశేషం. అలాగే నెల కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్‌ఆర్ రేటు 5 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 7.55 శాతానికి తగ్గనుండగా, అలాగే ఒక్కరోజు, మూడు, ఆరు నెలల రుణాలపై వడ్డీ 10 బేసిస్ పాయింట్లు కోత విధించింది. గతవారంలో బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ ఎంసీఎల్‌ఆర్‌ను 5 బేసిస్ పాయింట్లు కోత విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇలా వడ్డీరేట్లు తగ్గించడం ఇది తొమ్మిదోసారి కావడం విశేషం.

# కుదేలైన స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 162, నిఫ్టీ 67 పాయింట్ల పతనం

**ముంబై, ఫిబ్రవరి 10:** స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు కుదేలయ్యాయి. కరోనా వైరస్ దెబ్బకు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర స్థాయిలో ప్రభావం చూపుతుండటం, మరోవైపు ఈ వైరస్ సోకి 800కి పైగా మరణించినట్లు వచ్చిన సంకేతాలు మదుపరుల్లో ఆందోళనను పెంచింది. ఫలితంగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో నష్టాల్లో ప్రారంభమైన దేశీయ మార్కెట్లు చివరి వరకు ఇదే దోరణిలో కొనసాగాయి. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 162.23 పాయింట్లు తగ్గి 41 వేల పాయింట్ల దిగువకు 40,979.62 వద్ద ముగిశాయి. సూచీలు 373 పాయింట్ల శ్రేణిలో కదలాడాయి. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 66.85 పాయింట్లు పతనం చెంది 12,031.50 వద్ద ముగిసింది. వాహన, మెటల్ రంగాలకు చెందిన సూచీలు భారీ నష్టాలపాలయ్యాయి. మార్కెట్లో అత్యధికంగా మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 7 శాతానికి పైగా పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. టాటా స్టీల్ 5.80 శాతం, ఓఎన్‌జీసీ 2.84 శాతం, సన్‌ఫార్మా 2.39 శాతం, హీరో మోటోకార్ప్ 2.34 శాతం, పవర్‌గ్రిడ్ 2 శాతం, ఎన్టీపీసీ 1.94 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.79 శాతం, అల్ట్రాటెక్ సిమెంట్ 1.39 శాతం, టైటాన్ 1.33 శాతం, ఐటీసీ 1.31 శాతం, టెక్ మహీంద్రా 1.30 శాతం, మారుతి 1.11 శాతం, ఎల్‌అండ్‌టీ 1.04 శాతం చొప్పున పతనం చెందాయి. వీటితో పాటు బజాజ్ ఆటో, యాక్సిస్ బ్యాంక్, నెస్లే ఇండియా, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు నష్టపోయాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్ 1.51 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. టీసీఎస్, కొటక్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, హెచ్‌యూఎల్‌ల షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి. రంగాలవారీగా చూస్తే మెటల్ 3.14 శాతం, వాహన 2.37 శాతం, పవర్ అండ్ కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.66 శాతం వరకు పతనం చెందాయి. గత నెలలో ప్యాసింజర్ వాహన విక్రయాలు ఆరు శాతానికి పైగా పడిపోయినట్లు దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) తాజాగా నివేదికను విడుదల చేయడంతో ఈ రంగ సూచీలు పతనం చెందాయి.



నమస్తే తెలంగాణ /nt.zindagi

# జిందగీ

మంగళవారం 11 ఫిబ్రవరి 2020 WWW. NTNEWS.COM

సాయి పల్లవి.. ఈమె పూర్తి పేరు సాయిపల్లవి సెంతామరై. డ్యాన్సర్, నటిగా మాత్రమే మనకు తెలుసు. కానీ ఆమె స్కూల్లో ఉన్నప్పటి నుంచే హర్డిల్స్ ప్లేయర్. తమిళనాడులోని ఊటికి సమీపంలోని కొత్తగిరి అనే గ్రామంలో జన్మించింది. యూఎస్‌లోని టిబిలిసి స్టేట్ మెడికల్ కళాశాల(జార్జియా)లో వైద్య విద్యను చదివింది. సినిమా కోసం తెలుగు నేర్చుకుంది. తాను మేకప్‌కు పూర్తిగా దూరం అంటున్నది. సహజ అందంతో ప్రేక్షకుల మనసులు దోస్తున్నది. అంతేకాదు.. అందానికి సంబంధించిన ప్రకటనల్లో నటించనని తెగేసి చెప్పింది. 2016లో కొచ్చి టైమ్స్ 'మోస్ట్ డిజైరబుల్ ఉమెన్'గా ప్రకటించింది. సాయి పల్లవి వెజిటేరియన్. మలయాళం ప్రేమమ్‌లో 'రాకాకుంతూ..' పాటకు తానే స్వయంగా కొరియోగ్రఫీ చేసింది. చిన్నప్పటి నుంచి ఐశ్వర్యరాయ్, మాధురీ దీక్షిత్ వీడియోలు చూసి డ్యాన్స్ నేర్చుకుంది. డ్యాన్స్ కోసం ప్రత్యేకంగా ఎలాంటి క్లాసులు అటెండ్ కాలేదట. ఓనమ్ పండుగంటే ఆమెకు చాలా ఇష్టమట. ఆ రోజున ఇంటి ముందు రంగవల్లులు వేస్తూ తెగ సంబరపడిపోతుంది. కార్డియాలజిస్ట్ అయి ఎంతోమందికి తనవంతు సహాయం చేయాలని సాయిపల్లవి ఆశపడుతున్నది.

**పేరు : సాయి పల్లవి**
**వయసు : 27 యేండ్లు**
**వృత్తి : నటన**



**వివిధ రంగాలు. విభిన్న నేపథ్యాలు. ఎన్నో ఆటుపోట్లు. మరెన్నో మలుపులు. అన్నీ దాటేసి విజయం వైపు ప్రయాణం. అదీ అత్యధిక వయసులో కాదు. కేవలం మూడు పదుల వయసులోపే.. వారిప్పుడు దేశం గర్వించదగ్గ సంపన్నులు. సంపన్నులంటే ఆస్తి, అంతస్తుల్లో కాదు. మంచిగుణం, మనసు అన్నింటికంటే వారు ఎంచుకున్న రంగానికి వందశాతం న్యాయం చేయడం. వారు పనినే దైవంగా భావిస్తూ ఆయా రంగాల్లో అద్భుత విజయాలు సాధించారు. అలాంటి వారిని గుర్తించిన ప్రముఖ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ అండర్ 30'లో చోటిచ్చింది. వారి విజయనేపథ్యం 'జిందగీ' ప్రత్యేకం..**

# విజయానికి పట్టాభిషేకం!



**పేరు : ఆకాంక్ష శర్మ**
**వయసు : 28 ఏండ్లు**
**వృత్తి : ఐకియా డిజైనర్**

ఆకాంక్ష శర్మ.. ఢిల్లీకి చెందిన యువతి. సాంప్రదాయ కుటుంబంలో పుట్టింది. అనేక కట్టుబాట్ల ఇబ్బందులను ఎదుర్కొన్నది. కానీ తెలియని రంగంలో ఆమె కృషి చేయాలనుకుంది. అదే ఆలోచనతో ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో చేరింది. అక్కడ ఆమెను కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆ ఇనిస్టిట్యూట్‌తో ఐకియా డిజైనింగ్ ప్రాజెక్టులు నిర్వహించేది. ఈ క్రమంలో 'ఐకియా' క్రియేటివిటీ విభాగం నుంచి ఆకాంక్ష ఆహ్వానాన్ని అందుకుంది. కానీ దాన్ని ఆమె తిరస్కరించింది. మూడు సంవత్సరాల కోర్సు పూర్తి కానిదే ఆమె ఉద్యోగంలో చేరాలనుకోలేదు. దీంతో ఐకియా ఆకాంక్ష కోసం ఏడాది పాటు వేచి చూసింది. కోర్సు అయిన తర్వాత ఆకాంక్ష 2017 ఫిబ్రవరిలో ఐకియాలో టెక్స్‌టైల్ డిజైనర్‌గా చేరింది. ఆకాంక్ష సృజనాత్మకతను మెచ్చిన ఐకియా ఆమెను తొలి భారత యువ డిజైనర్‌గా ఎంచుకుంది. ఐకియా ఉత్పత్తులకు స్వొంత ఆలోచనలతో రూపాలను, రంగులను ఇచ్చి ఆకర్షణీయంగా చేయడంలో ఆకాంక్ష ప్రతిభావంతురాలు. టెక్స్‌టైల్ ఆర్టిస్ట్‌తో పాటు ఆకాంక్ష విజువల్ ఆర్టిస్ట్ కూడా. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఇలస్ట్రేషన్స్‌లో కూడా ఆమె పని చేస్తున్నది.

'భారత్ అగ్రీ' సాంకేతిక వ్యవసాయ సమాచారానికి వేదిక. టెక్నాలజీని ఉపయోగించి వ్యవసాయం చేయడం, రైతులతో కలిసి పని చేయడం ఈ సంస్థ లక్ష్యం. భారత్ అగ్రీని స్థాపించిన వారిలో కో-ఫౌండర్ సాయిగోలె. ఐఐటీ మద్రాస్, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ విద్యార్థిని. సాయిగోలె కుటుంబం 30 సంవత్సరాలుగా వ్యవసాయంలో ఉంది. ఈ రంగంలో ఉండే నిర్దిష్ట సమస్యల గురించి ఆమెకు అవగాహన ఉంది. అందుకే సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఈ సమస్యలను పరిష్కరించేందుకు 'భారత్ అగ్రీ' స్థాపనలో భాగమైంది. పీజీ తర్వాత పుణెలో ఐదు సంవత్సరాలు రైతులతో ఉండి సమస్యలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకోగలిగింది. శాస్త్రీయ పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో రైతులు చాలా తక్కువ సంపాదిస్తున్నారని తెలుసుకొని 'భారత్ అగ్రీ' స్థాపనలో కృషి చేసింది. ఇటీవల విడుదల చేసిన యాప్ ద్వారా సుమారు లక్ష మంది వినియోగదారులు భారత్ అగ్రీ సేవలు అందుకుంటున్నారు. 2017లో ఈ సంస్థ ఉబేర్ పిచ్ పోటీలో విజయం సాధించింది. ఉబేర్ ఈ స్టార్టప్‌లో 35 లక్షల పెట్టుబడికి ముందుకు వచ్చింది.

**పేరు : సాయి గోలె**
**వయసు : 26**
**వృత్తి : కో ఫౌండర్, భారత్ అగ్రీ**





**పేరు : పాలక్ షా**
**వయసు : 28**
**వృత్తి : సీఈఓ, ఎకాయా.**

ఎకాయా అనేది లగ్జరీ చేనేత బ్రాండ్. 'పాలక్ షా' ఈ కంపెనీని 2012లో స్థాపించింది. శతాబ్దానికి పైగా పాలక్ షా కుటుంబం వస్త్ర వ్యాపారంలో ఉంది. పాలక్ షా లండన్‌లోని కింగ్స్ బిజినెస్ కాలేజీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యనభ్యసించింది. భారతీయ వస్త్రాల చుట్టూ ఉండే సంప్రదాయ కళను కొత్తగా అందించాలన్న తపనతో లగ్జరీ చేనేత బ్రాండ్ ఎకాయాను స్థాపించింది. భారతీయ వస్త్రాలను దైనందిన జీవితంలో భాగంగా చూడాల్సిన అవసరం ఉందని చెప్తారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఈ కంపెనీ బ్రాంచీలు 40 కోట్ల వార్షిక ఆదాయంతో, 80 వేల మంది చేనేత కళాకారులతో నడుస్తున్నాయి. ఢిల్లీ, అహ్మదాబాద్, హైదరాబాద్, ముంబైలో ఈ సంస్థ ప్రధాన దుకాణాలను కలిగి ఉంది. చేతితో నేసిన చీరలు, లెహంగాలు, రెడీ టు వేర్ వస్త్రాలు ఉత్పత్తి చేయడం ఈ సంస్థ ప్రత్యేకత. పాలక్‌కు 2018లో ఉమెన్ ఆఫ్ ది డికేడ్ ఇన్ సస్టైనబుల్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డును ఎకనామిక్ ఫోరం అందించింది. చేనేత, వస్త్ర సంపదను ప్రపంచానికి తెలియజేయడం, దాని కళానైపుణ్యాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యం అని పాలక్ అంటున్నారు.

ప్రియా ప్రకాశ్‌ది హర్యానాలోని గుర్గావ్. ఆమె స్థానిక రిషివ్యాలీ స్కూల్లో చదివింది. ఆమె బాల్యం మంతా అధిక బరువుతో బాధపడింది. తనలా మరే విద్యార్థి బాధపడకూడదని ఆమె నిర్ణయించుకుంది. డిగ్రీ తర్వాత 2014లో 'హెల్త్ సెట్ గో' అనే ఆరోగ్య రక్షణ సంస్థను ప్రారంభించింది. ఈ సంస్థ ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేవారు. ఇందులో భాగంగా పిల్లలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి. చేతులు ఎలా కడుక్కోవాలి. పిల్లల ఎదుగుదల, జ్ఞాపకశక్తిని పెంచుకోవడం ఎలా? ఆరోగ్యంగా జీవించడం ఎలా? ఆహారంలో ప్రొటీన్లు, తీసుకోకూడని ఆహారపదార్థాలు. జ్ఞానేంద్రియాలు, వ్యాధులు తదితర విషయాలను పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ప్రియ ప్రకాశ్ అవగాహన కల్పించింది. సంస్థ ప్రారంభం నుంచి వలంటీర్లతో కలిసి ఆమె 77 నగరాల్లో దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు, సంరక్షకులకు అవగాహన కల్పించింది. పాఠశాలల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించే అతిపెద్ద సంస్థగా 'హెల్త్ సెట్ గో' సంస్థ పేరు పొందింది.

**పేరు : ప్రియా ప్రకాశ్**
**వయసు : 28 యేండ్లు**
**వృత్తి : హెల్త్ సెట్ గో, సీఈఓ**



... జిందగీ డెస్క్

## ఆస్కార్ మెచ్చిన 'ఉత్తమనటి'

**తెలుగుజాతి గర్వించదగ్గ మహానటి సావిత్రి జీవిత కథను సినిమాగా తీస్తే.. జాతీయ అవార్డే వచ్చింది. ఆ పాత్రకు పూర్తి న్యాయం చేసిన కీర్తి సురేశ్‌కు సినీ ప్రపంచమే నీరాజనాలు పట్టింది. ఇది కూడా అచ్చం అలాంటి కథే. చిన్ననాటి నుంచే సంగీత ప్రపంచాన్ని తన పాటలతో ఓలలాడించిన జూడీ గార్లాండ్.. ఓ మహా గాయకురాలిగా, నటిగా ఎదిగింది. నిజ జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటూ.. కష్టాల కొలిమిలో రాటుదేలింది. అలాంటి జూడీ జీవితగాథను సినిమాగా తీస్తే.. హాలీవుడ్ ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. సిల్వర్‌స్క్రీన్ జూడీగా తనలోని అన్ని హావభావాలను పలికించిన 'రెనీ జెల్వెగర్'కు ఆస్కార్ జ్యూరీ ఫిదా అయింది. ఆమెనే ఉత్తమనటిగా ప్రకటించింది.**



**జూడీ..** ఓ కష్టాల కడలి. ఓ విజయ తీరం. అన్నింటికీ మించి పడిలేచిన కెరటం. అలాంటి నటి బయోపిక్‌లో అన్నీ తానై, తన భుజస్కంధాలపై సినిమాను మోసింది నటి రెనీ జెల్వెగర్. అందుకే ప్రపంచ ప్రఖ్యాత ఆస్కార్ అవార్డు రెనీ తలుపు తట్టింది. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోయే నటిగా, నిర్మాతగా తన అభిరుచికి తగ్గట్లు టీవీ షోలు, సీరియళ్లు నిర్మించడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం రెనీ ప్రత్యేకతలు. ఇప్పటికి 39 సినిమాల్లో నటించిన జెల్వెగర్.. 6 టీవీ సీరియళ్లు నిర్మించింది. 2004 ఆస్కార్ అవార్డుల్లో 'ఉత్తమ సహాయనటి' అవార్డు పొంది.. ఈ ఏడాది 'ఉత్తమనటి'గా ఎంపికై ఆస్కార్ అందుకున్నది రెనీ జెల్వెగర్. 2007లో హాలీవుడ్‌లో అత్యధిక పారితోషికం తీసుకునే నటీమణుల్లో జెల్వెగర్‌ది అగ్రస్థానం. ఇప్పటికే రెండు 'అకాడెమీ అవార్డులు', నాలుగు 'గోల్డెన్ గ్లోబ్', రెండు 'బాఫ్టా' అవార్డులతో సహా అనేక ప్రశంసలను అందుకున్నది. 2009 లో 'హేస్టీ పుడ్డింగ్ థియేట్రికల్స్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్'గా కూడా ఎంపికైంది రెనీ.

టెక్సాస్‌లో జన్మించిన జెల్వెగర్ 'యూటీ ఆస్టిన్'లో ఇంగ్లీష్ లిటరేచర్ చదివింది. తన కెరీర్ ప్రారంభంలో జర్నలిజం వృత్తిలో రాణించి.. ఆ తర్వాత హాలీవుడ్‌వైపు అడుగులు వేసింది. 'డాజ్డ్ అండ్ కన్‌ఫ్యూజ్డ్' (1993) సినిమాలో ఒక చిన్న పాత్రతో ఆమె సినీరంగ ప్రవేశం చేసింది.

**రెనీ నటిగా చేయకముందు చీర్‌లీడర్‌గా, జిమ్నాస్ట్‌గా, స్పీచ్‌టీం, 18డ్రామా క్లబ్ లో సభ్యురాలిగా పనిచేసింది జెల్వెగర్. మంచి క్రీడాకారిణి కూడా. ఒకవైపు సినిమాల్లో నటిస్తూనే హెచ్ఐవీ, క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం, అనాథ ఆశ్రమాలను సందర్శించి వారికి ఆర్థికంగా సాయం చేయడం, పేదపిల్లల చదువుకు అండగా ఉండడం వంటి మంచి పనులు చేస్తున్నది రెనీ జెల్వెగర్.**

**ఇదీ 'జూడీ' చరిత్ర..**

జూడీ గార్లండ్.. 19వ శతాబ్ది ప్రారంభంలో పాప్ సంగీత ప్రపంచాన్ని ఉప్పెనలా ముంచెత్తిన గొంతుక. అమెరికాలో పుట్టి, పెరిగి సంగీత ప్రపంచంలో ఓనమాలు నేర్చుకొని.. సొంతంగా పాటలు రచించి, పాడే స్థాయికి చేరుకున్నది. హాలీవుడ్ నటిగా గుర్తింపు పొంది, 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేం'లో చోటు సంపాదించిన గొప్ప నటి. 14 యేండ్ల నుంచే హాలీవుడ్ చైల్డ్ ఆర్టిస్ట్‌గా, గాయనిగా పేరు తెచ్చుకున్న జూడీ.. యుక్త వయసు నుంచి కష్టాలూ అనుభవించింది. 47 యేండ్ల వయసు వరకూ ఐదుగురు భర్తలతో వేసారింది. ఒకవైపు అనారోగ్యంతో గొంతు సహకరించపోవడం, ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడం, వాటిని మర్చిపోయేందుకు మత్తు పదార్థాలకు బానిసగా మారడం.. ఈ సమస్యలంటినీ అధిగమించి మళ్లీ మైక్ పట్టడం జూడీ జీవితంలో ఓ మైలురాయి. చివరికి 1969లో 47 యేండ్ల వయసులో మరణించింది. ఇద్దరు పిల్లలతో అమెరికా నుంచి లండన్ వరకూ సాగిన ఆమె జీవితాన్ని గతేడాది సినిమాగా చిత్రీకరించారు హాలీవుడ్ దర్శకుడు రూపెర్ట్ గూల్డ్. జూడీ పాత్రలో పరకాయప్రవేశం చేసింది రెనీ జెల్వగర్.

## పెడిక్యూర్ తప్పనిసరి

**కాలంతో సబంధం లేకుండా శుభ్రత పాటించాల్సిన వాటిలో పాదాలు ప్రధానమైనవి. దుమ్ము, ధూళి కాళ్ళగోర్లలో ఇరుక్కొని చాలా మురికిగా తయారవుతాయి. దీంతో ఆరోగ్యం దెబ్బ తినే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. దీన్ని ఇలానే వదిలేస్తే ఇన్‌ఫెక్షన్లకు గురవుతారు.**



- వర్షాకాలంలో కాళ్లు తడువడంతో కాలివేళ్ల మధ్య బ్యాక్టీరియా, ఫంగస్ చేరే ప్రమాదముంది. ఎండాకాలం వస్తున్నది. ఇక ప్రమాదం ఏముండదు అనుకుంటే పొరపాటే. ఎండలో బయట తిరిగి కాళ్లు శుభ్రపరుచుకోకపోయినా ఇదే పరిస్థితి.
- చెప్పులు లేకుండా బయటకు వెళ్లకూడదు. ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉన్నవారు ఇంట్లోనూ సాధారణ చెప్పులు వేసుకొని తిరగాలి.
- నీళ్లలో ఎక్కువసేపు నడిస్తే పాదాలు శుభ్రం చేసుకొని మాయిశ్చరైజర్ రాసి సాక్సులు వేసుకోవాలి. దీంతో పాదాలకు పగుళ్లు రాకుండా ఉంటాయి.
- బ్యాక్టీరియాతోనూ ఇన్‌ఫెక్షన్లు సంభవించవచ్చు. వీటివల్ల కాళ్లపై ఎర్రగా దద్దుర్లు వస్తాయి. దీన్ని అశ్రద్ధ చేస్తే భవిష్యత్తులో మరిన్ని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.
- నీళ్లలో తడిసినప్పుడు ముందుగా యాంటీబయోటిక్ సబ్బుతో కాళ్లను శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత యాంటీసెప్టిక్ క్రీమ్ రాసుకోవాలి. కాలిగోళ్లపై పౌడర్ చల్లి తేమ పోయేలా చేసుకోవాలి. ఇలా చేస్తే ఇన్‌ఫెక్షన్‌కు కారణమయ్యే బ్యాక్టీరియా, ఫంగస్‌ను చాలావరకు నివారించవచ్చు.
- రింగ్‌వార్మ్ అనే ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వర్షాకాలంలోనే కాకుండా మురికి నీటి ద్వారా వ్యాపిస్తుంది. ఇది చర్మానికి చేటు చేస్తుంది.
- వారానికోసారి పెడిక్యూర్ తప్పనిసరి చేయించాలి. మృతకణాలు పేరు పోకుండా ఆరోగ్యంగా ఉంటాయి. ఏం చేసినా ఇన్‌ఫెక్షన్ తగ్గకపోతే తప్పనిసరిగా డాక్టర్‌ని సంప్రదించాలి.



నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 11 ఫిబ్రవరి 2020

# ఆస్కార్‌లో ఆసియా మెరుపులు



బాంగ్ జూన్ హో

జాక్విన్ ఫీనెక్స్

గ్రెగ్ బట్లర్, రొచెరాన్

బ్రాడ్‌పిట్

లారా డెర్న్

**పేదవారికి ప్రత్యేకంగా శత్రువులెవరూ ఉండరు. తరచి చూస్తే పేదరికమే ఛేదించలేని శత్రువుగా కనిపిస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజాల రూపురేఖలు మారుతున్నా ధనిక, పేద మధ్య అంతరాల అగాధాలు మాత్రం పెరిగిపోతూనే ఉన్నాయి. ఉన్నతమైన జీవనం కోసం ఎవరి యోగ్యతకు తగిన ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఈ క్రమంలో మానవ విలువల సంఘర్షణ చోటుచేసుకుంటున్నది. ఈ నేపథ్యానికి వినోదం, క్రైమ్, సామాజిక సందేశం కలబోసి రూపొందించిన దక్షిణ కొరియన్ చిత్రం 'పారాసైట్' ఈ ఏడాది ఆస్కార్ బరిలో ఉత్తమ చిత్రంతో పాటు మొత్తం నాలుగు విభాగాల్లో పురస్కారాల్ని సొంతం చేసుకొని సంచలనం సృష్టించింది. మొదటి ప్రపంచ యుద్ధ నేపథ్యంలో రూపొందించిన బ్రిటీష్ చిత్రం '1917' మూడు విభాగాల్లో అవార్డుల్ని గెలుచుకొని సత్తా చాటింది. అమెరికన్ సైకలాజికల్ థ్రిల్లర్ 'జోకర్'లో అసమాన నటనకుగాను జోక్విన్ ఫీనెక్స్ ఉత్తమ నటుడిగా, 'జూడీ' చిత్రంలో అద్భుతాభినయానికి రెనీ జెల్‌వెగర్ ఉత్తమ నటిగా పురస్కారాల్ని అందుకున్నారు. 92వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవ సంరంభం అమెరికా లాస్ ఏంజెల్స్ డాల్బీ థియేటర్‌లో ఆదివారం అట్టహాసంగా జరిగింది. హాలీవుడ్ తారాలోకమంతా కొలువుతీరగా ఎర్రతివాచీపై సుందరాంగుల తళుకుబెళుకులతో ఆద్యంతం ఉత్సాహభరితంగా ఈ అవార్డుల ప్రదానోత్సవ వేడుకను నిర్వహించారు.**

- **కొరియన్ 'పారాసైట్'కు అవార్డుల పంట**
- **'1917'కు మూడు పురస్కారాలు**
- **'జోకర్'కు ఉత్తమ నటుడి అవార్డు**

**ఈ** ఏడాది దక్షిణ కొరియన్ చిత్రం 'పారాసైట్' ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఇంటర్నేషనల్ సినిమా విభాగాల్లో పురస్కారాల్ని దక్కించుకుంది. 92ఏళ్ల ఆస్కార్ అవార్డుల చరిత్రలోనే ఓ విదేశీ చిత్రం ఉత్తమ సినిమాగా పురస్కారాల్ని స్వీకరించడం ఇదే ప్రథమం. ఈ సినిమాకు బాంగ్ జూన్ హో దర్శకత్వం వహించారు.

**'పారాసైట్' కథేమిటంటే..**

పోషణ చేతకాక ఇతర జీవులపై ఆధారపడి జీవనం సాగించే వాటిని పరాన్న జీవులు అంటారు. మనుషుల్లో కూడా పరాన్న భుక్కులుంటారు. మరొకరి జీవనం ఆలంబనగా తమ బ్రతుకును సాగించాలని తపిస్తుంటారు. సియోల్‌కు చెందిన కీటేక్, చంగ్‌సూక్ దంపతులు అలాంటి పరిస్థిల్లోనే ఉంటారు. ఓ సెల్లార్‌లో తమ ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తుంటారు. ఇంటర్నెట్ వైఫైను కూడా దొంగిలించి వాడుతుంటారు. ఇంతలో వారి దారిద్ర్యం అంతానికి ఓ ఆశారేఖలా కుమారుడు కీవూ ఓ సంపన్న కుటుంబానికి చెందిన అమ్మాయి ఇంట్లో ట్యూటర్‌గా చేరతాడు. క్రమంగా తన తల్లిని, చెల్లిని, నాన్నను అదే ఇంట్లో పనికి కుదుర్చాడు. కానీ తామందరం కుటుంబ సభ్యులమనే రహస్యాన్ని దాస్తాడు. అప్పటికే అక్కడ పనిచేస్తున్న వారిపై యజమాని వద్ద అబద్ధాలు చెప్పి బయటకు పంపిస్తారు. అయితే వీరంతా ఒకే కుటుంబ సభ్యులని ఇంటిలో పనిమానేసిన ఓ మహిళకు తెలుస్తుంది. దీంతో ఆమెను యజమానితో కలవనీయకుండా కీవూ కుటుంబం ఏం చేసింది? ఆ మహిళ వల్ల కీవూ కుటుంబం ఎలా ప్రమాదంలో పడింది? తమను చిన్నచూపు చూసే సంపన్నకుటుంబ యజమానిపై కీవూ తండ్రి ఎలాంటి నేరానికి పాల్పడ్డాడు? అబద్ధాలే పునాదిగా విలాసజీవితాన్ని పొందాలని భావించిన కుటుంబం చివరకు ఎలా విషాద పరిస్థితుల్ని ఎదుర్కొంది? అన్నదే స్థూలంగా 'పారాసైట్' చిత్ర కథ.

రోమా(2018), అమోర్(2012) , క్రౌంచింగ్ టైగర్ హిడెన్ డ్రాగెన్ (2000) తర్వాత ఉత్తమ చిత్రం కేటగిరీలో పోటీ పడిన నాలుగో విదేశీ చిత్రంగా పారాసైట్ నిలిచింది. వీటిలో పారాసైట్ మాత్రమే అవార్డును దక్కించుకున్నది.

సామాజికాంశాల సృజనశీలి బాంగ్ జూన్ హో

కొరియన్ సంస్కృతులకు పేద, ధనిక అంతరాల్ని వ్యంగ్యంగా జోడిస్తూనే ఆలోచనను రేకెత్తించేలా సినిమాల్ని రూపొందించడం బాంగ్ జూన్ హో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. 'దిహోస్ట్' 'ఓక్జా' 'మదర్' 'మెమోరీస్ ఆఫ్ మర్డర్' సినిమాలు ఆయన ప్రతిభకు అద్దం పట్టాయి. ఆంగ్‌లీ (లైఫ్ ఆఫ్ పై, బ్రోక్ బ్యాక్ మౌంటెన్) తర్వాత ఉత్తమ దర్శకుడిగా ఆస్కార్‌ను అందుకున్న రెండో ఆసియా వ్యక్తి బాంగ్ జూన్ హో కావడం విశేషం.

**సామాజిక విలువల సంఘర్షణ...**

వినడానికి సింపుల్ లైన్‌గా అనిపించిన ఈ కథలో ధనిక, పేద, కలకు..నిజానికి మధ్య ఉన్న అంతరాల్ని వాస్తవిక కోణంలో చర్చించారు. భౌతిక సుఖాల మీద ఉన్న మోజు మనుషుల్ని ఎంతటి దుస్థితికి దిగజార్చుతుందో అనే అంశాన్ని తెలియజెప్పే ప్రయత్నం చేశారు. సీరియస్ సోషియో ఎకనామిక్ కాన్సెప్ట్‌ను వినోదం, వ్యంగ్యం ప్రధానంగా చెప్పడం..చివరకు అనుకోని విషాదం ఈ సినిమాలో ఆసక్తికరమైన అంశాలుగా కనిపిస్తాయి. 'పారాసైట్' కేన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో కూడా ఉత్తమ చిత్రంగా పురస్కారాన్ని గెలుచుకుంది. 'బాఫ్టా' అవార్డుల్లో ఉత్తమ ఆంగ్లేతర భాషా సినిమాగా నిలిచింది.

**మనోబహిర్ లోకాల సంఘర్షణ 'జోకర్'**

'జోకర్' చిత్రంలో నటించిన జోక్విన్ ఫీనెక్స్ ఉత్తమ నటుడిగా ఆస్కార్ పురస్కారాన్ని అందుకున్నారు. సమాజంతాలూకు వికృత రూపాల్ని, అవకాశావాద విలువల్ని చూసి ఓ మానసిక రోగిగా మారిన వ్యక్తి కథే 'జోకర్'. సూడో బుల్బార్ ఎఫెక్ట్ అనే మానసిన జబ్బుతో మెదడులో కలిగే భావోద్వేగాల్ని సరిగ్గా వ్యక్తపరిచే శక్తిని కోల్పోతాడు ఆర్థర్‌ఫ్లెక్. తాను సమాజంలో నిత్యం ఎదుర్కొన్న అవహేళన వల్లే ఆ జబ్బు బారిన పడతాడతను. బాల్యదశలో ఎదురైన ఛీత్కరింపులు సమాజానికి దూరంగా భయంకర వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకోవడానికి కారణాలవుతాయి. తన అంతరాంతరాల్లో నవ్వును ఎప్పుడు ఎరగని వాడు బాహ్య ప్రపంచంలో అందరిని నవ్వించే జోకర్‌గా మారడమే ఈ సినిమాలో అసలైన విషాదం. ఆర్థర్‌ఫ్లెక్ పాత్రలో జోక్విన్ ఫీనెక్స్ అద్భుతమైన నటనను కనబరిచాడు. సమకాలీన అమెరికన్ జీవనానికి అద్దం పడుతూ తాత్విక భూమిక మీద ఈ సినిమా నడిచింది. ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌ను డీసీ కామిక్స్ ఆధారంగా తీర్చిదిద్దారు. 1981 నేపథ్యంలో కథ నడుస్తుంది. ఆస్కార్ బరిలో 11 నామినేషన్లు పొందిన ఈ చిత్రం ఉత్తమ నటుడు, ఉత్తమ సంగీతం విభాగాల్లో ఆస్కార్‌ను గెలుచుకుంది..

**అమెరికన్ గాయని జీవితంతో**

అమెరికన్ నటి, గాయని జూడీ గార్‌లాండ్ జీవితంలోని కీలక ఘట్టాల్ని ఆవిష్కరిస్తూ రూపొందించిన 'జూడీ' చిత్రంలో టైటిల్ పాత్రలో అసమాన అభినయాన్ని కనబరచిన రెనీజెల్‌వెగర్ ఉత్తమనటిగా ఆస్కార్ పురస్కారాన్ని దక్కించుకున్నది. గాయని కష్టాలను హృదయాన్ని హత్తుకునేలా దర్శకుడు తెరపై చూపించారు. రెనీకి రెండో ఆస్కార్ పురస్కారమిది. 2003లో 'కోల్డ్ మౌంటెన్'చిత్రానికి గాను ఉత్తమ సహాయనటిగా అవార్డును అందుకున్నది.

**బ్రాడ్ పిట్‌కు తొలి ఆస్కార్**

మూడు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఇప్పటివరకు ఆస్కార్‌ను అందుకోలేకపోయారు బ్రాడ్‌పిట్. ఆ సుదీర్ఘ నిరీక్షణకు 'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్' సినిమాతో తెరపడింది. ప్రముఖ దర్శకుడు క్వింటన్ టరంటినో రూపొందించిన 'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్' సినిమాకుగాను ఉత్తమ సహాయనటుడిగా బ్రాడ్‌పిట్ ఆస్కార్‌ను అందుకున్నారు. హాలీవుడ్ చిత్రసీమకు నివాళిగా 1960–70 కాలంనాటి హాలీవుడ్ చిత్రసీమ పరిస్థితులకు ఓ హత్యానేరాన్ని జోడిస్తూ టరంటినో ఈ సినిమాను రూపొందించారు. క్లిఫ్‌బూత్ అనే పాత్రకు తనదైన అనుభవంతో రక్తికట్టించి అవార్డును సొంతం చేసుకున్నారు బ్రాడ్ పిట్. ఉత్తమ సహాయనటుడితో పాటు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ విభాగంలో ఈ సినిమాకు ఆస్కార్ వరించింది. అలనాటి హాలీవుడ్ చిత్రసీమను కళ్లకు కట్టినట్లుగా ఈ సినిమాలో చూపించారు.

**ఫోర్డ్ వర్సెస్ ఫెరారీ**

అమెరికన్ కార్ డిజైనర్ కారోల్ షెల్బీ, బ్రిటీష్ రేసర్ కెన్ మైల్స్‌ల జీవితం ఆధారంగా రూపొందిన 'ఫోర్డ్ వర్సెస్ ఫెరారి' చిత్రం ఆస్కార్ పురస్కారాల్లో మెరిసింది. ఫిల్మ్ ఎడిటింగ్, సౌండ్ ఎడిటింగ్ విభాగాల్లో ఆస్కార్‌ను అందుకున్నది. ఆటోమొబైల్ దిగ్గజ సంస్థలైన ఫోర్డ్, ఫెరారీ మధ్య పోటీ ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్‌గా చక్కటి వసూళ్లను సాధించింది.

- **ఉత్తమ చిత్రం** -పారాసైట్
- **ఉత్తమ నటి:** రెనీ జెల్‌వెగర్(జూడీ)
- **ఉత్తమ నటుడు:** జోక్విన్ ఫీనెక్స్(జోకర్)
- **ఉత్తమ దర్శకుడు:** బాంగ్ జూన్ హో (పారాసైట్)
- **ఉత్తమ సహాయనటుడు:** బ్రాడ్ పిట్ (వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్)
- **ఉత్తమ సహాయనటి:** లారా డెర్న్(మ్యారేజ్ స్టోరీ)
- **ఉత్తమ సంగీతం ఒరిజినల్ స్కోర్:** హిల్దార్ (జోకర్)
- **ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్:** పారాసైట్
- **ఉత్తమ సినిమాటోగ్రఫీ:** రోజర్ డికెన్స్(1917)
- **ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే:** బోంగ్ జూన్ హో (పారాసైట్)
- **ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్:** 1917



**మొదటి ప్రపంచ యుద్ధ నేపథ్యంలో '1917'**




**యు**ద్ధ క్షేత్రంలో కాలంతో పరుగులు పెడుతూ ఓ కుట్ర నుంచి 1600 మంది సైనికుల్ని రక్షించుకోవడానికి ఇద్దరు సైనికులు చేసిన జీవన్మరణ పోరాటమే '1917' ఇతివృత్తం. 1917 ఏప్రిల్‌లో ఒక రోజు జరిగిన సంఘటనల నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు. యుద్ధ క్షేత్రం నుంచి వ్యూహాత్మకంగా వైదొలిగిన జర్మన్ సైనికులు పన్నిన ఓ పన్నాగం వల్ల 1600 మంది బ్రిటీష్ సైనికుల ప్రాణాలు ప్రమాదంలో ఉంటాయి. దీంతో మరునాడు ఉదయం ప్లాన్ చేసిన ఎటాక్ ఆపాల్సిందిగా బ్రిటీష్ మేజర్ ఇద్దరు సైనికులకు ఆదేశాలిస్తాడు. మరో బెటాలియన్ చోటుకి వెళ్లి ఆ వార్తను వారు చేరవేయాల్సి ఉంటుంది. అణువణువణునా మృత్యుభయం పొంచి ఉన్న శత్రుదేశపు యుద్ధరంగం నుంచి ప్రయాణం సాగించిన ఆ ఇద్దరు సైనికుల ..యుద్ధం మిగిల్చిన విషాద ఛాయలు...వేల మృతదేహాలను దాటుకుంటూ ఒళ్లు గగుర్పొడిచేలా చేసిన ప్రయాణం '1917'ను ఓ గొప్ప చిత్రంగా నిలిపాయి. ఈ చిత్రం ఉత్తమ సౌండ్ మిక్సింగ్, ఉత్తమ సినిమాటోగ్రఫీ, బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో ఆస్కార్ పురస్కారాల్ని సాధించింది. శామ్ మెండిస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

# ఇక నుంచి సిక్స్‌లే కొడతా!



కెఎస్ రామారావు, ఇజాబెల్లా, ఐశ్వర్యా, విజయ్, రాశీఖన్నా, కేథరిన్, క్రాంతిమాధవ్, వల్లభ

**'నే**ను సిక్స్ కొట్టాలనే మైదానంలోకి దిగుతా. సింగిల్, డబుల్ చేసే ఓపిక నాకు లేదు. కొడితే బాల్ స్టేడియం బయటపడాలనుకుంటా. అనుకున్నట్లే కొన్ని బాల్స్ స్టేడియం బయటపడ్డాయి. కొన్ని బౌండరీ లైన్ మీద క్యాచ్‌లయ్యాయి. అయినా నాకు ఎలాంటి భయం లేదు' అన్నారు విజయ్ దేవరకొండ. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. క్రాంతిమాధవ్ దర్శకుడు. రాశీఖన్నా, ఐశ్వర్యారాజేష్, కేథరిన్, ఇజాబెల్లా కథానాయికలు. కె.ఎస్.రామారావు సమర్పణలో వల్లభ నిర్మించారు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'ఈ ఏడాది నుంచి కొత్త దశలోకి ఎంటరవుతున్నా. 'వరల్డ్ ఫేమస్ లవర్' నా లాస్ట్ లవ్‌స్టోరీ అనుకొని అన్నీ కవర్ చేయాలనుకున్నా. ఈ సినిమాలో నలుగురు ప్రేయసిలు, మూడు విభిన్నమైన సిటీలు, వైరుధ్యమైన ఆర్థిక అసమానతలతో కూడిన పాత్రను చేశాను. బొగ్గుగని కార్మికుడిగా, పారిస్‌లో విదేశీ అమ్మాయిని ప్రేమించే వ్యక్తిగా, హైదరాబాద్‌లో ఓ అమ్మాయితో ప్రేమాయణం నడిపే యువకుడిగా..ఇన్ని వేరియేషన్స్ ఉన్న పాత్రను చేశాను. ఇలాంటి క్యారెక్టర్స్ చేసే అవకాశం మళ్లీ నాకు దొరకదు. స్క్రిప్ట్ వినగానే ఇదే నా ఫైనల్ లవ్‌స్టోరీ అని ఫిక్సయి పోయా. ఈ సినిమా చూస్తే మీరందరూ ప్రేమలో పడతారనుకుంటున్నా. ఇక నుంచి సిక్స్‌లు కొట్టడానికే ప్రయత్నిస్తా' అన్నారు. 'విజయ్ కథ విని గొప్ప సినిమా అవుతుందన్నాడు. ప్రతి సీన్‌లో అసాధారణమైన అభినయనాన్ని కనబరిచాడు. సినిమా చూస్తున్నంతసేపు భావోద్వేగంగా ఫీలవుతారు. మన మనసుల్ని వెంటాడే సినిమా ఇది' అని కేఎస్ రామారావు చెప్పారు. క్రాంతిమాధవ్ మాట్లాడుతూ 'ఈ ప్రపంచంలో శిశువు జన్మించింది అంటే ఒక కొత్త ప్రపంచం పుట్టినట్లు. ఆ ప్రపంచం ఎదిగి ఒక పెద్ద ప్రపంచం అయ్యాక తనలాంటి ఇంకో ప్రపంచం కోసం వెతుకుతుంది. ఆ ప్రపంచం ఎదురైనప్పుడు అందులో ఏకమవ్వాలని, మమేకమవ్వాలని ప్రయత్నం చేస్తుంది. అప్పుడే అలజడి సృష్టించబడుతుంది. దానినే నేను ప్రేమ అంటాను. ఈ సినిమాలో ఆ ప్రేమ ఎలా ఉంటుందో చూపించాను' అన్నారు. 'నన్ను అందరూ లక్కీయెస్ట్ బ్రదర్ ఇన్ వరల్డ్ అని అందరూ అంటుంటారు. నేనూ అలాగే ఫీలవుతా. ఈ సినిమా చూసి ఫుల్ ఎంజాయ్ చేశా' అని ఆనంద్ దేవరకొండ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.సురేష్‌బాబు, అల్లు అరవింద్, అభిషేక్ నామా, తరుణ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.







epaper.ntnews.com

నమస్తే తెలంగాణ

# జీవనరేఖ

[ కరీంనగర్ ]

మంగళవారం 11 ఫిబ్రవరి 2020




ప్రతి ఒక సమస్యకూ ఒక పరిష్కారం ఉంటుంది. కొన్నిసార్లు మరింత మెరుగైన పరిష్కారం కోసం ఆలోచిస్తాం. వైద్యరంగం కూడా సరిగ్గా ఇలాగే పరిష్కారాలను వెతుకుతుంది. ఒక జబ్బుకు అందుబాటులో ఉన్న చికిత్సా పద్ధతి కన్నా మరింత మెరుగైన చికిత్సలను తీసుకురావడం కోసం నిరంతరం పరిశోధనలు చేస్తూనే ఉంటుంది. సాంకేతికాభివృద్ధి చెందిన కొద్దీ మరింత సౌకర్యవంతమైన, పేషెంట్ సేఫ్టీ ట్రీట్‌మెంట్స్ ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తూనే ఉంటాయి. శస్త్రచికిత్సల్లోకి అలా వచ్చిందే రోబోటిక్స్. చికిత్సలకు రారాజై వైద్యరంగాన్ని ఏలుతోంది. ఈ రోబో పరిజ్ఞానంలో కూడా కొత్త వెర్షన్‌లు వస్తున్నాయి. కీలుమార్పిడి చికిత్సల్లోకి కూడా వచ్చిన రోబో పరికరం ఈ సర్జరీని మరింత సులువు చేయడమే కాకుండా, చిన్న చిన్న లోపాలు కూడా రాకుండా వందశాతం కచ్చితమైన ఫలితాలను ఇస్తున్నది. 50 ఏళ్ల క్రితం మొదలైన కీలుమార్పిడి చికిత్స కొత్త పుంతలు తొక్కుతూ ఇప్పుడు 4జి స్మార్ట్ రోబోగా దేశంలోనే ప్రప్రథమంగా మన రాష్ట్రంలోకి అడుగిడింది. సన్‌షైన్ హాస్పిటల్ ఇందుకు శ్రీకారం చుట్టింది. ఈ రోబో సహాయంతో పేషెంటుకు సరిపోయే డిజైనర్ కీళ్లను అమర్చొచ్చు.

# మోకాళ్ల నొప్పికి ఇక డిజైనర్ కీళ్లు!

**దాదాపు** 50 ఏళ్ల క్రితం మోకాలి కీలు మార్పిడికి బీజం పడింది. అరిగిపోయిన మోకాళ్ల స్థానంలో వివిధ రకాల పదార్థాలతో నింపి మోకాళ్ల నొప్పి నుంచి ఉపశమనం కలిగించవచ్చనే ఆలోచనకు అంకురార్పణ జరిగింది. మొట్టమొదట కీలులో రెండు ఎముకల మధ్యలో ఉండే కార్టిలేజ్ (గుజ్జు) అరిగిపోతే దాని స్థానంలో దంతం లాంటి పదార్థంతో నింపేవాళ్లు. ఆవు బ్లాడర్‌ని, చర్మాన్ని కూడా గుజ్జుగా వాడేవాళ్లు. ఎముకల మధ్యలో ఈ పదార్థాలు ఉండడం వల్ల రెండు ఎముకలు ఒకదానికొకటి రాసుకునే అవకాశం ఉండదు. దాంతో నొప్పి నుంచి తాత్కాలికంగా ఉపశమనం కలిగేది. అయితే ఇలా ఎముకల మధ్య కీలు భాగంలో నింపిన ఈ పదార్థానికీ, ఎముకలకీ ఎటువంటి అతుకూ లేకపోవడం వల్ల అది కీలు లోంచి జారిపోయేందుకు ఆస్కారం ఉండేది. అందువల్ల ఈ రకమైన కీలుమార్పిడి ఫెయిలైంది.

### అసలైన కృత్రిమ కీలు మార్పిడి..

ఆ తర్వాత.. 1974లో ఆధునిక కీలుమార్పిడి చికిత్స ఆరంభమైంది. న్యూయార్క్‌లో ఈ ఆధునిక నీ రీప్లేస్‌మెంట్ ట్రీట్‌మెంట్ మొదలుపెట్టారు. డాక్టర్ ఇన్సాల్, డాక్టర్ రాణావత్‌లు ఇప్పటి ఆ ఆపరేషన్‌ను తీసుకొచ్చారు. ఈ ఆపరేషన్ కోసం కార్టిలేజ్‌ను భర్తీ చేయడానికి వేరే పదార్థాలతో నింపడం లాంటిది చేయలేదు. మెటల్, ప్లాస్టిక్‌లను ఉపయోగించి కొత్త కీలునే తయారుచేశారు. మెటల్‌ను కోబాల్ట్-క్రోమియం లోహ మిశ్రమంతో తయారుచేస్తారు. హైడెన్సిటీ పాలి ఎథిలీన్‌తో చేసిన ప్లాస్టిక్ కృత్రిమకీలు రెండో భాగం.

### ఎలా చేస్తారు?

తొడ ఎముక, పిక్క ఎముక మధ్యలో ఉండేదే మోకాలి కీలు. రెండు ఎముకలు ఒకదానికొకటి రాసుకుని పోకుండా ఉండేందుకు రెండింటి మధ్యలో కార్టిలేజ్ (మృదులాస్థి) అనే గుజ్జు లాంటి పదార్థం ఉంటుంది. వయసురీత్యా ఈ కార్టిలేజ్ అరిగిపోయినప్పుడు రెండు ఎముకలు రాసుకుని నొప్పి వస్తుంది. ఇలాంటప్పుడు తొడ ఎముక కింది భాగంలో, పిక్క ఎముక పైభాగంలో కొంత ఎముక చెక్కేసి వాటి స్థానంలో ఈ మెటల్, ప్లాస్టిక్‌తో కూడిన కొత్తకీలును అమరుస్తారు. ఈ కొత్త కృత్రిమ కీలును ఇంప్లాంట్ అంటారు. దీనిలో లోహం, ప్లాస్టిక్ రెండు భాగాలుంటాయి. తొడ ఎముక దగ్గర కోబాల్ట్-క్రోమియం మెటల్‌ను, పిక్క ఎముక పై భాగంలో ప్లాస్టిక్ వచ్చేవిధంగా దీన్ని అమరుస్తారు. ఒకటి మెటల్, మరొకటి ప్లాస్టిక్ కావడం వల్ల ఈ రెండు భాగాలు ఎముకల లాగా ఒరుసుకుపోవు. వాటి మధ్య ఫ్రిక్షన్ తక్కువగా ఉండి, నొప్పి రాదు. ఈ కృత్రిమ కీలును రెండు ఎముకల మధ్యలో ఉంచి తరువాత బోన్ సిమెంట్‌తో కదలకుండా అమరుస్తారు.

### ప్రత్యేకత - డిజైనర్ కీలు




దుస్తుల షాప్‌కి వెళ్లి రెడీమేడ్ డ్రెస్ కొనుక్కుంటే మన కొలతలకు సరిగ్గా ఉండొచ్చు.. ఉండకపోవచ్చు. మళ్లీ దాన్ని మన కొలతలకు తగ్గట్టుగా సైజ్ చేయించుకోవాల్సి వస్తుంది. అదే ఏ ఫ్యాషన్ డిజైనర్ దగ్గరికో వెళ్లి మన కొలతలు ఇచ్చి, వాటికి తగినట్టుగా డ్రెస్‌ను డిజైన్ చేయించుకుంటే మనకు అతికినట్టుగా సరిపోతుంది.

ఇప్పుడు కృత్రిమ కీలు విషయంలో కూడా ఇదే పంథా అందుబాటులో ఉంది. అంటే పేషెంటు కీలు, ఎముకల కొలతలు తీసుకుని వాటికి తగినట్టుగా కొత్త కృత్రిమ కీలు రూపొందించి అమరుస్తారన్నమాట. 4జి మాక్ రోబోతో ఇది ఇప్పుడు సాధ్యం అవుతున్నది. ఏ పేషెంటుకు ఆ పేషెంటు కీలు ప్రత్యేకంగా తయారుచేయడమే దీని ప్రత్యేకత.

ముందుగా రోగి ఎముకలను సిటి స్కాన్ చేస్తారు. ఆ కీలు ఎలా ఉందో చూసి దాన్ని రీకన్‌స్ట్రక్ట్ చేస్తారు. అలా ప్రతి రోగికి అతనికి సరిపోయే కీలును ప్రత్యేకంగా రూపొందిస్తారు. ఒకరకంగా చెప్పాలంటే ఇంతకుముందయితే ఇంప్లాంట్ రెడీమేడ్ డ్రెస్ అయితే, ఇప్పుడు డిజైనర్ డ్రెస్ అన్నమాట.

### ఇంప్లాంట్‌లో మార్పులు..

30 ఏళ్ల క్రితం నుంచి కృత్రిమ కీలులో అనేక మార్పులు చేయడం మొదలుపెట్టారు. లోహపు భాగంలో మార్పులు చేశారు. కోబాల్ట్-క్రోమియం స్థానంలో టైటానియం పదార్థాన్ని వాడడం మొదలుపెట్టారు. 2000 సంవత్సరంలో ఇది అందుబాటులోకి వచ్చింది. సాధారణంగా కొన్ని లోహాలకు కొందరికి అలర్జీ ఉంటుంది. దాన్నే మెటల్ సెన్సిటివిటీ అంటారు. టైటానియం వల్ల ఇటువంటి అలర్జీలు రావు. అంతేగాక టైటానియం కీలుకు గీతలు పడవు. కాబట్టి ఎక్కువ రోజులు మన్నుతుంది. ఇంతకు ముందు ఇంప్లాంట్ 5 ఏళ్లు మాత్రమే ఉండేది. ఇప్పుడు 20 ఏళ్లు ఉంటోంది. దీని తర్వాత బంగారు రంగులో ఉండే నైట్రోబియం ఆక్సైడ్‌తో చేసిన కీలు వచ్చింది. దీం తో కూడా అలర్జీ ఉండదు. ఎక్కువ కాలం ఉంటుంది. ఈ మూడు రకాల కీళ్లనూ ఇప్పుడు వాడుతున్నారు.

### కింద కూర్చోనిచ్చే కొత్త కీలు

మొబైల్ బేరింగ్ నీ - ఇటీవలి కాలంలో మరింత సౌకర్యవంతమైన ఇంప్లాంట్ అందుబాటులోకి వచ్చింది. దీన్ని మొబైల్ బేరింగ్ నీ అంటారు. కృత్రిమ కీలు లోని ప్లాస్టిక్ భాగం అటూ ఇటూ కదలగలిగేలా ఉంటుంది. దాంతో ఫ్రీగా, నాచురల్‌గా మూవ్‌మెంట్ ఉంటుంది. కాబట్టి కాలును ఎటువైపైనా ఫ్రీగా కదల్చగలుగుతారు.

హై ఫ్లెక్స్ నీ - ఈ ఇంప్లాంట్ అమరిస్తే మోకాళ్లు ఎక్కువ మడత పెట్టి కింద కూర్చోవచ్చు. ఇంతకుముందు కృత్రిమ కీలు అమరిస్తే కింద కూర్చోవడానికి వీలయ్యేది కాదు. వీటితో మాత్రం కింద కూర్చోవడం సాధ్యమవుతుంది. మనవాళ్లు కింద ఎక్కువగా కూర్చుంటారు కాబట్టి ఆసియా దేశాల వాళ్ల కోసం వీటిని ప్రత్యేకంగా తయారుచేశారు.

జెండర్ స్పెసిఫిక్ నీ - స్త్రీ, పురుషులకు విడివిడిగా ఉండే కృత్రిమ కీళ్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఆడవాళ్ల ఎముకలు మగవాళ్ల ఎముకల కన్నా మందం తక్కువగా ఉంటాయి. వాటికి తగినట్టుగా మరింత సున్నితమైన ఇంప్లాంట్స్ వచ్చాయి.

### అదే కీలుమార్పిడి.. ఆధునిక పద్ధతులు

కీలుమార్పిడి ఆపరేషన్ పద్ధతి ఏదైనా కృత్రిమంగా తయారుచేసిన ఇంప్లాంట్‌ను అమర్చడమే అసలు ప్రక్రియ. అయితే ఈ ఆపరేషన్ పద్ధతి ఎంత సౌకర్యవంతంగా, పేషెంట్ సేఫ్టీగా ఉన్నదనేది ముఖ్యం. అందుకే ఆపరేషన్ చేసే విధానంలో కూడా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది ఆధునిక ఆర్థోపెడిక్ వైద్యరంగం. మొదట్లో ఓపెన్ సర్జరీ చేసేవాళ్లు. దాంతో ఇన్‌ఫెక్షన్లు వచ్చేవి. పైగా ఎముకలను ఆనుకుని ఉండే లిగమెంట్లు దెబ్బతినేందుకు ఆస్కారం ఎక్కువగా ఉండేది. బలమైన కొత్త కొత్త యాంటిబయాటిక్స్ వచ్చాక ఇప్పుడు ఇన్‌ఫెక్షన్లు తగ్గాయి. కాని లిగమెంట్ ఇంజురీ అనేది కొన్నిసార్లు సమస్యగానే ఉండేది.

### నావిగేషన్ నుంచి రోబో దాకా..

ఆపరేషన్ చేసేటప్పుడు లిగమెంట్ బ్యాలెన్సింగ్ సరిగ్గా చూసుకోగలిగితే అవి దెబ్బతినేందుకు అవకాశం ఉండదు. ఇంతకు ముందు ఈ బ్యాలెన్స్ సాధ్యమయ్యేది కాదు. కట్స్‌లో అంటే ఇంప్లాంట్‌ను అమర్చడానికి ఎముకలను కట్ చేసేటప్పుడు వాటి కొలతల్లో తేడా వచ్చేది. కచ్చితంగా కొలతలు తీసుకోవడం సాధ్యమయ్యేది కాదు. ఈ సమస్యలను అధిగమించడానికి ఒక్కొక్కటిగా ఆధునిక చికిత్సా ప్రక్రియలు వచ్చాయి.

**నావిగేషన్ :** ఈ ప్రక్రియ 15 ఏళ్ల క్రితం అందుబాటులోకి వచ్చింది. కంప్యూటర్ ఆధారంగా మోకాలి కీలును రీప్లేస్ చేస్తారు. ఆపరేషన్ ప్లానింగ్ అంతా కంప్యూటర్‌లోనే చేస్తారు. ఆపరేషన్ ప్రక్రియ మాత్రం డాక్టర్ చేస్తారు. కంప్యూటర్ స్క్రీన్ మీద ఎముకలను, కీలును చూస్తూ, వాటిని గమనిస్తూ జాగ్రత్తగా ఆపరేషన్‌ను నిర్వహిస్తారు. అయితే డాక్టర్ ఆపరేషన్‌ను తన చేతులతోనే చేస్తాడు కాబట్టి పూర్తి కచ్చితత్వంతో, పర్‌ఫెక్ట్‌గా రాకపోవచ్చు. బ్లేడ్ వంగిపోవచ్చు. పక్కనున్న కణజాలాలకు తగలొచ్చు. వంద శాతం అక్యూరసీ ఉండదు.

**రోబోటిక్స్ :** 10 ఏళ్ల క్రితం వైద్యచికిత్సల్లోకి రోబో ప్రవేశించింది. రోబోటిక్ సర్జరీ అంటే ఆపరేషన్ అంతా రోబోనే చేసేయదు. రోబో సహాయంతో డాక్టర్ చేస్తారు. రోబో వల్ల ఎముక కటింగ్‌లో కచ్చితత్వం ఉంటుంది. ఎక్కువ తక్కువలు రావు. అయితే మొదట వచ్చిన రోబోను పూర్తి స్థాయిలో డాక్టరే కంట్రోల్ చేయాలి. రోబోకు హాప్టిక్ కంట్రోల్ ఉండేది కాదు. దీనివల్ల పక్కనున్న లిగమెంట్ కణజాలం డ్యామేజ్ అయ్యే అవకాశం ఉందనుకుంటే డాక్టర్ రోబోను ఆపాల్సి ఉండేది. అందుకే ఈ సమస్యను అధిగమించే కొత్త రోబో ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది.

### కీళ్లు కాపాడుకోవాలంటే...



మోకాళ్ల నొప్పులు.. కీళ్లనొప్పులు అంటూ బాధపడేవాళ్లను ప్రతి ఇంటా చూస్తూనే ఉంటాం. పనుల ఒత్తిడిలో కొంత.. బద్ధకంతో మరికొంత... వ్యాయామానికి సమయం కేటాయించలేకపోవడం, అధిక బరువు, స్థూలకాయం... ఆధునిక జీవనశైలి.. వెరసి చిన్న వయసులోనే మోకాళ్లనొప్పులతో బాధపడేవాళ్లు ఎక్కువ అవుతున్నారు. కాబట్టి మోకాళ్ల కీళ్లను కాపాడుకోవాలంటే ప్రధానంగా వాటిపై బరువు ఎక్కువగా పడకుండా చూసుకోవాలి. అందుకోసం అధిక బరువు, స్థూలకాయ సమస్యలు రాకుండా జాగ్రత్తపడాలి. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం మరవొద్దు. ముఖ్యంగా వాకింగ్ వల్ల మోకాలి కీళ్లకు మంచి పోషణ అందుతుంది. కాబట్టి అవి ఎక్కువకాలం పాడైపోకుండా ఉంటాయి. సాధ్యమైనంతవరకు ఎక్కువసేపు కింద మోకాళ్లు మడిచి కూర్చోకపోవడం మంచిది. మెట్లు ఎక్కువగా ఎక్కొద్దు.

### మాకో 4జి రోబో.. ప్రయోజనాలు

- నొప్పి తక్కువ. కాబట్టి రక్తస్రావం ఎక్కువగా ఉండదు.
- డిశ్చార్జి టైం తక్కువ. సర్జరీ అయిన తెల్లవారి నడుస్తారు. రెండోరోజే ఇంటికి వెళ్లిపోతారు.
- ప్రతి పేషెంటుకూ వారికి సరిపోయే జాయింట్‌నే రూపొందించి, అమర్చవచ్చు.
- ఈ సర్జరీని టోటల్ నీ రీప్లేస్‌మెంట్‌కే గాక పాక్షిక మోకాలి కీలు మార్పిడికి కూడా చేయవచ్చు.
- తుంటికీలు మార్పిడి దీంతో మాత్రమే చేయగలం.
- లిగమెంట్ ప్రొటెక్షన్ ఉంటుంది.
- ఇన్‌ఫెక్షన్ అవకాశం చాలా తక్కువ.
- వంద శాతం కచ్చితత్వంతో ఆపరేషన్ చేయొచ్చు.




### 4జి స్మార్ట్ రోబో

కీలుమార్పిడి సర్జరీలో మొన్నటికి మొన్న అందుబాటులోకి వచ్చిన రోబోటిక్ సర్జరీని మాకో రోబో సహాయంతో చేస్తారు. ఇది 4జి రోబో. స్మార్ట్ రోబో అంటారు. ఎముకలను కచ్చితంగా కట్ చేయడమే కాకుండా పక్కన కణజాలం, లిగమెంట్ డ్యామేజి కాకుండా ఆపుతుంది. డ్యామేజ్ అవబోతుందనేది ముందే గ్రహించి దానికదే కటింగ్‌ను ఆపుతుంది. మళ్లీ డాక్టర్ సరైన స్థానంలోకి బ్లేడ్‌ను తీసుకెళ్తేనే ఎముకను కట్ చేస్తుంది. దీన్నే హాప్టిక్ కంట్రోల్ అంటారు. డాక్టర్ పొరపాటున కూడా డ్యామేజ్ చేసేందుకు అవకాశం ఉండదు. కట్ చేయాల్సిన ఎముక భాగం నుంచి బ్లేడ్ పక్కకు జరుగుతుందంటే చాలు.. దానికదే అక్కడే ఆగిపోతుంది. అందువల్ల డ్యామేజ్ కాదు. దీన్ని సెమీ ఆటానమస్ రోబో అంటారు. అంటే రోబో, డాక్టర్ ఇద్దరూ కలిసి సర్జరీ చేస్తారు. సాధారణంగా వెయ్యి మందిలో ఒకరికి డాక్టర్ వల్ల తప్పులు జరుగుతుంటాయి. వాటికి కూడా రోబో వల్ల అవకాశం ఉండదు.

తుంటి జాయింట్ రీప్లేస్‌మెంట్‌కు ఈ రోబో మాత్రమే అందుబాటులో ఉంది. తుంటి భాగంలో బంతిగిన్నె కీలు ఉంటుంది. ఈ రకమైన కీలుకి ఈ రోబో మాత్రమే చేయగలదు. భవిష్యత్తులో భుజం కీలుకి కూడా ఈ రోబోతో చేయగల సర్జరీ అందుబాటులోకి రానుంది.

పార్షియల్ నీ రీప్లేస్‌మెంట్‌లో కీలులో అరిగిన భాగాన్ని మాత్రమే తీసేసి, ఆ భాగాన్ని మాత్రమే కొత్తది అమరుస్తారు. చిన్నవయసులో మోకాలు అరిగితే ఈ చికిత్స మంచి ఫలితాలను ఇస్తుంది. ఈ పార్షియల్ నీ రీప్లేస్‌మెంట్‌కి కూడా ఈ 4జి రోబో ఉపయోగపడుతుంది.

### సర్జరీ రోబో చేస్తుందా?!

రోబోతో సర్జరీ అనగానే రోబో సినిమాలో లాగా సర్జరీ అంతా అదే చేసేస్తుందనుకోవడం పొరపాటు. రోబో సహాయంతో డాక్టర్ సర్జరీని పూర్తి చేస్తారు. అయితే ఈ మాకో 4జి రోబోటిక్ సర్జరీలో ముందుగా కంప్యూటర్‌లో మోకాలు ఎట్లా ఉందో కనిపిస్తుంది. లిగమెంట్ బ్యాలెన్సింగ్‌ను కంప్యూటర్‌లో చూస్తూ అడ్జస్ట్ చేసుకోవచ్చు. సైజులు మార్చుకోవచ్చు. ఆయా సైజులను వారి మోకాలి ఎముకలకు అనుగుణంగా సెట్ చేసుకోవాలి. కంప్యూటర్‌లో ఒకవైపు హాప్టిక్ బౌండరీలు కనిపిస్తాయి. అంటే ఎముక ఉన్న భాగానికి అటూ ఇటూ బౌండరీ లైన్స్ ఉంటాయి. వాటి మధ్యలో మాత్రమే బ్లేడ్‌తో కట్ చేయాలి. ఆ బౌండరీలను దాటితే లిగమెంట్స్ డ్యామేజీ అవుతాయి. ఈ బౌండరీలను దాటకుండా రోబో నియంత్రిస్తుంది.

**డాక్టర్ ఎ.వి. గురవారెడ్డి**
మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సన్‌షైన్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్,హైదరాబాద్



# ఇక బైపాస్ సర్జరీ అవసరం లేదు!





గుండెపోటు గురించి విననివాళ్లు ఎవరూ ఉండరు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో రక్తసరఫరాకు అంతరాయం కలిగితే గుండెపోటు వస్తుందని మనకు తెలిసిందే. అయితే రక్తనాళాలు పూర్తిగా వందశాతం పూడుకుపోతే చికిత్స చేయడం కొంచెం కష్టమైన విషయమే. ఈ చికిత్సలో జపాన్ దేశ వైద్యులు ముందంజలో ఉన్నారు. ఇటీవలే జపాన్ నుంచి వచ్చిన ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మసాహిసా యమనే అపోలో హాస్పిటల్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ చికిత్స గురించి వివరించారు అపోలో వైద్యులు.

**జీ**వనశైలి వ్యాధులు విరుచుకుపడుతున్న ఆధునిక కాలమిది. మారిన జీవనశైలి తన పంజావిప్పుతున్నది. ఒకవైపు అధిక రక్తపోటు.. మరోవైపు మధుమేహం.. ఇంకోవైపు గుండెజబ్బులు.. మూకుమ్మడిగా దాడిచేస్తున్నాయి. బీపీ, డయాబెటిస్ వంటి జబ్బులున్నవాళ్లకు గుండెపోట్లు వచ్చే అవకాశం ఎక్కువ. అయితే వీళ్లలో నెమ్మది నెమ్మదిగా రక్తనాళాలు బ్లాక్ అయ్యేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది.

ఇలా అవి పూర్తిగా పూడుకుపోతాయి. సాధారణంగా 70 శాతం బ్లాక్ ఉన్నా హార్ట్ అటాక్ వస్తుంటుంది. కాని కొంతమందిలో చాలా నెమ్మదిగా బ్లాక్ అవుతూ వందశాతం బ్లాక్ అయ్యేదాకా గుండెపోటు రాదు. వీళ్లకు నడిస్తే ఆయాసం, ఛాతిలో నొప్పి వస్తుంది. కాని చాలామంది దీన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. అది క్రమంగా క్రానిక్ టోటల్ అక్లూజన్‌గా మారుతుంది.

అలా మొత్తం ధమని బ్లాక్ అయి, రక్తప్రసరణకు పూర్తి ఆటంకం కలుగుతుంది. 5 శాతం వాళ్లలో ఇలా ధమనులు పూర్తిగా బ్లాక్ అయి ఉంటాయి. ఇలాంటప్పుడు చాలా సందర్భాల్లో బైపాస్ సర్జరీ చేస్తుంటారు. కాని దీనికి కూడా ఆంజియోప్లాస్టీ ద్వారా స్టెంట్ అమర్చడం సాధ్యమే. కాని ఇందుకోసం చాలా అనుభవం, చాకచక్యం కావాలి. కొన్ని కొత్త మెడికల్ డివైస్‌లు కావాలి. దీనిలో ముందున్నారు జపాన్‌వాళ్లు. సర్జరీ కోసం ఛాతి ఓపెన్ చేస్తే అక్కడి నుంచి ఆత్మ బయటికి వెళ్లిపోతుందని జపాన్ వాళ్ల నమ్మకం. అందువల్ల సాధ్యమైనంత వరకు సర్జరీ జోలికి వెళ్లరు. అందుకే సర్జరీకి బదులుగా ఇంటర్వెన్షన్లను ప్రాక్టీస్ చేస్తారు. అందుకే వాళ్లకు మన కన్నా అనుభవం ఎక్కువ. వాళ్ల టెక్నాలజీ అడ్వాన్స్‌డ్‌గా ఉంటుంది. అందుకే జపాన్ డాక్టర్ మన డాక్టర్లకు తన అనుభవాన్ని నేర్పించడానికి వచ్చారు.

### సర్జరీ బదులు స్టెంటింగ్.. ఇలా సాధ్యం!

కరొనరీ ధమనులు పూర్తిగా బ్లాక్ అయినప్పుడు సర్జరీని అవాయిడ్ చేయడానికి చేసే ఈ చికిత్సను ఆంజియోప్లాస్టీ ఫర్ టోటల్లీ బ్లాక్‌డ్ ఆర్టరీ అంటారు. సాధారణంగా పూర్తిగా రక్తనాళాలు పేరుకుపోయినప్పుడు మన దగ్గర 60 నుంచి 70 శాతం కేసులు ఓపెన్ సర్జరీనే చేస్తున్నాం. మిగిలిన కొన్ని కేసులకు మాత్రం ఈ ప్రక్రియ ద్వారా స్టెంట్ వేస్తున్నాం. జపాన్ వాళ్లు 90 నుంచి 100 శాతం సర్జరీ లేకుండానే ఆంజియోప్లాస్టీ ద్వారానే చికిత్స చేస్తున్నారు. అయితే మనకు 70 శాతం సక్సెస్ రేటు ఉంటే, వాళ్లకు 90 నుంచి 100 శాతం సక్సెస్ రేటు ఉంటుంది.

ఇలా రక్తనాళాలు పూర్తిగా పూడుకుపోయినప్పుడు రక్తనాళంలోకి బెలూన్, వైర్ పంపించడం కూడా కష్టం కావొచ్చు. అందుకే రెండుమూడేళ్ల క్రితం ఆధునిక వైర్లను తీసుకొచ్చారు జపాన్ వాళ్లు. వీటి సాయంతో స్టెంట్‌ను పంపించడం సులువైంది. మైక్రో కెథటర్, స్టెంటింగ్ కోసం వాడే పరికరాలను పంపించే వైర్లు వేరుగా ఉంటాయి. స్టెంట్స్ మాత్రం అవే అయినప్పటికీ వాటిని పంపించడానికి వాడే మెడికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఆధునికమైనవి కావడం వల్ల 90 నుంచి వంద శాతం మంచి ఫలితాలను సర్జరీ లేకుండానే పొందవచ్చు.

**డాక్టర్ పి.సి.రథ్**
డైరెక్టర్, కాథ్‌ల్యాబ్ అండ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ
అపోలో హాస్పిటల్స్
హైదరాబాద్



# అన్ని ఫ్లూ జ్వరాలకీ ఒకే వ్యాక్సిన్!



**జ**లుబు, దగ్గులతో అతలాకుతలం చేసేది ఫ్లూ. ఇప్పటికే కొన్ని రకాల ఫ్లూ వైరస్‌లకి వ్యాక్సిన్లు ఉన్నాయి. కాని కొన్ని రకాల వైరస్‌ల వల్ల కలిగే ఫ్లూని ఏమీ చేయలేకపోతున్నాం. అయితే ఇప్పుడు అన్ని రకాల ఫ్లూ వైరస్‌లనూ నియంత్రించడానికి ఒకే వ్యాక్సిన్‌ను రూపొందించడానికి కసరత్తు జరుగుతోంది. జలుబుకు మందులు వాడితే వారంరోజుల్లో వాడకపోతే ఏడు రోజుల్లో తగ్గుతుందని ఓ మాట ఉండనే ఉంది. అంటే జలుబును నియంత్రించే సరైన చికిత్స లేదని అర్థం. జలుబు కొన్ని వేల రకాల వైరస్‌లలో ఏదో ఒకదానివల్ల కలుగుతుంది. ఇవన్నీ ఫ్లూ వైరస్‌లే. అందుకే ఇన్ని రకాల వైరస్‌లకు వ్యాక్సిన్లు తయారుచేయడం కష్టమైంది. కాని ఇప్పుడు అన్నిటికీ కలిపి ఒకే వ్యాక్సిన్‌ను తీసుకొచ్చే పనిలో ఉన్నారు పరిశోధకులు. ఫ్లూ వైరస్‌ల ఉపరితలం మీద హీమాగ్లుటినిన్ అనే ప్రొటీన్ ఉంటుంది. హోస్ట్ కణాలపై దాడి చేయడానికి ఇదే మార్గదర్శనం చేస్తుంది. ఈ ప్రొటీన్ వల్లనే వైరస్ మనల్ని ఇన్‌ఫెక్ట్ చేస్తుంది. ఈ హీమాగ్లుటినిన్‌లో తల (హెడ్), తోక (స్టాక్) అనే రెండు భాగాలుంటాయి. వీటిలో తల భాగం అన్ని వైరస్‌లలో ఒకేలా ఉండదు. కాని స్టాక్ మాత్రం దాదాపుగా ఒకేలా ఉంటుంది. అందువల్ల హీమాగ్లుటినిన్ స్టాక్‌ను టార్గెట్ చేస్తూ వ్యాక్సిన్‌ను తయారుచేయవచ్చని భావిస్తున్నారు సైంటిస్టులు. ఇందుకోసం కైమెరిక్ హీమాగ్లుటినిన్ అనే ప్రొటీన్ రకంపై పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఈ పరిశోధనలు విజయవంతం అయితే యూనివర్సల్ ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్ రాక ఎంతో దూరంలో ఉండదంటున్నారు ప్రొఫెసర్ ఫ్లోరియన్ క్రామర్.

# నిపుణ

రాష్ట్రంలోని అన్ని రకాల గురుకుల పాఠశాలల్లో ఐదోతరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశపరీక్ష ప్రకటన విడుదలైంది.

## — విద్య ఉద్యోగ సమాచారం —

### యూపీఎస్సీ

కేంద్రంలోని పలు విభాగాల్లో కింది పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 53
- **పోస్టులు:** సైంటిస్ట్, అసిస్టెంట్ జియోఫిజిసిస్ట్, సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్, సిస్టమ్ అనలిస్ట్, స్పెషలిస్ట్, ఇంగ్లిష్ లెక్చరర్, వెటర్నరీ అసిస్టెంట్‌తోపాటు ఇతర పోస్టులు ఉన్నాయి.
- **అర్హతలు:** పోస్టుని బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, ఎంబీబీఎస్, ఎండీ/ ఎంఎస్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 27
- **వెబ్‌సైట్:** https://www.upsconline.nic.in

### గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు



- **తరగతి:** ఐదోతరగతి (2020-21) ఇంగ్లిష్ మీడియం.
- రాష్ట్ర ప్రభుత్వం కేజీ టు పీజీ మిషన్‌లో భాగంగా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, విద్యాశాఖల గురుకుల పాఠశాలల్లో 2020-21 విద్యాసంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలు.
- **ఎంపిక విధానం:** ఉమ్మడి ప్రవేశపరీక్ష ద్వారా
- **పరీక్షతేదీ:** ఏప్రిల్ 12 (ఉదయం 11 నుంచి 1 గంట వరకు)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఫీజు:** రూ.100/-
- **చివరితేదీ:** మార్చి 1
- **వెబ్‌సైట్:** https://www.tswreis.in/ https://mjpabcwreis.cgg.gov.in

### దుర్గాపూర్ నిట్‌లో

దుర్గాపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 6
- **పోస్టులవారీగా ఖాళీలు:** మెడికల్ ఆఫీసర్-3, నర్స్ అసిస్టెంట్-3.
- **అర్హత:** డిప్లొమా (జీఎన్‌ఎం)/ బీఎస్సీ (నర్సింగ్), ఎంబీబీఎస్ ఉత్తీర్ణత, అనుభవం.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్‌టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 14
- **వెబ్‌సైట్:** https://nitdgp.ac.in

### ఢిల్లీ హైకోర్టులో




న్యూఢిల్లీలోని హైకోర్ట్ ఆఫ్ ఢిల్లీలో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 132
- **పోస్టు:** జూనియర్ జ్యుడీషియల్ అసిస్టెంట్/రిస్టోరర్ (గ్రూప్ సీ)
- **అర్హతలు:** డిగ్రీతోపాటు నిమిషానికి 35 పదాల టైపింగ్ సామర్థ్యం కలిగి ఉండాలి.
- **వయస్సు:** 2020, జనవరి 1 నాటికి 18-27 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 19 నుంచి
- **చివరితేదీ:** మార్చి 11
- **వెబ్‌సైట్:** www.delhihighcourt.nic.in

నమస్తే తెలంగాణ
# ఆట
12
[ కరీంనగర్ ]
మంగళవారం 11 ఫిబ్రవరి 2020
WWW.NTNEWS.COM




# పరువు దక్కేనా!

నేడు భారత్, న్యూజిలాండ్ మూడో వన్డే

వైట్‌వాష్ అడ్డుకోవాలని టీమ్‌ఇండియా..

క్లీన్‌స్వీప్ చేయాలని న్యూజిలాండ్

ఉదయం 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

టీ20 సిరీస్‌లో భాగంగా పది రోజుల క్రితం మౌంట్ మాంగనీలో జరిగిన చివరి మ్యాచ్‌కు ఇప్పటికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

పొట్టి సిరీస్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌లు నెగ్గి ఇక్కడి బే ఓవల్ పిచ్‌పై అడుగుపెట్టిన టీమ్‌ఇండియా.. ఆఖరి మ్యాచ్‌లోనూ విజయం సాధించి సిరీస్ క్లీన్ స్వీప్ చేసింది.

వన్డే సిరీస్‌కు వచ్చేసరికీ.. ఆ అవకాశం కివీస్ ముందు నిలిచింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడి ఇప్పటికే సిరీస్ కోల్పోయిన కోహ్లీ సేన.. వైట్‌వాష్ పరాభావం తప్పించుకోవాలంటే తప్పక రాణించాల్సిన స్థితిలో మూడో మ్యాచ్‌కు రెడీ అవుతున్నది.

రోహిత్, ధవన్ గైర్హాజరీలో రన్‌మెషీన్ విరాట్ కోహ్లీ.. టాపార్డర్‌ను ముందుండి నడిపించాల్సిన అవసరముంది. గత మూడు మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్ పడగొట్టలేకపోయిన బుమ్రా తిరిగి గాడిన పడితే.. ప్రత్యర్థికి కష్టాలు తప్పక పోవచ్చు. రెగ్యులర్ కెప్టెన్ లేకుండానే సిరీస్ పట్టేసిన న్యూజిలాండ్.. కేన్ రాకతో మరింత పటిష్ఠంగా మారింది. మరి ఇరు జట్లలో సత్తాచాటేవారెవరో చూసేందుకు రెడీనా.. ఇంకెందుకు ఆలస్యం మ్యాచ్ ఉదయం ఏడున్నరకే ప్రారంభం..

**మౌంట్ మాంగనీ:** కివీస్ గడ్డపై పొట్టి సిరీస్‌ను వైట్‌వాష్ చేసిన టీమ్ ఇండియా.. వన్డే సిరీస్‌లో అదే జోరు కొనసాగించ లేక తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడి సిరీస్ కోల్పో యింది. ఇక మిగిలిన ఆఖరి వన్డేలో మంగళవారం న్యూజిలాం డ్‌తో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది. 1989లో వెస్టిండీస్ చేతిలో వైట్‌వా ష్‌కు గురైన తర్వాత.. మూడు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల సిరీస్‌ల్లో భారత్ అన్ని మ్యాచ్‌లు ఓడలేదు. మరి ఈ రికార్డును నిలుపుకుంటూ.. టెస్టు సిరీస్‌కు ముందు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలంటే చివరి వన్డేలో విరాట్ సేన విజృంభించాల్సి ఉంటుంది. ముఖ్యంగా టాపార్డర్ వైఫల్యంతో భారత్ గత రెండు మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది. కొత్త ఓపెనర్లు మయాంక్ అగర్వాల్, పృథ్వీ షా మంచి ఆరంభా లను భారీ స్కోరుగా మలచడంలో విఫ లమవుతున్నారు. ఈ సారైనా బ్యాట్స్‌మెన్ సమిష్టిగా కదం తొక్కుతారా.. లేక న్యూజి లాండ్‌కు తలవంచుతారా చూడాలి. మరో వైపు రెగ్యులర్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అందుబాటులో లేకున్నా.. తొలి రెండు మ్యాచ్‌ల్లో సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ చెలరేగడంతో విజయాలు సాధించిన న్యూజి లాండ్.. చివరి వన్డేలోనూ నెగ్గి టీ20 సిరీస్ ఫలితానికి బదులు తీర్చుకోవాలనుకుంటు న్నది.

**విరాట్ విజృంభిస్తేనే..**

ఇప్పటికే సిరీస్ కోల్పోయిన బాధలో ఉన్న టీమ్‌ఇండియా.. చివరి మ్యాచ్‌లో ప్రయోగా లకు తెరతీస్తుందా చూడాలి. కివీస్ పర్యట నలో ఒక్క మ్యాచ్ కూడా ఆడని రిషబ్ పంత్‌కు తుది జట్టులో చోటు దక్కాలంటే.. ఫుల్ ఫామ్‌లో ఉన్న లోకేశ్ రాహుల్‌కు విశ్రాం తినివ్వాల్సి ఉంటుంది. కెప్టెన్ నమ్మకాన్ని సంపాదించిన రాహుల్‌ను కాదని పంత్‌కు అవకాశం దక్కడం కష్టమే. అయితే సోమ వారం ఆప్షనల్ ప్రాక్టీస్ సందర్భంగా రాహుల్ గ్రౌండ్‌లోకి రాకపోగా.. పంత్ సుదీర్ఘంగా బ్యాటింగ్ చేస్తూ కనిపించాడు. మిడిలార్డర్‌లో కేదార్ జదావ్ స్థానంలో మనీశ్ పాండే, శివం దూబేల్లో ఒకరిని ఎంపిక చేయొచ్చు. ఆల్‌రౌం డర్ కోటాలో రవీంద్ర జడేజా చక్కటి ప్రదర్శన కనబరుస్తుండటంతో అతడిని తప్పించే అవ కాశాలు లేనట్లే. నయా ఓపెనర్లు మయాంక్, పృథ్వీ షా కాస్త సంయమనం చూపాలి. రెండో వన్డేలో చేసిన పరుగులన్నింటినీ బౌండ్రీల ద్వారానే రాబట్టిన పృథ్వీ.. స్ట్రయిక్ రొటేషన్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరముంది. ఈ ఏడాది ఇప్పటికే చాలా మ్యాచ్‌లు ఆడినా.. కోహ్లీ ఒక్క సెంచరీ కూడా నమోదు చేయలేదు. మరి కీలక టెస్టు సిరీస్ ముందు కెప్టెన్ బ్యాట్ నుంచి భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నట్లే. నాలుగో స్థానంలో స్థిరపడుతున్న శ్రేయాస్ అయ్యర్.. మరోమారు చెలరేగాల్సిన అవసరముంది. బౌలింగ్ విషయానికొస్తే.. స్వింగ్‌కు సహకరి స్తున్న పిచ్‌పై గత మ్యాచ్‌లో మనవాళ్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ముఖ్యంగా చివరి ఓవర్లలో టేలర్, జెమీసన్ జోడీని విడ దీయలేకపోవడంతో ఆ జట్టు పోరాడే స్కోరు చేయగలిగింది. యార్కర్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా గత మూడు మ్యాచ్‌ల్లో వికెట్ తీయ లేకపోవడంతో టీమ్ మేనేజ్‌మెంట్‌లో ఆందో ళన పెంచుతున్నది.

**కేన్ రాకతో కివీస్ మరింత బలంగా..**

విలియమ్సన్ రాకతో న్యూజిలాండ్ బ్యాటింగ్ బలం పెరిగినా.. ఆ జట్టును గాయాలు వెంటా డుతున్నాయి. గత మ్యాచ్‌లో చక్కటి ప్రదర్శన కనబరిచిన సౌథీ అనారోగ్యంతో ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా అనేది అనుమా నంగా మారింది. రెండో వన్డేలో సబ్‌స్టిట్యూట్ ఫీల్డింగ్ చేసేందుకు కూడా ఆటగాళ్లు అందుబా టులో లేకపోవడంతో.. జట్టు ఫీల్డింగ్ కోచ్ ల్యూక్ రోంచీ మైదానంలో దిగాల్సి వచ్చింది. ఇది కాస్త విమర్శలకు దారితీయడంతో.. సోధీ, టిక్నర్‌లకు మేనేజ్‌మెంట్ పిలుపా చ్చింది. ఓపెనర్లు గప్టిల్, నికోల్స్ జోరు మీదుండగా.. మిడిలార్డర్‌లో టేలర్, లాథమ్ అదరగొడుతున్నారు. తొలి వన్డేలో భారీ లక్ష్యం ముందున్నా.. టేలర్ తన అనుభవా న్నంతా రంగరించి సూపర్ సెంచరీతో మ్యాచ్ గెలిపించిన విషయం తెలిసిందే. ఈ లైనప్‌కు విలియమ్సన్ కూడా జత కలిస్తే.. అగ్నికి వాయువు తోడైనట్లే.

### తుది జట్లు (అంచనా)

భారత్: కోహ్లీ (కెప్టెన్), పృథ్వీ షా, మయాంక్, అయ్యర్, రాహుల్/పంత్, జాదవ్/పాండే, శార్దూల్, చాహల్, కుల్దీప్, సైనీ, షమీ/బుమ్రా.

న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), గప్టిల్, నికోల్స్, టేలర్, లాథమ్, నీషమ్, గ్రాండ్‌హోమ్, సౌథీ, జెమీసన్, సోధి/శాంట్నర్, బెనెట్/కుగ్‌లిన్.

### పిచ్, వాతావరణం

బే ఓవల్ పిచ్ మందకొడిగా ఉండనుంది. ఇరు జట్ల మధ్య ఇక్కడ జరిగిన మ్యాచ్‌ల్లో బౌలర్లకు సహకారం లభించింది. మ్యాచ్ రోజు వర్ష సూచన లేదు.


సౌథీ

## కోహ్లీని ఔట్ చేయడం ఎప్పుడూ ప్రత్యేకమే

**మౌంట్ మాంగనీ:** పిచ్ నుంచి సహ కారం లభించడం వల్లే భారత కెప్టెన్ విరాట్ కోహ్లీని ఎక్కువసార్లు ఔట్ చేయగలిగానని న్యూజిలాండ్ పేసర్ టిమ్ సౌథీ పేర్కొన్నాడు. అయితే ఈ ఘనత సాధించిన విషయం కూడా తనకు తెలియదని అతడు చెప్పాడు. 'కోహ్లీ అద్భుతమైన ఆటగాడు. అత డిలో ఎక్కువ బలహీనతలు లేవు. కొత్త బంతితో బౌలింగ్ చేస్తున్న సమ యంలో పిచ్ నుంచి సహకారం లభించింది. సరైన ప్రాంతాల్లో బంతులు సంధిస్తే.. కచ్చితంగా ఫలి తాలు వస్తాయి. విరాట్ గొప్ప క్రికె టర్, మంచి ఫామ్‌లో ఉన్నాడు. లక్ష్య ఛేదనల్లో అతడు ఏ రేంజ్‌లో చెలరేగుతాడో అందరికి తెలిసిందే. అందుకే అతడిని ఔట్ చేయడం బాగుంటుంది. ఎక్కువసార్లు నేనే పెవిలియన్ పంపిచాననే విషయం తెలియదు.' అని సౌథీ అన్నాడు. రెండో వన్డేలో భారత కెప్టెన్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన సౌథీ.. అన్ని ఫార్మాట్లలో కలిపి కోహ్లీని తొమ్మిది సార్లు ఔట్ చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లీని ఎక్కువ సార్లు ఔట్ చేసిన బౌలర్‌గా ఘనత సాధించాడు.

## క్రీడాకారులకు జీవితాంతం పెన్షన్

**న్యూఢిల్లీ:** క్రీడాకారులకు జీవి తాంతం పెన్షన్ అందిస్తామని కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ కిరణ్ రిజిజు సోమవారం పేర్కొన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో కిరణ్ లిఖితపూర్వక సమాధానమిస్తూ ప్రస్తుతం దేశంలో 627 మంది క్రీడాకారులకు నెలనెలా పెన్షన్ ఇస్తు న్నామని స్పష్టం చేశారు. అంతర్జా తీయ టోర్నీలైన ఒలింపిక్స్, కామ న్వెల్త్, ఆసియా గేమ్స్, ప్రపంచక ప్‌లో రాణించిన వారు జీవి తాంతం పెన్షన్ అందుకునేందుకు అర్హులని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. పెన్షన్ కింద నెలనెలా రూ.12 వేల నుంచి 20 వేల వరకు క్రీడాకారులు పొందుతారని ఆయన అన్నారు. జీవిత చరమాంకంలో తోడ్పాటు లేకుండా కష్టాలు ఎదు ర్కొంటున్న క్రీడాకారులకు కూడా ప్రభుత్వం చేయూతనందిస్తుందని రిజిజు తెలిపారు.

## ఐసీసీ జట్టులో యశస్వి, రవి, కార్తీక్



**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించిన అండర్-19 ప్రపంచకప్ జట్టులో భారత్ నుంచి ముగ్గురు ఆటగాళ్లకు చోటు దక్కింది. టోర్నీలో అత్యధిక పరుగులు (400) చేసిన ఓపెనర్ యశస్వి జైస్వాల్, అత్య ధిక వికెట్లు (17) తీసిన లెగ్ స్పిన్నర్ రవి బిష్ణో య్‌తో పాటు పేసర్ కార్తీక్ త్యాగి జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ జట్టుకు బంగ్లా కెప్టెన్ అక్బర్ అలీ సారథిగా ఎంపికయ్యాడు. భారత్, బంగ్లాదేశ్ నుంచి ముగ్గురు ఆటగాళ్లు.. వెస్టిండీస్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఇద్దరేసి ప్లేయర్లు శ్రీలంక నుంచి ఒకరు ఈ జట్టులో చోటు దక్కించుకున్నారు. కెనడాకు చెందిన అఖిల్ కుమార్ పన్నెండో ఆటగాడిగా ఎంపికయ్యా డు. ఆదివారం జరిగిన అండర్-19 ప్రపంచ కప్ ఫైనల్లో బంగ్లాదేశ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధ తిలో 3 వికెట్ల తేడాతో యువ భారత్‌పై గెలిచిన విషయం తెలిసిందే.

**ఐసీసీ అండర్-19 జట్టు**

యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్, కార్తీక్ త్యాగి (భారత్), అక్బర్ అలీ (కెప్టెన్), మహ్మదుల్ హసన్, షహాదత్ హుసేన్ (బంగ్లాదేశ్), ఇబ్రహీం జద్రాన్, షఫీఖుల్లా గఫారీ (ఆఫ్ఘని స్థాన్), రవిందు రసంత (శ్రీలంక), నీమ్ యాంగ్, జైడెన్ సీల్స్ (వెస్టిండీస్), అఖిల్ కుమార్ (12వ ఆటగాడు, కెనడా).

## మాస్టర్ అభినందన మనసును తాకింది


లబుషేన్

**సిడ్నీ:** క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నుంచి అభినందనలు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆసీస్ యువ ఆటగాడు మార్నస్ లబుషేన్ పేర్కొన్నాడు. 'సచిన్ అభి నందించడం అద్భుతంగా అనిపిస్తున్నది. అతడి స్పందన నా హృదయాన్ని తాకింది. దిగ్గజానికి నా కృతజ్ఞతలు. ఈ వార్త చదవ గానే ఉద్వేగానికి గురయ్యా' అని లబుషేన్ అన్నాడు. యాషెస్ సిరీస్ సందర్భంగా రెండో మ్యాచ్‌లో లబుషేన్ బ్యాటింగ్‌ను ప్రత్యక్షంగా తిలకించిన సచిన్.. 'చక్కటి ఫుట్‌వర్క్ కనబ రుస్తున్న ఈ ఆటగాడిలో ఏదో ప్రత్యేకత ఉంది. ఇతడి స్ట్రోక్‌ప్లే అచ్చం నాలాగే ఉంది' అని ఇటీవలే పేర్కొన్నాడు. దీనిపై తాజాగా స్పందించిన లబుషేన్ మాస్టర్ బ్లాస్టర్‌కు కృత జ్ఞతలు తెలిపాడు.


బెలిండా క్లార్క్, అలెన్ బోర్డర్ అవార్డులు దక్కించుకున్న ఆస్ట్రేలియా క్రికెటర్లు ఎలీస్ పెర్రీ, డేవిడ్ వార్నర్

# సాయిప్రణీత్‌పైనే భారం



నేటి నుంచి ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్

**మనీలా (ఫిలిప్పీన్స్):** ఇటీవలి కాలంలో పెద్దగా ఆకట్టుకోలేక పోతున్న భారత షట్లర్లు మరో మెగాటోర్నీకి సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు బరిలో దిగ నుంది. ఈ ఏడాదే ఒలింపిక్స్ జరుగనున్న నేపథ్యంలో ర్యాంకింగ్ పాయింట్లు పెంచుకోవడంతో పాటు లయ దొర కబుచ్చుకునేందుకు మన వాళ్లకు ఇది చక్కటి అవకాశం. కరోనా వైరస్ భయంతో భారత మహిళల జట్టు చాంపియ న్‌షిప్ నుంచి తప్పుకోగా.. పురుషుల టీమ్ మాత్రమే పోటీలో నిలిచింది. ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్, వరల్డ్ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సాయి ప్రణీత్ మన జట్టును ముందుండి నడిపించను న్నారు. వీరితో పాటు హెచ్‌ఎస్.ప్రణయ్, శుభంకర్ డే, లక్ష్య సేన్ జట్టులో ఉన్నారు. 'కరోనా' కారణంగా చైనా, హాంకాంగ్ జట్లు టోర్నీ నుంచి తప్పుకోవడంతో.. 'డ్రా'ను మార్చారు. ప్రస్తుతం మలేషియా, కజకిస్థాన్‌తో కలిసి భారత్ గ్రూప్ 'బి'లో ఉంది. నాలుగు గ్రూప్‌ల్లో అగ్రస్థా నాల్లో నిలిచిన రెండేసి జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిం చనున్నాయి. భారత జట్టు తొలి మ్యాచ్‌లో మంగళవారం కజకిస్థాన్‌తో తలపడనుంది.

# బంగ్లా ఆటగాళ్ల తీరు ఘోరం



**పోచెఫ్‌స్ట్రూమ్:** ప్రపంచకప్ గెలిచిన తర్వాత బంగ్లాదేశ్ ఆటగాళ్ల ప్రవర్తన మరీ ఘోరంగా ఉందని భారత అండర్-19 కెప్టెన్ ప్రియమ్ గార్గ్ అన్నాడు. వర్షం అంతరాయం కల్గించిన ఆదివారం నాటి ప్రపంచకప్ ఫైనల్లో భారత్‌పై గెలిచిన తర్వాత బంగ్లా క్రికెటర్లు క్రీడాస్ఫూర్తిని మరిచి ప్రవర్తించారు. మైదానంలో ఉన్న టీమ్ ఇండియా క్రికెటర్ల మీదికి దూసుకొస్తూ వెకిలి చేష్టలతో ఊగిపోయారు. మధ్యలో అంపైర్లు కలుగజేసుకోవడంతో సద్దుమణిగింది. ప్రపం చకప్ గెలిచినా..బంగ్లా జట్టు క్రీడాస్ఫూర్తిని మంటగలిపిందంటూ అభిమానులు సోషల్ మీడియాలో తమదైన రీతిలో అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో గార్గ్ స్పందిస్తూ 'ఆటలో గెలుపొటములు అనేవి సహజం. ఒక సారి గెలుస్తాం, మరోసారి ఓడిపోతాం. అంతే గానీ గెలిచిన తర్వాత మరి హద్దులు మీరి ప్రవ ర్తించకూడదు. బంగ్లా ఆటగాళ్ల ప్రవర్తన ఘోరం. అసభ్య పదజాలంతో మా మీదికి దూసుకొ చ్చారు' అని గార్గ్ అన్నాడు. మరోవైపు బంగ్లా కెప్టెన్ అక్బర్ అలీ మాట్లాడుతూ 'ఏదైతే జరి గిందో అది జరుగకూడనిది. అసలు ఏం జరి గిందో నాకు సరిగ్గా తెలియదు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో భావోద్వేగాలు అదుపులో ఉంచుకోవడం చాలా కష్టం. కానీ కొంతమంది క్రికెటర్లు అతిగా ప్రవర్తించారు. అలా చేయా ల్సింది కాదు. జెంటిల్మన్‌గేమ్‌లో ప్రత్యర్థిని గౌర వించాల్సిందే. జట్టు తరపున నేను క్షమాపణ చెబుతున్నాను' అని అన్నాడు.

**ఐసీసీ సీరియస్‌గా..**

ఫైనల్ మ్యాచ్‌లో బంగ్లా ఆటగాళ్ల ప్రవర్తన తీరుపై ఐసీసీ సీరియస్‌గా ఉందని భారత జట్టు మేనేజర్ అనిల్ అన్నాడు. మ్యాచ్‌లో జరి గిన దానిపై ఐసీసీ సీరియస్‌గా ఉందని, టీవీ ఫుటేజీని అనుసరించి చర్యలు తీసుకునే అవ కాశముందని రిఫరీ గ్రేమ్ పేర్కొన్నాడు.

# కల నిజమాయే..!



**న్యూఢిల్లీ:** చిన్నప్పటి నుంచి దేవుడిలా కొలిసిన వ్యక్తిని నేరుగా కలిసే అవకాశం వస్తే.. ఆ అభి మాని ఆనందానికి అవధులే ఉండవు. అచ్చం ఇలాంటి సంఘటనే భారత మహిళల జట్టు యువ ప్లేయర్ షఫాలీ వర్మకు ఎదురైంది. ఊహ వచ్చినప్పటి నుంచి సచిన్ టెండూల్క ర్‌నే దైవంగా భావిస్తూ.. అతడినే అభిమా నిస్తూ, ఆరాధిస్తూ పెరిగిన ఈ పదహారేండ్ల చిచ్చర పిడుగు తాజాగా క్రికెట్ దిగ్గజాన్ని కలి సింది. సోమవారం సచిన్‌ను కలిసిన షఫాలీ ఆ చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచు కుంది. 'సచిన్ సార్‌ను ఆదర్శంగా తీసుకునే క్రికెట్‌లో అడుగు పెట్టా. నాతో పాటు మా కుటుంబం మొత్తం ఆయనకు వీరాభిమా నులం. అభిమానులం అనేదానికంటే భక్తు లం అనడం సరైందేమో. ఈ రోజు నా జీవి తంలో మర్చిపోలేను. కల నిజమైనట్లు అనిపి స్తున్నది' అని ఇన్‌స్టాలో రాసుకొచ్చింది.

# పాక్ ఇన్నింగ్స్ విజయం

**రావల్పిండి:** బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ ఘనవిజయం సాధించింది. ఆల్‌రౌండ్ విజృంభణతో నాలుగు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 44 పరుగుల తేడాతో పాక్ జయభేరి మోగించింది. ఓవర్‌నైట్ స్కోరు 126/6తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగిం చిన బంగ్లా.. 168 పరుగులకు ఆలౌటైంది. అంతకుముందు బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 233 పరుగులకు ఆలౌటవగా.. పాకిస్థాన్ 445 పరు గులు చేసింది. పాక్ బౌలర్లలో నసీమ్ షా, యాసిర్ షా చెరో 4 వికెట్లు పడగొట్టారు. అతిపిన్న వయసులో టెస్టు హ్యాట్రిక్ నమోదు చేసిన నసీ మ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

**అబు జయేద్‌కు జరిమానా**

మైదానంలో అత్యుత్సాహం ప్రదర్శించిన బంగ్లా పేసర్ అబు జయేద్‌పై ఐసీసీ చర్యలు తీసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ కెప్టెన్ అజహర్ అలీ వికెట్ తీసిన సమయంలో హద్దులు దాటి సంబురాలు జరుపుకోవడంతో జయేద్ ఖాతాలో ఒక డీ మెరిట్ పాయింట్ చేరింది. 'ఆర్టికల్ 2.5 ప్రకారం అతడి (అబు జయేద్)పై చర్యలు తీసుకున్నాం' అని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

# రహానే అజేయ శతకం

భారత్-ఏ, న్యూజిలాండ్-ఏ రెండో అనధికారిక టెస్టు 'డ్రా'



**లింక్లిన్:** కివీస్ గడ్డపై టెస్టు సిరీస్ ప్రారంభానికి ముందు భారత టెస్టు ఆటగాళ్లకు చక్కటి ప్రాక్టీస్ లభించిన ట్లైంది. న్యూజిలాండ్-ఏతో జరిగిన రెండో అనధికారిక టెస్టు (నాలుగు రోజులు)లో టీమ్‌ఇండియా బ్యాట్స్ మెన్ అదరగొట్టడంతో చివరకు మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ (136; 15 ఫోర్లు, 2 సిక్సర్లు), అజింక్యా రహానే (101 నాటౌట్; 15 ఫోర్లు, ఒక సిక్స్) శతకాలు బాదగా.. విహారి (59), పుజారా (53), విజయ్ శంకర్ (66) రాణించారు. ఫలితంగా భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 467 పరుగులు చేసింది. అంతకుముందు న్యూజిలాండ్-ఏ 386/9 వద్ద మొదటి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే. ఇరు జట్ల మధ్య జరిగిన తొలి అనధికారిక వన్డే కూడా 'డ్రా'గానే ముగిసింది.

**సంక్షిప్త స్కోర్లు**

న్యూజిలాండ్-ఏ తొలి ఇన్నింగ్స్: 386/9 డిక్లేర్డ్ (డారిల్ మిషెల్ 103, ఫిలిప్స్ 65; సందీప్ వారియర్ 2/50), భారత్-ఏ తొలి ఇన్నింగ్స్: 467/5 (గిల్ 136, రహానే 101 నాటౌట్; నుటాల్ 2/98).



Authorised Dealers For Bajaj Auto Ltd.: Karimnagar STANDARD BAJAJ 08782-276545, 9848576545, VENKAT BAJAJ 9703614888, 8008796695 • Mancherial MAHI BAJAJ 08736-259088 ,9912278641 • Adilabad SRR MOTORS 9491249451,9491159452. Authorised Service Centre: JAGITIAL 8522038460, 9949565692, SIRICILLA 8309314141, METPALLY 9866766607, KORUTLA 9440653412, HUZURABAD 9440682444, VEMULAWADA 9866838847, PEDDAPALLY 9849362096, ARMOOR 9866669181, Balkonda 9059412880, Banswada 6305184613, Nandipet 9493021116, BODHAN 9440414119, KAMAREDDY 9849852992, Kamarpally 9010686085, BHEEMGAL 9912334501, RAMAGUDAM 9912278650, JANNARAM 9440004495, BELLAMPALLI 9849686258, KAGAZNAGAR 9491344501, ASIFABAD 9440838208 CHENNUR 9949993645, NIRMAL 9912663515, BHAINSA 8341437171, KHANAPUR 9440229720, KADEM 9440586978, NIRMAL 9491777000, GAJWEL 9848347349, MEDAK 7702014433, SIDDIPET 7702015577.